# మనం

జనం కోసం అక్షర యజ్ఞం..

హైదరాబాద్ - మంగళవారం 8 జూలై 2025 | సంపుటి: 9 | సంచిక: 190 | పేజీలు:12 | వెల రూ.5

HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | GUNTUR | TIRUPATI | KURNOOL | ELURU | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA


## కబడ్డీ ఆడిన మంత్రులు



హుస్నాబాద్‌లో పర్యటించిన పొన్నం, వాకిటి 2

## బ్యాంకును ముంచెత్తిన వరద నీరు



తమ నగదు, బంగారం డిపాజిట్లపై ఖాతాదారుల ఆందోళన 2



## దలైలామాకు భారతరత్న ఇయ్యాలె

### ప్రభుత్వానికి అఖిలపక్ష ఎంపీల లేఖ

హైదరాబాద్, మనం ప్రతినిధిః టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామాకు దేశ అత్యున్నత పౌర పురస్కారమైన భారతరత్న'ను ప్రదానం చేయాలని పలు పార్టీలకు చెందిన ఎంపీలు కేంద్ర ...మిగతా 2లో



### వనమే మనం.. మనమే వనం

# మహిళలకు 60 సీట్లిస్తం

### వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ఉమెన్ రిజర్వేషన్ అమలు

### ఆడబిడ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చేస్తం

### ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటడమే లక్ష్యం

### వన మహోత్సవ ప్రారంభోత్సవంలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్, జూలై 07, (మనం బ్యూరో)ః త్వరలో అసెంబ్లీ ఎన్నికల్లోనూ మహిళా రిజర్వేషన్ రాబోతోందనీ, మహిళలకు 60 ఎమ్మెల్యే సీట్లు ఇచ్చే బాధ్యత తాను తీసుకుంటానని రాష్ట్ర ముఖ్య మంత్రి ఎ.రేవంత్ రెడ్డి అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ఆడబి డ్డలు ఆత్మగౌరవంతో నిలబడేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. హైదరాబాద్ రాజేంద్రనగర్‌లోని వ్యవసాయ విశ్వవి ద్యాలయంలో సోమవారం రుద్రాక్ష మొక్కను నాటి వనమహోత్స వం-2025 కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, పర్యావరణ శాఖ మంత్రి కొండా సురేఖ, సీఎం సల హాదారు వేం నరేందర్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యేలు, ఎమ్మె ల్సీలు, కార్పొరేషన్ చైర్మన్లు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ వనమే మనం...మ నమే వనం అని పెద్దలు చెప్పారనీ, ప్రకృతిని మనం కాపాడితే మనల్ని ప్రకృతి ...మిగతా 2లో

## గ్రూప్-1పై తీర్పు రిజర్వు

### హైకోర్టులో పిటిషన్లపై ముగిసిన వాదనలు

హైదరాబాద్, మనం ప్రతినిధిః గ్రూప్-1 అంశంపై తెలంగాణ హైకోర్టులో వాదనలు ముగిశాయి. న్యాయమూర్తి జస్టిస్ నామవరపు రాజేశ్వరరావు సోమవారం తీర్పును రిజర్వ్ చేశారు. మొదటగా గ్రూప్-1 అంశంపై సుదీర్ఘంగా వాదనలు సాగాయి. మూల్యాంకనంలో అక్రమాలు జరిగాయని పలువురు అభ్యర్థులు పిటిషన్లు దాఖలు చేశారు. మెయిన్స్ ...మిగతా 2లో

## ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణలో నిర్వహించండి



## ఎల్లుండి కేబినెట్

స్థానిక సంస్థల ఎన్నికలు, రిజర్వేషన్లు, బనకచర్లపై చర్చ 2

### క్రీడాకారులకు రైలు ప్రయాణాల్లో రాయితీ పునరుద్ధరించాలి

- కేంద్ర క్రీడల శాఖ మంత్రి మాండవీయకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి
- రేవంత్‌తో కపిల్‌దేవ్ భేటీ.. క్రీడా రంగం అభివృద్ధిపై ప్రశంస
- తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ఫిల్మ్ స్టూడియో : రేవంత్ రెడ్డితో బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్



హైదరాబాద్, జూలై 07, (మనం బ్యూరో): ఖేలో ఇండియా గేమ్స్-2026ను తెలంగాణలో నిర్వహించాలని కేంద్ర క్రీడలు, యువజన శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయకు సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. ఖేలో ఇండియాతో పాటు జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు ఆతిథ్యమిచ్చే అవకాశాన్ని పరిశీలించాలని పేర్కొన్నారు. ఈమేరకు కేంద్ర మంత్రిని సీఎం రేవంత్ ఢిల్లీలోని ఆయన అధికారిక నివాసంలో సోమవారం కలిశారు. ఖేలో ఇండియా కింద క్రీడా మౌలిక వసతుల అభివృద్ధి, క్రీడాకారుల శిక్షణ, క్రీడా నిపుణుల ఎంపిక ఇతర కార్యక్రమాలకు నిధులు కేటాయించాలని కోరారు. భువనగిరిలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్, మల్టీపర్పస్ ...మిగతా 2లో

## రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లు

### డోర్నకల్-గద్వాల, డోర్నకల్-మిర్యాలగూడ మార్గంలో తుది దశకు డీపీఆర్‌లు



హైదరాబాద్, మనం ప్రతినిధిః తెలంగాణ రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్ల ఏర్పాటుకు భారతీయ రైల్వే వేగంగా అడుగులు వేస్తోంది. ఇందులో భాగంగా డోర్నకల్ - గద్వాల, డోర్నకల్ - మిర్యాలగూడ మధ్య కొత్త రైల్వే లైన్ల నిర్మాణానికి ప్రణాళికలు రూపొందుతున్నాయి. ఆగస్టు నెలాఖరుకు డీపీఆర్లు రైల్వే బోర్డుకు చేరే ఛాన్స్ ఉంది. ఆ తర్వాత టెండర్ల ప్రక్రియ ప్రారంభం కానుంది. ఈ ప్రాజెక్టులు రాష్ట్రంలో రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంతో పాటు, ఆర్థిక అభివృద్ధికి దోహదపడతాయని భావిస్తున్నారు. డోర్నకల్ - గద్వాల కొత్త రైల్వే లైన్ దక్షిణ తెలంగాణ ప్రాంతంలో కీలకమైనదిగా భావిస్తున్నారు. ఈ కొత్త రైల్వే మార్గం సుమారు 296 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. నిర్మాణానికి సుమారు రూ. 5,330 కోట్లు వ్యయం అవుతుందని అంచనా. హైదరాబాద్ - విజయవాడ రైల్వే లైన్‌లోని డోర్నకల్‌ను, హైదరాబాద్ - బెంగళూరు రైల్వే మార్గంలోని గద్వాలతో కలుపుతుంది. ఇది కేవలం రెండు కీలక మార్గాలను అనుసంధానించడమే కాకుండా, ఇప్పటివరకు రైల్వే వసతి లేని అనేక ...మిగతా 2లో

### అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం

## హైదరాబాదీ కుటుంబం సజీవదహనం



హైదరాబాద్, జూలై 7ః అమెరికాలో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.. ఓ మినీ ట్రక్కు వచ్చి కారును ఢీకొన్న ఘటనలో హైదరాబాద్ కు చెందిన ఒక కుటుంబ సభ్యులందరూ సజీవదహనమయ్యారు. హైదరాబాద్ లోని సుచిత్ర ప్రాంతంలో నివాసముండే తేజస్విని, శ్రీవెంకట్ దంపతులు తమ ఇద్దరు పిల్లలతో కలిసి వెకేషన్ కోసం అమెరికాలోని డల్లాస్ కు వెళ్లారు. అట్లాంటాలోని తమ బంధువుల ఇంటికి కారులో వెళ్లి డల్లాస్ కు తిరిగి వస్తుండగా గ్రీన్ కౌంటీ అనే చోట రాంగ్ రూట్లో వచ్చిన ఓ మినీ ట్రక్కు వీరు ప్రయాణిస్తున్న కారును ఢీకొట్టింది. దానితో కారులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. క్షణాల్లో ఉవ్వెత్తున ఎగిసిన మంటల్లో చిక్కుకున్న కారులో నుంచి వారు బయటకు రాలేకపోయారు. దీనితో ఆ మంటల్లో నలుగురూ కాలిపోయారు. డీఎన్ఏ టెస్టులు చేశాక వారి మృతదేహాలను బంధువులకు అందజేస్తామని అక్కడి పోలీసులు ప్రకటించారు.

### జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

## మాకు సవాల్

### స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతాం

### 25 రోజుల్లో పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీ

### బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు

హైదరాబాద్, జూలై 07, మనం బ్యూరో: జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక మాకు సవాల్ అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు అన్నారు. రాష్ట్రంలో తర్వలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుతామని స్పష్టం చేశారు. సోమవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడిన ఆయన 25 రోజుల్లో పూర్తి స్థాయి రాష్ట్ర కమిటీని ప్రకటిస్తామని వెల్లడించారు. దీనికి సంబంధించి అన్ని సామాజిక వర్గాలకు ప్రాతినిధ్యం కల్పిస్తామనీ, అందరు నేతలతో మాట్లాడి రాష్ట్ర కమిటీని ఏర్పాటు చేస్తామన్నారు. పార్టీలోని నేతలంతా ఐకమత్యంగానే ఉన్నారనీ, పార్టీ లైన్‌కు అనుగుణంగా సంయుక్తంగా పార్టీని బలోపేతం చేసే దిశగా ముందుకు సాగుతామని వెల్లడించారు.

## ఆ 81 గ్రామాల్లో నో కరెంటు బిల్

### ప్రజా సంక్షేమం దిశగా కాంగ్రెస్ సర్కార్ మరో కీలక నిర్ణయం

### అన్ని ఇండ్లపై, వ్యవసాయ బోర్లకు సోలార్ ప్లేట్లు



హైదరాబాద్, మనం ప్రతినిధిః తెలంగాణ ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. రైతుల ఆదాయం పెంచడంతో పాటు కరెంట్ బిల్లు చెల్లించాల్సిన అవసరం లేకుండా పలు సంస్కరణలు తీసుకొస్తోంది. ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా 81 గ్రామాల్లో సోలార్ విద్యుత్ అమర్చేందుకు సిద్ధం అవుతోంది. ఈ గ్రామాల్లోని అన్ని ఇళ్లపై, వ్యవసాయ బోర్లకు సోలార్ ప్లేట్లు అమర్చనున్నారు. వీటికోసం ...మిగతా 2లో

### సంస్థాగత నిర్మాణంపై

## కాంగ్రెస్ నజర్

### పది ఉమ్మడి జిల్లాలకు ఇన్‌చార్జిల నియామకం

హైదరాబాద్, జూలై 07, (మనం బ్యూరో)ః కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణంపై దృష్టి సారించింది. ఇప్పటికే పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులను పీసీసీ నియమించింది. తాజాగా ఉమ్మడి జిల్లాల వారీగా ఇన్‌చార్జిలను నియమించింది. ఈమేరకు సోమవారం 10 జిల్లాల ఇన్‌చార్జిలతో ఏఐసీసీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ జూమ్ వేదికగా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో విధి విధానాలను మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. త్వరలో గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కమిటీలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. జిల్లా ఇన్‌చార్జిలంతా వెంటనే రంగంలోకి దిగాలని దిశానిర్దేశం చేశారు. ఉమ్మడి జిల్లాల ఇన్‌చార్జిలు. ఖమ్మం : వంశీచందర్‌రెడ్డి, నల్గొండ : సంపత్ కుమార్, వరంగల్ : అడ్లూరి లక్ష్మణ్, ...మిగతా 2లో

### గొర్రెలు... బర్రెలు ఇస్తే

## నేనేం చేసుకోవాలె?

### తనకు కేటాయించిన శాఖలపై మంత్రి శ్రీహరి అసంతృప్తి

హైదరాబాద్, జూలై 07, (మనం బ్యూరో): తెలంగాణ మంత్రి వాకిటి శ్రీహరి తన శాఖలపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. గొర్రెలు...బర్రెలు ఇస్తే నేనేం చేసుకోవాలె? అంటూ వ్యాఖ్యానించారు. కరీంనగర్‌లో సోమవారం ఓ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మంత్రి పదవి కింద తనకిచ్చిన శాఖలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇది అదృష్టమో... దురదృష్టమో తెల్వదు. పదేళ్లలో ఆగమైన శాఖలను నాకు ఇచ్చారు. పశు సంవర్ధక శాఖ అంతా గందరగోళంగా ఉందని ...మిగతా 2లో

## తన నీడను కూడా నమ్మని ట్రంప్!

### అందుకే శత్రువులవుతున్న మిత్రులు

### అందరితోనూ వివాదాలే

### తాజాగా ఆ జాబితాలో మస్క్





వాషింగ్టన్, జూలై 7: డొనాల్డ్ ట్రంప్ రెండోసారి అమెరికా అధ్యక్షుడై ఆరు నెలలైనా గడవక ముందే మిత్రులు శత్రువులుగా మారుతున్నారు. ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే ఎన్నికల్లో తనకు నీడలా వెంట ఉండి గెలిపించిన వారూ శత్రువులుగా మారడం. ప్రస్తుతం ఆయనపై విమర్శలు చేస్తున్న వారిలో చాలా మంది గతంలో అత్యంత సన్నిహితులే. టెస్లా అధినేత ఎలాన్ మస్క్ నుంచి మాజీ ఉపాధ్యక్షుడు మైక్ పెన్స్ దాకా ఎంతో మంది ఇప్పుడు ట్రంప్‌నకు వ్యతిరేకంగా గొంతు విప్పుతున్నారు. ఆయన అనుసరిస్తున్న పాలనా విధానాలను ఎండగడుతున్నారు. బిగ్ బ్యూటిఫుల్ చట్టం నుంచి విదేశాంగ విధానాలదాకా ట్రంప్ సర్కారు తీసుకుంటున్న నిర్ణయాలను ...మిగతా 2లో

## స్టైఫండ్ బేస్డ్ అప్రెంటీస్‌షిప్ ప్రోగ్రాం

### రిటైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో అంబేద్కర్ ఓపెన్ వర్సిటీ ఒప్పందం



హైదరాబాద్, మనం ప్రతినిధిః విద్యార్థులకు ఉపకారవేతన ఆధారిత విద్యను అందించనున్నట్లు అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొ. ఘంటా చక్రపాణి వెల్లడించారు. సోమవారం విశ్వవిద్యాలయంలో రిటైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాతో ఈ మేరకు కుదిరిన అవగాహన ఒప్పందంపై ...మిగతా 2లో

# కబడ్డీ ఆడిన మంత్రులు

- **హుస్నాబాద్‌లో పర్యటించిన పొన్నం, వాకిటి**

కరీంనగర్, జూలై 7: తెలంగాణ రాష్ట్రాన్ని క్రీడల్లో విశ్వవ్యాప్తం చేయాలని మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి ఆకాంక్షించారు. పొన్నం నియోజకవర్గమైన హుస్నాబాద్ లో పర్యటించిన సందర్భంగా మినీ స్టేడియంలో వారు కబడ్డీ ఆడారు. వీరితో పాటు స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేన రెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి ఆటలో పాల్గొన్నారు.

# బ్యాంకును ముంచెత్తిన వరద నీరు

- **తమ నగదు, బంగారం డిపాజిట్లపై ఖాతాదారుల ఆందోళన**

మండి, జూలై 7: హిమాచల్ ప్రదేశ్‌లో భారీ వర్షాలు కురుస్తూ రాష్ట్రాన్ని అతలాకుతలం చేస్తున్న విషయం తెలిసిందే. మండి జిల్లాలోని తునాగ్ ఒక కోఆపరేటివ్ బ్యాంక్ ఉంది. గత నెల నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా వాన నీరు, కొట్టుకొచ్చిన శిథిలాలు బ్యాంక్ రెండు అంతస్తుల భవనంలోని మొదటి అంతస్తు వరకు మునిగిపోయి, షటర్లు దెబ్బతిన్నాయి. బ్యాంకులో దాదాపు ఎనిమిది వేల మంది ప్రజలు దాచుకున్న కోట్లాది రూపాయల నగదు, బంగారం డిపాజిట్లు కూడా ఈ అంతస్తులోనే ఉన్నట్టు సమాచారం. దానితో ప్రజలు తమ నగదు, నగలు, బంగారం ఉన్నాయా? కొట్టుకుపోయాయా? అని భయపడుతున్నారు. స్థానిక వ్యాపారి ఒకరు మాట్లాడుతూ.. 'మా ప్రాంతంలో ఉన్న బ్యాంక్ ఇదొక్కటే. చాలాకాలం నుంచి ఇది నడుస్తోంది. దీనిలో ప్రతిరోజు భారీ సంఖ్యలో లావాదేవీలు జరుగుతుంటాయి. ఇప్పుడు అందులో ఉంచిన నగదు, బంగారం, పత్రాలు ఏమైఉంటాయో?' అని ఆందోళన వ్యక్తంచేశారు. ఇవి కొట్టుకుపోయే లేదా దోపిడీకి గురయ్యే అవకాశం కూడా ఉండొచ్చని బ్యాంకు వర్గాలు అభిప్రాయపడుతున్నారు.



# మహిళలకు 60 సీట్లిస్తం

(మొదటి పేజీ తరువాయి)

కాపాడుతుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 18 కోట్ల మొక్కలు నాటాలని ప్రభుత్వం లక్ష్యంగా నిర్ణయించిందని తెలిపారు. అమ్మ పేరుతో ఒక మొక్కను నాటాలని ప్రధాని పిలుపునిచ్చారనీ, అమ్మలు కూడా పిల్లల పేరుతో మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. ప్రతీ ఇంట్లో కనీసం రెండు మొక్కలు నాటండి, మీ పిల్లల్లాగే వాటిని సంరక్షిస్తే తెలంగాణ రాష్ట్రమంతా పచ్చదనంతో నిండిపోతుందని పేర్కొన్నారు. మహిళలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం ముందుకెళుతోందనీ, సోలార్ ప్లాంట్ల ఏర్పాటు, ప్రభుత్వ పాఠశాలల నిర్వహణ బాధ్యతను ఆడబిడ్డలకు అప్పగించామన్నారు. ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడమే కాకుండా, ఆర్టీసీకి వెయ్యి బస్సులను అద్దెకు ఇచ్చేలా ప్రోత్సహించి వారిని బస్సులకు యజమానులను చేశామని తెలిపారు. హైటెక్ సిటీలో విప్రో, మైక్రోసాఫ్ట్ సంస్థలు ఉండేచోట మహిళా సంఘాలు తయారు చేసిన వస్తువులను మార్కెటింగ్ చేసుకునే సదుపాయం కల్పించామని గుర్తు చేశారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామనీ, పట్టణ ప్రాంతాల్లో మహిళలు మహిళా సంఘాల్లో చేరాలని పిలుపునిచ్చారు. ఈ ఏడాది మహిళా సంఘాలకు రూ.21 వేల కోట్లు రుణాలు అందించామని వెల్లడించారు. అన్ని రంగాల్లో ఆడబిడ్డలను ముందు భాగాన నిలపాలని ప్రయత్నిస్తున్నట్లు ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# ఖేలో ఇండియా గేమ్స్ తెలంగాణలో నిర్వహించండి

(మొదటి పేజీ తరువాయి)

ఇండోర్ స్టేడియం, రాయగిరిలో స్విమ్మింగ్ పూల్, కరీంనగర్ శాతవాహన వర్సిటీలో మల్టీపర్పస్ హాల్, ఎల్బీ స్టేడియంలో స్క్వాష్ కోర్టు, నేచురల్ ఫీల్డ్ అభివృద్ధి, గచ్చిబౌలిలో హాకీ గ్రౌండ్ నవీకరణ, నల్గొండ మహాత్మా గాంధీ వర్సిటీలో సింథటిక్ అథ్లెటిక్ ట్రాక్ నిర్మాణాలకు రూ.100 కోట్లు కేటాయించాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే క్రీడా వసతుల మెరుగుకు అన్ని విధాలా కృషి చేస్తోందనీ, కేంద్ర ప్రభుత్వం నుంచి సహకారం అందించాలన్నారు. 2036లో దేశంలో నిర్వహించే ఒలింపిక్స్‌లో కనీసం రెండు ఈవెంట్లు తెలంగాణలో నిర్వహించాలని కోరారు. అలాగే, జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనే క్రీడాకారులకు గతంలో మాదిరి రైలు ప్రయాణాల్లో చార్జి రాయితీ ఇవ్వాలన్నారు. సీఎం రేవంత్ రెడ్డి వెంట రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు (క్రీడలు) జితేందర్ రెడ్డి, ఎంపీలు మల్లు రవి, చామల కిరణ్ కుమార్ రెడ్డి, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, కేంద్ర ప్రాయోజిత పథకాల సమన్వయ కార్యదర్శి డా.గౌరవ్ ఉప్పల్ పాల్గొన్నారు.

**రేవంత్‌తో కపిల్‌దేవ్ భేటీ...**

సీఎం రేవంత్ రెడ్డితో భారత క్రికెట్ జట్టు మాజీ కెప్టెన్ కపిల్‌దేవ్ భేటీ అయ్యారు. రేవంత్ ప్రభుత్వం తెలంగాణలో క్రీడా రంగం అభివృద్ధికి తీసుకుంటున్న చర్యలను ప్రశంసించారు. ఈ సందర్భంగా రాష్ట్రంలో యంగ్ ఇండియా స్పోర్ట్స్ వర్సిటీతో పాటు క్రీడాభివృద్ధికి సంబంధించిన అన్ని అంశాల్లో తాను భాగస్వామిని అవుతానని కపిల్‌దేవ్ తెలియజేశారు. దక్షిణ కొరియాతో పాటు పలు దేశాల్లో తాము సందర్శించిన క్రీడా వర్సిటీలు, అక్కడి క్రీడా ప్రముఖులతో భేటీల వివరాలను సీఎం కపిల్‌దేవ్‌కు వివరించారు.

**తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో ఫిల్మ్ స్టూడియో..**

సీఎం రేవంత్ రెడ్డితో బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ తెలంగాణలో అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన ఫిల్మ్ స్టూడియో ఏర్పాటుకు అవకాశం కల్పించాలని ప్రముఖ బాలీవుడ్ నటుడు అజయ్ దేవ్‌గణ్ సీఎం రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఢిల్లీలో సీఎంతో భేటీ అయిన ఆయన సినీ నిర్మాణంలో కీలకమైన యానిమేషన్, వీఎఫ్ఎక్స్ స్టూడియో, ఏఐ, ఇతర సదుపాయాలతో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన స్టూడియో నిర్మాణాన్ని ఏర్పాటు చేసేందుకు అవకాశం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైజింగ్‌కు సంబంధించి మీడియా, సినిమా రంగాలకు ప్రచారకర్తగా ఉంటానని తెలిపారు.

# ఎల్లుండి కేబినెట్

## స్థానిక సంస్థల ఎన్నికలు, రిజర్వేషన్లు, బనకచర్లపై చర్చ

## ప్రభుత్వ పాఠశాలల స్థితిగతులు, డ్రగ్స్ నియంత్రణపై కూడా..

హైదరాబాద్, జూలై 07, (మనం బ్యూరో): ఈనెల 10న రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరుగనుంది. సీఎం రేవంత్ రెడ్డి అధ్యక్షతన సచివాలయంలోని ఆరో అంతస్థులో మధ్యాహ్నం 2 గంటలకు ఈ సమావేశం జరుగుతుంది. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, స్థానిక సంస్థల ఎన్నికలపై హైకోర్టు ఇచ్చిన తీర్పు, రిజర్వేషన్ల ఖరారు, రాజీవ్ యువ వికాసం స్కీమ్, బనకచర్ల ప్రాజెక్టును అడ్డుకునే కార్యాచరణ, రాష్ట్రంలోని ప్రభుత్వం పాఠశాలల పరిస్థితి, అడ్మిషన్లు, మౌలిక సౌకర్యాలు, మెడికల్ కళాశాలల స్థితిగతులు, డ్రగ్స్ నియంత్రణ, సన్నబియ్యం పంపిణీ తదితర అంశాలపై చర్చించే అవకాశం ఉంది. ఇదిలా ఉండగా, ప్రతీ నెలా 2 సార్లు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం నిర్వహించాలి సీఎం రేవంత్ రెడ్డి గతంలో నిర్ణయించిన సంగతి తెలిసిందే. దీంతో పాటు మంత్రివర్గ సమావేశం నిర్వహించే తేదీని సైతం ముందుగానే వెల్లడించనున్నట్లు తెలిపారు. దీంతో మంత్రులు కూడా తమ షెడ్యూల్‌ను ముందుగానే ఫిక్స్ చేసుకోవడానికి, తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో మంత్రివర్గ సమావేశానికి హాజరు కావడానికి వీలు కలుగుతుందని తెలిపారు.

# దలైలామాకు భారతరత్న ఇయ్యాలె

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంటు ఉభయ సభల సంయుక్త సమావేశంలో ప్రసంగించేందుకు ఆయనకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. వివిధ పార్టీల ఎంపీలతో కూడిన 'అఖిలపక్ష భారత పార్లమెంటరీ ఫోరమ్ ఫర్ టిబెట్' ఇటీవల నిర్వహించిన సమావేశంలో ఈ మేరకు కీలక తీర్మానాలు చేసింది. బీజేడీ రాజ్యసభ ఎంపీ సుజీత్ కుమార్ నేతృత్వంలోని ఈ ఫోరంలో బీజేపీ, జేడీ(యూ) వంటి పార్టీల ఎంపీలు సభ్యులుగా ఉన్నారు. దలైలామాకు 'భారతరత్న' ఇవ్వాలన్న డిమాండ్‌కు మద్దతుగా సంతకాల సేకరణ కార్యక్రమాన్ని కూడా ప్రారంభించినట్లు ఫోరమ్ కన్వీనర్ సుజీత్ కుమార్ తెలిపారు. టిబెట్ ఆధ్యాత్మిక వారసత్వ నాయకుడి ఎంపిక విషయంలో చైనా జోక్యాన్ని ఎంపీలు తీవ్రంగా వ్యతిరేకించారు. 14వ దలైలామా వారసుడిని ఎన్నుకునే హక్కు కేవలం టిబెట్ ప్రజలకు మాత్రమే ఉందని వారు స్పష్టం చేశారు. ఈ అంశంపై ప్రజల్లో అవగాహన పెంచేందుకు భారీ ర్యాలీ నిర్వహించాలని అరుణాచల్ ప్రదేశ్ ఎంపీ తాపిర్ గావో సూచించారు. ఇటీవల అమెరికా కాంగ్రెస్ టిబెట్‌కు అనుకూలంగా ఆమోదించిన బిల్లును ఈ ఫోరమ్ ప్రశంసించింది. మన దేశ పార్లమెంటులోనూ అలాంటి చట్టాన్ని తీసుకురావాలని సభ్యులు అభిప్రాయపడ్డారు. అదేవిధంగా, దేశంలోని టిబెటన్ శరణార్థుల నివాస ప్రాంతాలను సందర్శించి, వారికి రోడ్లు, తాగునీరు, విద్యుత్ వంటి మౌలిక సదుపాయాలు కల్పించేలా స్థానిక యంత్రాంగాలపై ఒత్తిడి తీసుకురావాలని ఎంపీలకు సూచించారు. ఈ పరిణామం చైనాతో దౌత్యపరమైన సంబంధాల విషయంలో భారత్‌కు మరోసారి సవాలుగా మారే అవకాశం ఉంది.

**దలైలామాకు మోదీ శుభాకాంక్షలు..**

టిబెటన్ బౌద్ధ గురువు దలైలామా 90వ పుట్టినరోజు సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుభాకాంక్షలు తెలిపారు. అయితే, దీనిపై చైనా తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు సోమవారం నాడు భారత్‌కు తమ నిరసనను అధికారికంగా తెలియజేసినట్లు ప్రకటించింది. టిబెట్‌కు సంబంధించిన అంశాల సున్నితత్వాన్ని భారత్ పూర్తిగా అర్థం చేసుకోవాలని చైనా విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి మావో నింగ్ హెచ్చరించారు.

# నీడను కూడా నమ్మని ట్రంప్!

(మొదటి పేజీ తరువాయి)

బహిరంగంగా వ్యతిరేకిస్తున్నారు. అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ విజయానికి ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ తీవ్రంగా కృషి చేశారు. అత్యధిక ధనాన్ని ఖర్చుపెట్టారు. దీంతో ట్రంప్ అధ్యక్షుడు కాగానే ప్రభుత్వ వ్యయ నియంత్రణ కోసమంటూ మస్క్ కోసం కొత్తగా డిపార్టుమెంట్ ఆఫ్ గవర్నమెంట్ ఎఫీషియెన్సీని (డోజ్) ఏర్పాటు చేశారు. అయితే అధికారంలోకి వచ్చాక ట్రంప్ విధానాలు నచ్చని మస్క్.. డోజ్‌కు రాజీనామా చేశారు. ఆ తర్వాత బిగ్ బ్యూటిఫుల్ చట్టాన్ని ట్రంప్ తేవడంతో వారి మధ్య విభేదాలు మరింత తీవ్రమయ్యాయి. ఏకంగా కొత్త పార్టీ పెట్టే వరకూ మస్క్ వెళ్లారు. అంతకుముందు ట్రంప్‌పై సెక్స్ కుంభకోణానికి సంబంధించి ఆరోపణలు చేశారు. అటు ట్రంప్.. మస్కును తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. ఆయన కంపెనీలకు బిలియన్ డాలర్ల విలువైన ప్రభుత్వ కాంట్రాక్టులను రద్దు చేస్తానని స్పష్టం చేశారు.

ట్రంప్ తొలిసారి అమెరికా అధ్యక్షుడయ్యాక మైక్ పెన్స్‌ను ఉపాధ్యక్షుడిగా నియమించుకున్నారు. ఆయన 2017 జనవరి 20 నుంచి 2021 జనవరి 20 దాకా ఆ పదవిలో కొనసాగారు. అమెరికా సైనిక వ్యవహారాలపై మైక్ పెన్స్‌కు మంచి పట్టుంది. ఈ అంశాల్లో కీలక సలహాలన్నీ ఈయన నుంచే ట్రంప్ తీసుకునేవారు. 2020 నవంబరులో జరిగిన అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయారు. ఇద్దరి స్నేహం 2021 జనవరి 6న దెబ్బతింది. జో బైడెన్ ఎన్నికల్లో గెలిచినట్లుగా సర్టిఫికెట్‌ను జారీ చేయొద్దని మైక్ పెన్స్‌కు ట్రంప్ నిర్దేశించారు. అందుకు పెన్స్ నిరాకరించారు. దీంతో ఆయనపై ట్రంప్ బహిరంగంగా విమర్శలు చేశారు. అనంతరం క్యాపిటల్ హిల్ వద్ద నిరసనకు దిగిన ట్రంప్ వర్గీయులు మైక్ పెన్‌ను ఉరితీయండంటూ నినాదాలు చేశారు. దీనిపై పెన్స్ అప్పట్లో స్పందిస్తూ.. రాజ్యాంగానికి అతీతంగా వ్యవహరించాలని భావించే వారు అమెరికా అధ్యక్షుడు కాకూడదని వ్యాఖ్యానించారు.ట్రంప్ తొలిసారి అధ్యక్షుడయ్యాక జాన్ బోల్టన్‌ను అమెరికా జాతీయ భద్రతా సలహాదారుడిగా నియమించుకున్నారు. 2018 ఏప్రిల్ 9 నుంచి 2019 సెప్టెంబరు 10 వరకు ఈ పదవిలో ఆయన కొనసాగారు. ఇరాన్, ఉత్తర కొరియాలకు సంబంధించిన విదేశాంగ విధానాలకు రూపకల్పన చేసే క్రమంలో ట్రంప్, జాన్ బోల్టన్‌ల మధ్య విభేదాలు తలెత్తాయి. దీంతో జాన్ బోల్టన్ 17 నెలలే పని చేశారు. తానే రాజీనామా చేశానని బోల్టన్ ప్రకటించగా.. తానే తీసేశానని ట్రంప్ అప్పట్లో చెప్పారు. రెండోసారి అధికారంలోకి రాగానే జాన్ బోల్టన్ సెక్యూరిటీ క్లియరెన్‌ను ట్రంప్ రద్దు చేశారు.

ట్రంప్ తొలిసారి అధ్యక్షుడిగా ఉన్నప్పుడు జాన్ కెల్లీ అమెరికా చీఫ్ ఆఫ్ స్టాఫ్‌గా సేవలందించారు. 2017 జులై 31 నుంచి 2019 జనవరి 2 వరకు ఈ పదవిలో కొనసాగారు. పదవి నుంచి వైదొలగినప్పటి నుంచి జాన్ కెల్లీ.. ట్రంప్ విమర్శకుడిగా మారిపోయారు. ట్రంప్ ఒక ఫాసిస్టు, నియంత అని విమర్శించారు.

అమెరికా అధ్యక్షుడిగా ట్రంప్ తొలి హయాంలో జిమ్ మ్యాటిస్ రక్షణ మంత్రిగా సేవలందించారు. ఆయన 2017 జనవరి 20 నుంచి 2019 జనవరి 1 వరకు ఈ పదవిలో కొనసాగారు. సిరియా నుంచి అమెరికా సేనలను ఉపసంహరించుకోవాలనే ట్రంప్ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ అప్పట్లో జిమ్ మ్యాటిస్ రాజీనామా చేశారు. 2020లో జిమ్ మ్యాటిస్ సంచలన వ్యాఖ్యలు చేశారు. అమెరికా ప్రజలను ఏకం చేసే కనీస ప్రయత్నం కూడా చేయని అధ్యక్షుడిగా ట్రంప్‌ను తాను చూశానని విమర్శించారు.

ట్రంప్ తొలి విడతలో అమెరికా జాయింట్ చీఫ్స్ ఆఫ్ స్టాఫ్ ఛైర్మన్‌గా మార్క్ మిల్లే సేవలందించారు. ఆయన 2015 ఆగస్టు 14 నుంచి 2019 ఆగస్టు 9 వరకు ఈ పదవిలో కొనసాగారు. రాజీనామా చేశాక ఈయన ట్రంప్‌నకు వ్యతిరేకంగా గళం విప్పారు. ట్రంప్ ఒక ఫాసిస్టు అంటూ ధ్వజమెత్తారు. అమెరికాలోనే అత్యంత ప్రమాదకరమైన వ్యక్తిగా అభివర్ణించారు.

# గ్రూప్-1పై తీర్పు రిజర్వు

(మొదటి పేజీ తరువాయి)

పత్రాలు పునః మూల్యాంకనం చేయాలని, మూల్యాంకనం చేయకపోతే మళ్లీ పరీక్షలు పెట్టాలని పిటిషనర్లు కోరారు. గతంలో గ్రూప్-1 నియామకాలపై స్టే ఇచ్చిన న్యాయమూర్తి రాజేశ్వర రావు స్టే ఇచ్చిన విషయం తెలిసిందే. అదే సమయంలో స్టే ఎత్తివేయాలంటూ గ్రూప్-1కి ఎంపికైన పిటిషన్లు వేశారు. నియామకాలు పారదర్శకంగా జరిగాయని టీజీపీఎస్సీ న్యాయవాది నిరంజన్‌రెడ్డి కోర్టుకు తెలిపారు. వాదనలు ఏమైనా మిగిలి ఉంటే రాతపూర్వకంగా సమర్పించాలని న్యాయమూర్తి ఆదేశించారు.

# గొర్రెలు... బర్రెలు ఇస్తే నేనేం చేసుకోవాలె?

(మొదటి పేజీ తరువాయి)

వ్యాఖ్యానించారు. అయిదు శాఖలు ఆగమాగంగానే ఉన్నాయి. ఏ శాఖలో ఏం జరిగిందో ఏం అర్థం కావడం లేదు.. యువజన సర్వీసులు ఇస్తే నేనేం చేసుకోవాలె.. గొర్రెలు, బర్రెలు ఇస్తే నేనేం చేసుకోవాలి? అంటూ మంత్రి శ్రీహరి చేసిన వ్యాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించాయి.

**నాకు మంత్రి పదవి అధిష్టానం ఇష్టం : దానం నాగేందర్**

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో విజయం కాంగ్రెస్ పార్టీదేనన ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ ధీమా వ్యక్తం చేశారు. తనకు మంత్రి పదవి ఇచ్చేది అధిష్టానం ఇష్టమని వ్యాఖ్యానించారు. సోమవారం గాంధీభవన్‌లో ప్రజలతో ప్రజాప్రతినిధి కార్యక్రమం సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సవాల్‌ను మాజీ మంత్రి కేటీఆర్ స్వాగతించాలి కానీ, వక్రీకరించడం మంచిది కాదని హితవు పలికారు. బీజేపీ అంతర్గత సమస్యలు పరిష్కరించుకుంటే మంచిదనీ, ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం బీసీ నేతలు ప్రయత్నించినప్పటికీ ఓసీకి ఇచ్చారని విమర్శించారు. బీజేపీ నేతలు ఇంకా ఊహల్లోనే ఉన్నారని విమర్శించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తనను ఎంపీగా గెలిపించిన సికింద్రాబాద్ ప్రజలకు ఏం చేశారో చెప్పాలని ప్రశ్నించారు. పేరుకే పసుపు బోర్డు ఉందనీ, దానికి కనీసం ఆఫీస్ కూడా లేదని విమర్శించారు. ఇదిలా ఉండగా, దానం నాగేందర్ సోమవారం ఢిల్లీకి బయల్దేరి వెళ్లారు. రాష్ట్ర మంత్రివర్గంలో తనకు అవకాశం ఇవ్వాలని ఏఐసీసీ పెద్దలను దానం కలువనున్నట్లు సమాచారం. ఇప్పటికే మూడు మంత్రి పదవులను ఇటీవల ఏఐసీసీ హైకమాండ్ భర్తీ చేసింది. మిగిలిన పదవులను కూడా భర్తీ చేయడానికి హైకమాండ్ కసరత్తు చేస్తోంది. ఈసారి భర్తీ చేసే మంత్రి పదవుల్లో బీసీలు, ఎస్సీలకు ప్రాధాన్యం ఇచ్చేలా చూడాలని ఆ సామాజిక వర్గాల నేతలు కోరుతున్నారు. అయితే, అధిష్టానం ఎలాంటి నిర్ణయం తీసుకోనుందోనని కాంగ్రెస్ నేతలు ఉత్కంఠగా ఎదురు చూస్తున్నారు.

# ఆ 81 గ్రామాల్లో నో కరెంటు బిల్

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర ప్రభుత్వం రూ. 1,273 కోట్లు ఖర్చు చేయనుంది. తెలంగాణలోని ఆ 81 గ్రామాలకు రాష్ట్ర ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. ఈ గ్రామాల్లో పూర్తిగా సోలార్ విద్యుత్ ను ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. తొలి విడతగా 81 గ్రామాలకు రూ. రూ. 1,273 కోట్లు ఖర్చు చేసి పూర్తి సౌర విద్యుత్ గ్రామాలుగా మార్చేందుకు ఈ మేరకు రెడ్కో టెండర్లు పిలిచింది. 81 గ్రామాల్లోని అన్ని ఇళ్లు, వ్యవసాయ బోర్లకు సోలార్ ప్లేట్లు అమర్చనున్నారు. దీంతో ఈ గ్రామాల్లోని ప్రజలు విద్యుత్ బిల్లులు చెల్లించాల్సిన అవసరం లేకుండా సౌర విద్యుత్ ను సమృద్ధిగా వినియోగించుకోవచ్చు మిగిలిన సౌర విద్యుత్ గ్రిడ్ కు సరఫరా అవుతుంది. అలాగే వ్యవసాయ బోర్లకూ సోలార్ ప్లేట్స్ ను ఏర్పాటు చేయనున్నారు. దీంతో ఆ కరెంట్ ను బోరుకు వినియోగించుకోవచ్చు. మిగిలిన సోలార్ కరెంట్ గ్రిడ్ కు సరఫరా అవుతుంది. సోలార్ విద్యుత్ ను గ్రిడ్ కు సరఫరా చేసినందుకు రైతుకు ఒక యూనిట్ కు రూ. 3.13 చొప్పున డిస్కం సంస్థలు చెల్లిస్తాయి. దీంతో రైతులు పంటల ద్వారానే కాకుండా అదనంగా కూడా సంపాదించుకోవచ్చని రాష్ట్ర ప్రభుత్వం అభిప్రాయపడుతోంది. 81 గ్రామాల్లోని 16,840 వ్యవసాయ బోర్లు, 40,349 ఇళ్లకు సోలార్ ప్లేట్స్ ఏర్పాటు చేస్తారు. ఈ ప్రాజెక్టుకు మొత్తం రూ. 1,273 కోట్లు కేటాయించారు. ఈ ప్రాజెక్ట్ లో భాగంగా సోలార్ ప్లేట్స్ ఏర్పాటుకు రెడ్కో టెండర్లను ఆహ్వానించింది. అయితే మొత్తం వ్యయంలో రూ. 400 కోట్లు కేంద్ర ప్రభుత్వం రాయితీగా అందించనుంది. మిగిలిన రూ. 873 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం భరించనుంది. ఈ మేరకు జూలై 24లోగా టెండర్లను దాఖలు చేయాలని రెడ్కో సూచనలు చేసింది.

**రాష్ట్ర వ్యాప్తంగా అమలు..**

ఈ పైలట్ పథకం ఈ 81 గ్రామాల్లో విజయవంతమైతే, భవిష్యత్తులో రాష్ట్రవ్యాప్తంగా మరిన్ని గ్రామాల్లో సౌరవిద్యుత్ ఏర్పాటు చేయాలనేది ప్రభుత్వ లక్ష్యంగా ఉంది. కాగా, ఈ సౌర విద్యుత్ అందుబాటులోకి వస్తే ఈ గ్రామాల్లో కరెంట్ బిల్లులు చెల్లించాల్సిన పనిలేదు. ఇప్పటికే 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తుండగా..ఇకపై దాని అవసరం కూడా ఉండకపోవచ్చు.

# సంస్థాగత నిర్మాణంపై కాంగ్రెస్ నజర్

(మొదటి పేజీ తరువాయి)

మెదక్ : పొన్నం ప్రభాకర్, హైదరాబాద్ : జగ్గారెడ్డి, మహబూబ్‌నగర్ : కుసుమకుమార్, ఆదిలాబాద్ : అనిల్‌యాదవ్, కరీంనగర్ : అద్దంకి దయాకర్, నిజామాబాద్ : అజ్మతుల్లా హుస్సేన్, రంగారెడ్డి : శివసేనా రెడ్డి

# రాష్ట్రంలో కొత్త రైల్వే లైన్లు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమైన పట్టణాలకు ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తుంది. ఖమ్మం, సూర్యాపేట, నల్గొండ, నాగర్‌కర్నూల్, వనపర్తి, గద్వాల జిల్లాలను కలుపుతుంది. కూసుమంచి, పాలేరు, మోతె, సూర్యాపేట, భీమారం, తిప్పర్తి, నల్గొండ, కనగల్, చండూరు, నాంపల్లి, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్, వనపర్తి, బూత్‌పూర్ వంటి ప్రధాన ప్రాంతాల మీదుగా సాగనుంది. ఈ మార్గం కోసం ఫైనల్ లొకేషన్ సర్వే మంజూరై, సర్వే పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ప్రాజెక్టు ప్రస్తుతం డీటైల్ ప్రాజెక్ట్ రిపోర్ట్ దశలో ఉంది. ఈ మార్గం కోసం టోకెన్ కింద రూ. 7.40 కోట్లు కూడా విడుదల చేశారు. తుది సర్వే పూర్తయ్యాక వ్యయంపై మరింత స్పష్టత వస్తుంది.

డోర్నకల్ - మిర్యాలగూడ కొత్త రైల్వే లైన్ కూడా తెలంగాణలోని పలు ప్రాంతాలకు రైల్వే అనుసంధానాన్ని పెంచనుంది. ఈ రైల్వే లైన్ సుమారు 97 కిలోమీటర్ల పొడవు ఉంటుంది. ఈ లైన్ నిర్మాణానికి సుమారు రూ. 2,160 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా. డోర్నకల్ - గద్వాల, కరీంనగర్ - హసన్పర్తి లైన్లతో కలిపి మొత్తం మూడు ప్రాజెక్టుల అంచనా వ్యయం రూ. 7,840.37 కోట్లుగా నిర్ణయించారు. డోర్నకల్ జంక్షన్ నుంచి కోదాడ, హుజూర్నగర్, నేరేడుచర్ల మీదుగా మిర్యాలగూడ వరకు ఈ మార్గం ఉంటుంది. ఇది గుంటూరు-బీబీనగర్ లైన్కు అనుసంధానించబడుతుంది. దీనివల్ల ఆయా ప్రాంతాల మధ్య రవాణా సౌకర్యాలు మెరుగుపడి సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అంచనా. ఈ రెండు కొత్త రైల్వే లైన్లు తెలంగాణలోని రైల్వే నెట్‌వర్క్‌ను గణనీయంగా పెంచనున్నాయి.

# బిఎడ్ అభ్యర్థులపై అన్యాయాన్ని ఆపండి

- **డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌ను 70% కు పెంచాలని డిమాండ్**
- **జూలై 10 నుంచి బిఎడ్ అభ్యర్థుల మహా పాదయాత్ర**

హైదరాబాద్, మనం ప్రతినిధి: డీఎస్సీ తెలంగాణ బి.ఎడ్ అభ్యర్థుల సంఘం ఆధ్వర్యంలో, పలువురు ప్రతినిధులు.. తెలంగాణ భవన్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రవణ్ కుమార్‌ని కలిశారు. ఈ సందర్భంగా డీఎస్సీ రిక్రూట్‌మెంట్‌లో స్కూల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీలో జరుగుతున్న అన్యాయంపై మాజీ సీఎం కేసీఆర్‌కి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ప్రస్తుతం బి.ఎడ్ అభ్యర్థులకు స్కూల్ అసిస్టెంట్ క్యాడర్ పోస్టుల్లో 30% ఉన్న డైరెక్ట్ రిక్రూట్‌మెంట్‌ను 70% పెంచాలని వారు డిమాండ్ చేశారు. ఇతర రాష్ట్రాల్లో కేంద్ర ప్రభుత్వ నియామకాల్లో ఇప్పటికే 70% డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ అమలులో ఉన్నదని వారు గుర్తు చేశారు. అలాగే, సుప్రీంకోర్ట్ తీర్పు నేపథ్యంలో బి.ఎడ్ అభ్యర్థులు ఇకపై ఎస్‌జీటీ (సెకండరీ గ్రేడ్ టీచర్) పోస్టులకు అర్హత కోల్పోయిన కారణంగా, స్కూల్ అసిస్టెంట్ పోస్టులే తమకు ప్రధాన అవకాశంగా మిగిలాయన్నారు. ప్రభుత్వం అన్యాయం చేయకుండా న్యాయం చేయాలని కోరారు. జూలై 10 నుండి చేపట్టనున్న బిఎడ్ అభ్యర్థుల మహా పాదయాత్ర పోస్టర్‌ను శ్రవణ్ ఆవిష్కరించారు. ఈ పాదయాత్ర యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం నుండి ప్రారంభమై, హైదరాబాద్ ఎస్‌సీఈఆర్‌టీ కార్యాలయం వరకు కొనసాగనుందని ఎస్‌జీటీ ఆభ్యర్థులు ఈ సందర్భంగా వెల్లడించారు.

# స్టైఫండ్ బేస్డ్ అప్రెంటిషిప్ ప్రోగ్రాం

సంతకాలు చేశారు. ఈ సందర్భంగా ఘంటా మాట్లాడుతూ.. విద్యార్థుల్లో చదువుతో పాటు నైపుణ్యం పెంచేందుకు ఈ అవగాహన ఒప్పందం ఎంతో ఉపయోగపడుతుందని చెప్పారు. స్టైఫండ్ ఆధారిత విద్యను (స్టైఫండ్ బేస్డ్ అప్రెంటిషిప్ ప్రోగ్రాం) సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. ప్రతి విద్యార్థికి చదువుతో పాటు ఉద్యోగ అవకాశం కల్పించడం ద్వారా వాళ్ళను వ్యాపారవేత్తలుగా చేయడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ ప్రోగ్రాంలో చేరడానికి 18-28 సంవత్సరాల వారు అర్హులని, తమ విద్యార్థుల భవిష్యత్‌ని దృష్టిలో పెట్టుకొని రానున్న రోజుల్లో ప్రఖ్యాత సంస్థలతో మరిన్ని అవగాహన ఒప్పందాలను చేసుకోనున్నట్లు వెల్లండించారు. పూర్తి వివరాలతో కూడిన నోటిఫికేషన్ త్వరలోనే జారీ చేయనున్నట్టు ఆయన వెల్లడించారు. రిటైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా కార్యనిర్వాహక అధిపతి జేమ్స్ రాఫెల్ మాట్లాడుతూ వ్యక్తిగతంగా ప్రతి విద్యార్థికీ ప్రయోజనం కలిగించేందుకు తమ సంస్థ పనిచేస్తుందన్నారు. ఉద్యోగానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులను ఎంపిక చేసి వారికి చదువుతున్నప్పుడే ఆర్థికంగా సహాయ పడేలా స్టయి ఫండ్ అందించనున్నట్లు వెల్లడించారు. వ్యక్తి, సంస్థ, పరిశ్రమ, భారతదేశం (ఫోర్-ఐ) భావనతో ఈ కోర్సులను రూపొందించామని చెప్పారు. రిటైల్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ప్రతినిధి సమీర్ నర్సాపూర్ మాట్లాడుతూ.. పరిశ్రమనే ఉత్తమ ఉపాధ్యాయుడు అని పేర్కొన్నారు. వృత్తిపరమైన ప్రమాణాలను రూపొందించుకోవాలని సూచించారు. ఒక నిర్దిష్ట ఉద్యోగంపై పాఠ్యాంశాలను దృష్టిలో ఉంచుకుని, పాఠ్యప్రణాళిక, అప్రెంటిషిప్ ఉంటుందని వెల్లడించారు.

# ఈ కేసు రాజకీయ ప్రేరణతో చేసిందే

- **ఇంకేన్ని అక్రమ కేసులు పెట్టిన ప్రశ్నించడం మానుకోము : బీఆర్ఎస్ నేతలు**
- **పీఎస్ ముందు నిరసన... స్టేషన్ బెయిల్ మంజూరు**

హైదరాబాద్, మనం ప్రతినిధి: గత ఏడాది అక్టోబర్ 30న మహబూబ్ నగర్ నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కార్యకర్త వరద భాస్కర్‌పై ఒక సోషల్ మీడియా పోస్టుపై స్థానిక వన్ టౌన్ సీఐ శారీరక దాడికి పాల్పడగా ఈదాడిని తీవ్రంగా ఖండిస్తూ.. మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు పల్లె రవి కుమార్ గౌడ్, ఆంజనేయులు గౌడ్, కిషోర్ గౌడ్,మేడే రాజీవ్ సాగర్‌లతో పాటు పార్టీ కార్యకర్తలు భాస్కర్‌కు న్యాయం చేయాలని స్టేషన్ ముందు పెద్ద ఎత్తున నిరసన వ్యక్తం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈ కేసు పూర్తిగా రాజకీయ ప్రేరణతో నమోదు చేసిందని తెలిపారు. ఇలాంటివి ఇంకేన్ని అక్రమ కేసులు పెట్టిన కాంగ్రెస్ దౌర్జన్యాన్ని ప్రశ్నించడం మానుకోమని హితవు పలికారు.

# పోలీసులు.. కాంగ్రెస్ కార్యకర్తలా?

- **అలా వ్యవహరిస్తే? మీరే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాలే?**
- **పోలీసులకు కేటీఆర్ హెచ్చరిక**

హైదరాబాద్, మనం ప్రతినిధి: ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు కూడా లేదా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ప్రశ్నించారు. మంత్రి సీతక్క అనుచరుల వేధింపులతో ఆత్మహత్య చేసుకున్న చుక్క రమేశ్ మృతికి నిరసనగా బీఆర్ఎస్ చేస్తున్న శాంతియుత ఆందోళనను పోలీసులు అడ్డుకోవడం అప్రజాస్వామికం అని మండిపడ్డారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్ రెడ్డి, గండ్ర వెంకటరమణతో పాటు నాయకులు, కార్యకర్తలపై పోలీసుల దౌర్జన్యాన్ని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. పోలీస్ యాక్ట్ పేరుతో బీఆర్ఎస్ శాంతియుత నిరసనను అడ్డుకున్న ములుగు పోలీసులు, కాంగ్రెస్ నేతల పర్యటనకు మాత్రం పర్మిషన్ ఇవ్వడం చూస్తుంటే కొంతమంది పోలీసులు ఆ పార్టీకి తొత్తుల్లాగా పనిచేస్తున్నారన్న సంగతి అర్థం అవుతుందని కేటీఆర్ అన్నారు. నిన్న అర్ధరాత్రి నుంచే ములుగు నియోజకవర్గం వ్యాప్తంగా గ్రామాలపై దొంగల లెక్క విరుచుకుపడ్డ పోలీసులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, నేతలను అక్రమంగా అరెస్ట్ చేయడం ఏం పోలీసింగ్ అని కేటీఆర్ మండిపడ్డారు. ఎవరి ఆదేశాల మేరకు దౌర్జన్యంగా ఇళ్లలోకి దూరి 2 వేల మంది బీఆర్ఎస్ కార్యకర్తలను అరెస్ట్ చేశారో ములుగు పోలీసులు చెప్పాలని డిమాండ్ చేశారు.



## ఘనంగా మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుక

**రంగారెడ్డి, జూలై7(మనం న్యూస్):** చంపాపేట్ పరిధిలోని అంబేద్కర్ వాడలో సోమవారం ఎమ్మార్పీఎస్, ఎంఎస్పి నాయకుల ఆధ్వర్యంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ ఎంఎస్పి నాయకులు కార్యకర్తల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఎల్బీనగర్ ఎంఎస్పి ఇన్‌చార్జ్, సీనియర్ పత్రిక విలేఖరి హేమంత్ చంపాపేట్ సీనియర్ నాయకులు కే.ప్రభాకర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... సమాజంలో మాదిగలు గురవుతున్న అణిచివేతను దృష్టిలో ఉంచుకొని వారికి సమాన హక్కులు కలగాలని ముందుచూపుతో మందకృష్ణ మాదిగ... మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి పార్టీని స్థాపించి మూడు దశాబ్దాలు పాటు అలుపెరుగని పోరాటం చేసి మాదిగలకు సమాజంలో సమచిత స్థానాన్ని కలిగించిన మహనీయుడు మందకృష్ణ మాదిగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ చంపాపేట్ డివిజన్ సీనియర్ నాయకులు , మల్లెపోగు రాజు, ఎస్ నరసింహ, ఎస్ సంజన, ఏ సురేష్, మంద నరసింహ (దేవ) రవి, బైగల్ల రాము, నర్సింగరావు, వి రవి, వెంకటేష్, రమేష్ స్థానికులు తదితరులు ఆదిత్య సంఖ్యలో పాల్గొన్నారు.

## లెగసీ అవార్డ్స్-2025లో ఉప్పల



**రంగారెడ్డి, జూలై 7(మనం న్యూస్):** బిర్లా ప్లానిటోరియా లో జరిగిన లెగసీ అవారడ్స్ -2025 సీజన్ - 3 లో టి పీసీసీ ప్రధాన కార్యదర్శి ఉప్పల శ్రీనివాస్ గుప్త పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పూర్ణ నంది తెలుగు తేజం అవార్డ్ -2025 అందుకున్న వారికి అభినందనలు తెలిపారు. డాక్టర్స్, సింగర్ , ప్రవేట్ రంగాల్లో రాణి స్తున్న ఉపాధ్యాయులు మహిళ సోదరీమణులు పురుషులతో పాటు సమానంగా రాణించాలని ఆయన సూచించారు. అవార్డ్ వచ్చినా వారు బాధ్యతలో మరిన్ని అవార్డులు పొందాలని ఆయన అన్నారు. వారికి తన వంతుగా సహాయ సహకారాలు అందిస్తామని ఆయన తెలిపారు. ఇలాంటి అవార్డులు మరెన్నో నిర్వహించాలని అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ సర్జరీ డా. ఐశ్వర్య పాట పాటి రాజు, కోలన్ జాగ్జీవన్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, మల్లీశ్వరి తదితరులు పాల్గొన్నారు.

## ప్రసాద్ కుటుంబానికి చొప్పదండి ఎమ్మెల్యే పరామర్శ



**రాజన్న సిరిసిల్ల, జూలై 7(మనం ప్రతినిధి):** రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో టీవీ9 రిపోర్టర్ ప్రసాద్ ఆకస్మిక మరణం చెందగా చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం సోమవారం ప్రసాద్ కుటుంబాన్ని పరామర్శించారు. రూ 20000 ఆర్థిక సహాయం అందించారు. జిల్లా కలెక్టర్ తో మాట్లాడి కలెక్టర్ స్పెషల్ ఫండ్ నుంచి ఆర్థిక సాయం అందించాలని కోరారు. దీంతో కలెక్టర్ స్పందిస్తూ 50,000 అందిస్తామని హామీ ఇచ్చారు. వారం రోజుల్లో డబల్ బెడ్ రూమ్ ప్రొసీడింగ్ అందించేలా చర్యలు తీసుకోవాలని జర్నలిస్ట్ సంఘాలు కోరగా ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం స్పందిస్తూ. ప్రభుత్వ విపాద శ్రీనివాస్ గారితో మాట్లాడి.. డబల్ బెడ్ రూమ్ ఇల్లు ప్రసాద్ కుటుంబానికి అందించేలా చర్యలు తీసుకుంటామన్నారు. జర్నలిస్టుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు.



కాకతీయ యూనివర్సిటీ 23వ స్నాతకోత్సవాన్ని వరంగల్‌లో అట్టహాసంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ హాజరయ్యారు. హైదరాబాద్ నగరంలోని దిల్‌సుఖ్ నగర్‌కు చెందిన కొలను చందన బీ టెక్ కంప్యూటర్ సైన్స్ విభాగంలో (గోల్డ్ మెడల్) బంగారు పతకాన్ని గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా సోమవారం అందుకున్నారు.

- రంగారెడ్డి, జూలై 7, మనం న్యూస్

# పార్టీ బలోపేతానికి యూత్ కాంగ్రెస్ కృషి అవశ్యం

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి




**కడ్తాల్, జూలై 7( మనం, న్యూస్):** కడ్తాల్ మండలం మైసిగండి ఎస్.కే ప్యాలెస్ లో సోమవారం కల్వకుర్తి నియోజకవర్గ విస్తృత స్థాయి సమావేశం యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు దళపతి గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కల్వకుర్తి శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి యూత్ కాంగ్రెస్ కృషి చేయాలని యూత్ కాంగ్రెస్ నాయకులను కోరారు. పార్టీ ఇచ్చే కార్యక్రమంలో పాల్గొని విజయవంతం అయ్యే విధంగా చేయాలని తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లో యూత్ కాంగ్రెస్ ద్వారా విస్తృత ప్రచారం చేయాలని కోరారు. కల్వకుర్తి నియోజకవర్గాల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో యూత్ కాంగ్రెస్ ద్వారా ప్రజలను భాగస్వామ్యం చేయాలని కోరారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి యూత్ కాంగ్రెస్ నాయకుడికి రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అవకాశం కల్పిస్తామని పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో యూత్ కాంగ్రెస్ పటిష్టంగా ఉండి ప్రతి ఒక్కరు బాధ్యతగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి సభ్యులు అయిల్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు యట నరసింహ, జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాస్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు బీచ్యా నాయక్, సింగల్ విండో డైరెక్టర్ చేగూరి వెంకటేష్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు నాగేందర్ రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ఇంచార్జిలు రామచంద్రరెడ్డి, అరవింద్, ప్రధాన కార్యదర్శులు క్యామ రాజేష్, అభినవ్ రెడ్డి,అనిల్ గౌడ్, తాలూకా జనరల్ సెక్రటరీలు అనిల్, నరేష్,బాలరాజు, మండల అధ్యక్షులు బోసు రవి, పసుల శ్రీకాంత్, శివగౌడ్, భారత్ గౌడ్, బాబా యూత్ కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలు సాధికారత సాధించాలి



- సోషల్ జస్టిస్ అండ్ ఎంపవర్మెంట్ బోర్డును బలోపేతం చేస్తాం
- చైర్మన్ దోర్నాల సత్యం నారాయణ

**రంగారెడ్డి, జూలై 7(మనం న్యూస్):** సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ బోర్డును బలోపేతం చేసి సామాజిక న్యాయం, మహిళా భద్రత, సత్వర న్యాయం కోసం కృషి చేస్తామని సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ బోర్డు రాష్ట్ర చైర్మన్ దోర్నాల సత్యం నారాయణ అన్నారు. దిల్ సుఖ్ నగర్ లోని ఓ కన్వెన్షన్ లో సోమవారం రాష్ట్ర కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ బోర్డు చేపట్టే కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ సామాజిక న్యాయం, మహిళా సాధికారత కోసం బోర్డు కృషి చేస్తుందన్నారు. ఆగస్ట్ నెలలో సోషల్ జస్టిస్ అండ్ ఉమెన్ ఎంపవర్మెంట్ బోర్డు మినిస్ట్రీస్ కేంద్ర మంత్రి ఆధ్వర్యంలో బోర్డు విధి విధానాలు, అడ్ హాక్ కమిటీని ప్రకటించనున్నట్లు చైర్మన్ దోర్నాల సత్యం నారాయణ తెలిపారు. త్వరలో జిల్లా స్థాయి కమిటీలు నియమించి బోర్డును బలోపేతం చేస్తానన్నారు. సమావేశంలో రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు బొడ్డుపల్లి రాజు, ఉదయ్ కుమార్, వేమారెడ్డి, హారిక, సరిత, రమా, అక్షర తదితరులు పాల్గొన్నారు.

## కరెంటు డీఈకి మున్సిపాలిటీ బీజేపీ నేతల వినతి



**తుర్క యంజాల్, జూలై 7( మనం న్యూస్):** తుర్కయంజాల్ మున్సిపాలిటీ ఇంజాపూర్ లో ల్యాండ్ మార్క్ కాలిన వెళ్లే ప్రధాన రహదారిలో కరెంటు స్తంభం రోడ్డు ప్రక్కన ప్రమాదకరంగా మారిందని సోమవారం బిజెపి ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పురుషోత్తం, బిజెపి రాష్ట్ర కోశాధికారి బచ్చి గళ్ళ రమేష్ , కరెంటు డి ఈ నరేష్ కుమార్ కి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ, ఉదయం సాయంత్రం వేళలో పాఠశాల బస్సులు తిరుగుతున్నందున అక్కడ ఉన్న కరెంట్ స్తంభం ప్రమాదకరంగా మారిందని, ఇంతకుముందు అక్కడ రోడ్డుపైన నడుస్తున్న వాహనాలు స్తంభానికి తాకడం జరిగిందని, ముందు జాగ్రత్తగా స్తంభాని తొలగించ్చి ప్రక్కకు వేయాలని తెలియజేశారు. ఇబ్రహీంపట్నం డిఈ నరేష్ కుమార్ సానుకూలంగా స్పందించి అక్కడున్న కరెంటు స్తంభాన్ని తొలగించి, పక్కకు వేయిస్తానని చెప్పారు.

## ప్రియురాలిపై దాడి.. తాను పొడుచుకున్న ప్రియుడు

- యువతి మృతి.. యువకుడి పరిస్థితి విషమం



**రామచంద్రపురం, జూలై 7(మనం న్యూస్):** సంగారెడ్డి జిల్లా బండలగూడలో ఘోరం చోటు చేసుకుంది. ప్రియురాలిని కత్తితో పొడిచి.. అదే కత్తితో పొడుచుకున్నాడు ప్రియుడు.. ఈ ఘటనలో ప్రియురాలు మృతిచెందగా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ప్రియుడి పరిస్థితి విషమంగా ఉంది. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇవి..పటాన్ చెరు డివిజన్ బండ్లగూడ గ్రామం బాలాజీ నగర్ కు చెందిన రమ్య(23), ఆకుల ప్రవీణ్ గత కొన్ని సంవత్సరాలుగా ప్రేమించుకున్నారు. రమ్య డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతోంది. వీరి ప్రేమ విషయం తెలిసిన రమ్య తల్లిదండ్రులు వారి పెళ్లికి ఒప్పుకోలేరు. రమ్య తల్లిదండ్రులు ప్రైవేట్ కంపెనీలో పని చేస్తారు. వారిద్దరూ సోమవారం పనికి వెళ్లిపోగా, ఆకుల ప్రవీణ్ రమ్య ఇంటికి ఎవ్వరు లేని సమయంలో వచ్చి కత్తితో రమ్య గొంతు కోసి, అదే కత్తితో ఆత్మహత్యకు యత్నించాడు. ఈ ఘటనలో రమ్య అక్కడికక్కడే మృతి చెందింది. రోజు రమ్యతో ఫోన్లో మాట్లాడి ఎక్కడున్న విషయాన్ని తల్లిదండ్రులు తెలుసుకునేవారు. ఇందులో భాగంగానే సోమవారం రమ్య తండ్రి శ్రీనివాస్ ఫోన్ చేయగా రమ్య ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో అనుమానం వచ్చి తల్లిదండ్రులు ఇంటికి వచ్చారు. లోపలికి వెళ్ళి చూడగా రమ్య, ప్రవీణ్ ఇద్దరూ రక్తపు మడుగులో పడి ఉన్నారు.. అప్పటికే రమ్య మృతి చెందగా, ఊపిరితో ఉన్న ప్రవీణ్ కు స్థానికులు 108 సహాయంతో బీరంగూడలోని ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉంది. ఇదిలా ఉండగా రమ్య కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు రామచంద్రపురం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. మెడపై కత్తితో దాడి చేసిన అనంతరం ప్రవీణ్ ఆత్మహత్య చేసుకున్నాడా లేదా ఇద్దరు ఆత్మా హత్యకు పాల్పడ్డారా అనే కోణంలో కూడా పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# దేవాలయ భూమికి పట్టా చేయించండి.. సారు

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతి పత్రం అందజేసిన కురుమ సంఘం సభ్యులు



**తుర్క యంజాల్, జూలై 7(మనం న్యూస్):** తుర్కయంజాల్ మున్సిపాలిటీలోని కోహెడ గ్రామంలో కురుమ సంఘం సభ్యులు నిర్వహించిన సమావేశంలో బీరప్ప స్వామి ఆలయానికి ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, తెలంగాణ రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రామ్ రెడ్డికి కురుమ సంఘం కమిటీ సభ్యులు వినతి పత్రం అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, కురుమ సంఘం కులస్తులకు సంబంధించిన బీరప్ప స్వామి గుడి సర్వే నంబర్ 744లో గల భూమి 4 ఎకరాల 21 కుంట భూమి కామరాతీదేవి, అక్క మహంకాళి దేవి, శ్రీ పెద్దమ్మ తల్లి దేవాలయానికి, సంబంధించిన భూమిని గత బీఆర్ఎస్ ప్రభుత్వ పాలకులు బీరప్ప దేవాలయ భూమిని ధరణిలో పట్టా చేయనందుకు మీ కురుమ సంఘం కులస్తులకు నేను మీకు ముందుండి సర్వే నంబర్744లో 4 ఎకరాల 21 కుంటల భూమిని, అబ్దుల్లాపూర్మెట్ మెట్ ఎమ్మార్వోను, ఇబ్రహీంపట్నం ఆర్డీవోను, తొర్రూర్ క్యాంపు కార్యాలయానికి తొందరలో రప్పించి మీ కురుమ సంఘం పెద్దల ముందు మాట్లాడి, భూభారతిలో భూమి పట్టా పాస్ బుక్ బీరప్ప దేవస్థానం గుడి మీద చేయిస్తానని, తెలియజేశారు. బీరప్ప దేవాలయ గుడి ముందున్న పాత బావిని సదును చేయిస్తానని, ఎల్లవేళలా కోహెడ గ్రామ కురుమ సంఘం ప్రజలకు ముందుంటానని, తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, ముత్యాల రాజశేఖర్ రావు, మాజీ కౌన్సిలర్లు బండారు బాలరాజు, కంబాలపల్లి ధన్ రాజ్, బీరప్ప స్వామి గుడి చైర్మన్ బండారు శ్రీశైలం, వైస్ చైర్మన్ రాసూరి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి సిద్ధాల బాలకృష్ణ, సహాయ కార్యదర్శి, పోచిగారి రంగయ్య, కోశాధికారి పోచిగారి యాదగిరి, కార్యదర్శి ఇమ్మిడి విజయ్, కార్యదర్శి సుబ్బారు రాఘవేందర్, గంగని శ్రీను, విజయ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు వంగేటి గోపాల్ రెడ్డి, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఊరెళ్ళలో ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావోత్సవం



**చేవెళ్ల, జూలై 7(మనం న్యూస్):** చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని ఊరెళ్ళ వార్డులో గ్రామ అధ్యక్షులు నరేష్ అధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా చేవెళ్ల మండల కో - ఇన్‌చార్జి చేవెళ్ల మల్లికార్జున, మాజీ సర్పంచులు జహంగీర్, నర్సింలు, మాజీ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, మాజీ ఉప సర్పంచి ఎస్. విట్టలయ్య పాల్గొని ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ... ఎమ్మార్పీఎస్ గత 30 ఏళ్ల పోరాడి సాధించుకునటువంటి రిజర్వేషన్ ఫలాలను ముందు అందరికీ అందేలా కృషి చేయాలని నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు పెంటయ్య, చందు, యాదయ్య, మల్లేష్, రమేశ్, కమిటీ సభ్యులు మహేందర్, రాజు, రాము, ప్రవీణ్ , మహేందర్, రాజు, అనిల్, సంజీవయ్యా, జైరాజ్, అశోక్, మహమ్మద్ మోయిజ్, యాదగిరి, శ్రీకాంత్, శివాజీ, కృష్ణ, శ్రీనివాస్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## చేవెళ్ల మున్సిపల్ పరిధిలో.. ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినం




**చేవెళ్ల, జూలై 7(మనం న్యూస్):** ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలు చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని దామరగిద్ద వార్డులో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ గ్రామ అధ్యక్షుడు తాళ్లపల్లి చందు ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఎగురవేశారు. అనంతరం కేక్ కట్చేసి పంచిపెట్టారు. కార్యక్రమంలో బాబు జగ్జీవన్ రామ్ యూత్ అధ్యక్షులు బోడ వెంకటేష్, బాబు జగ్జీవన్ రామ్ యూత్ మాజీ అధ్యక్షులు డప్పు రాజు, బాబు జగ్జీవన్ రామ్ యూత్ ఉపాధ్యక్షులు ఖానాపురం కుమార్, గ్రామ మాజీ వార్డు సభ్యులు రామయ్య, బాబు జగ్జీవన్ రామ్ యూత్, ఎమ్మార్పీఎస్ సభ్యులు సిమోన్, సామెల్, ఎల్లయ్య, జంగయ్య, నర్సింలు, మహేందర్, జంగయ్య, పవన్, ప్రకాష్, ప్రశాంత్, మొయాబ్, ప్రకాష్, గ్రామస్థులు దొడ్డి రామ్, రోహిత్ గుప్తా, మనోహర్, సాయి కుమార్, నర్సింలు పాల్గొన్నారు.

## మంద కృష్ణను కలిసిన తుర్క యంజాల్ నేతలు



**తుర్క యంజాల్, జూలై 7(మనం న్యూస్):** మందకృష్ణ మాదిగల హక్కుల కోసం రాజకీయ నాయకులతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నప్పటికీ కొన్ని సందర్భాల్లో అవమానాలను కూడా ఎదుర్కొని ఎస్సీ వర్గీకరణ కోసం నిరంతరం పోరాడుతూ మాదిగల సమాజానికి సామాజిక న్యాయం కోసం అవిశ్రాంతగా కృషిచేసిన మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి వ్యవస్థాపక అధ్యక్షులు, పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ జన్మదినం సందర్భంగా సోమవారం తుర్కయంజాల్ మున్సిపాలిటీ నాయకులు కొంద్రు పురుషోత్తం, బచ్చిగళ్ల రమేష్, వద్దిగళ్ల బాబు, మల్లెల రఘు లు మర్యాదపూర్వకంగా కలిసి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాన్ని వేగవంతం చేయాలి

- సంగారెడ్డి జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య

**సంగారెడ్డి, జూలై 7(మనం ప్రతినిధి):** ఇందిరమ్మ పథకం ద్వారా అర్హులైన నిరుపేదలకు మంజూరైన గృహాలను వేగవంతంగా పూర్తి చేయాలని పి.ప్రావిణ్య, జిల్లా కలెక్టర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ... పట్టణ గ్రామీణ ప్రాంతాల్లో మంజూరైన ఇండ్లకు పది రోజుల లోపు గ్రౌండ్ పూర్తి చేయాలని కలెక్టర్, మండల పరిషత్, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. మంజూరైన ప్రతి ఇంటికి ముగ్గు వేసి జియో ట్యాగ్ చేయాల్సిందిగా సూచించారు. జిల్లాలో మొత్తం 16559 ఇండ్లు కేటాయింపు జరగగా అందులో 14 529 ఇల్లు మంజూరయ్యాయి. ఇప్పటివరకు 5768 ఇండ్లకు మార్కౌట్ ప్రక్రియ పూర్తయింది. వాటిలో 692 ఇళ్లకు బేస్మెంట్ పనులు పూర్తయ్యాయి. బేస్మెంట్ పూర్తి చేసిన 532 ఇందిర ఇళ్ల లబ్ధిదారులకు లబ్ధిదారులకు ఒక్కొక్కరికి లక్ష చొప్పున నిధులు విడుదలయ్యాయని తెలిపారు. ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం కోసం మహిళా స్వయం సహాయ సంఘాలకు,



జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 12 కోట్ల రూపాయలు విడుదలైనట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సమీక్ష సమావేశంలో అధర్మ కలెక్టర్ చంద్రశేఖర్ గృహ నిర్మాణ శాఖ పీడి చలపతిరావు మండల పరిషత్ అధికారులు మున్సిపల్ కమిషనర్లు గృహ నిర్మాణ శాఖ ఇంజనీర్లు పాల్గొన్నారు.

# విధ్వంసం అభివృద్ధికి విఘాతం



ప్రపంచంలో ఎప్పుడూ ఏదో ఒక చోట ఏవో అలజడులు చెలరేగుతూనే ఉన్నాయి. మానవ రుధిరం ఏరులై ప్రవహిస్తూనే ఉంది. మతం పేరుతోనో,ప్రాంతం పేరుతోనో మారణకాండ విశృంఖల విహారం చేస్తూనే ఉంది. ఒక వైపు ఉక్రెయిన్,రష్యా యుద్ధం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను అతలాకుతలం చేసింది. ఇజ్రాయిల్, హమాస్ దాడులు గాజును రక్తం సిక్తం చేసాయి. పాక్ ప్రేరణతో భారత్ లో సీమాంతర ఉగ్రవాదం ప్రబలింది. ఇటీవల పహల్గాం లో అమాయకులను ఉగ్రవాదులు అత్యంత దారుణంగా కాల్చిచంపడంతో భారత్- పాక్ ల మధ్య తీవ్రమైన ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. మనుషుల ప్రాణం తీసే మానసిక ఉన్మాదం పతాక స్థాయికి చేరింది. ఇతర దేశాలను నరమేథంతో దారికి తెచ్చుకోవాలనే పరాకాష్ఠకు చేరిన పైశాచిక అకృత్యాన్ని 'ఉగ్రవాదం' గా పేర్కొనవచ్చు. ఉగ్రవాదం ఆధునిక కాలంలో కొనసాగుతున్న అత్యంత క్రూరమైన ఆటవిక చర్య. ఉగ్రవాదం భారతదేశానికి ఒక విషమ సమస్యగా మారింది. స్వాతంత్ర్యానికి ముందు,తర్వాత కూడా భారతదేశం అనేక రూపాల్లో కొనసాగుతున్న ఉగ్రవాదం వలన నష్టపోతూనే ఉంది. దేశ విభజన సమయంలోనే మనం అనేక విధాలుగా నష్టపోయాం. ఇప్పుడు కూడా ఉగ్రవాదం రూపంలో పరాయి మూకలు దేశాన్ని కబళించాలని చూస్తున్నాయి.ఇతరుల స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను గుర్తించి గౌరవించిన దేశానికి నేటికీ కష్టాలు తప్పలేదు.బంగ్లా విమోచన కోసం పోరాడినా, లంకేయుల దేశ సమగ్రత కోసం శ్రీలంకకు శాంతి సైన్యాన్ని పంపించి కాపాడినా భారత దేశానికి శతృ భాధలు తప్పలేదు చేదు ఫలితాలను చవిచూస్తున్నాం.పొరుగు దేశాల్లోని ఉగ్రవాదుల పంజాకు భారతదేశం మూల్యం చెల్లించుకోవడం ఇంకా కొనసాగుతూనే ఉన్నది.ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా అదొక అనాగరిక,అమానుష ప్రక్రియ గానే భావించాలి. అమాయప్రజల రుధిరంతో తడిసిన కర్కశమూకల వికృత ఆగడాలకు అడ్డాగా మారిన ఉగ్రవాద సంస్థలకు ఊతమిచ్చే ఏ దేశమైనా తమ పాపకృత్యాలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు. రాయబారాలతో,ఒప్పందాలతో రాజీ పడని మనస్తత్వాలకు దండోపాయమే శరణ్యమన్న సూత్రం ఇటీవల భారత్ జరిపిన ఆపరేషన్ సందూర్ నిరూపించింది. ఉగ్రవాద శిబిరాల ధ్వంసం ఉరిమురిమి చూసే ఉగ్రదేశమైన పాకిస్థాన్‌కు ముచ్చెమటలు పట్టించింది. ప్రపంచమంతా ఉగ్రవాదాన్ని అసహ్యించుకుంటున్నా 'నవ్విపోదురు గాని నాకేటి సిగ్గు' అనే రీతిలో పాక్ బరితెగించింది.పాక్ ప్రభుత్వం,మిలటరీ ఉగ్రవాదులకు అండగా నిలబడడం దౌర్భాగ్యం. ఉగ్రవాదుల పీడ వదిలించుకోలేని పాక్ ఆర్థికంగా పతనావస్థకు చేరింది. పాక్‌లో అంతర్గత సంక్షోభం విభజన దశకు చేరుకుంది. తన ఇంటిని చక్కదిద్దుకోలేని పాక్ భారత్ ను నాశనం చేయాలను కోవడం దుర్మార్గమైన చర్య. వ్యక్తులను,వ్యవస్థలను నిర్వీర్యం చేసి,ఆర్థిక మూలాలను ధ్వంసం చేయడమే కాకుండా అమాయక ప్రజల ప్రాణాలను అలవోకగా బలితీసుకుంటూ, నిరంతరం అశాంతిని ప్రజ్వలింపచేస్తూ ఆయా దేశాలను ఆక్రమించుకోవడమో, తమ కనుసన్నల్లో మసలుకునేటట్టు చేయడమో కొన్ని దేశాలకు నిత్యకృత్యంలా మారింది. మానవత్వం నశించిన కరడు గట్టిన పైశాచిక వాదులను సమూహాలుగా ఏర్పాటు చేసి, ఇతర దేశాల్లోమారణహోమం సృష్టించడమే ధ్యేయంగా ఏర్పాటయిన విధ్యంసకారక సంస్థలే ఉగ్రవాద సంస్థలు.ఇతర దేశాల భూభాగాలను ఆక్రమించుకోవాలనే దురుద్దేశంతో అశాంతిని సృష్టించే సామ్రాజ్యవాద శక్తులు ఒకవైపు,అకారణ కలహాలతో నిరంతరం ప్రజల ప్రాణాలను బలితీసుకుంటూ ఏదో సాధించాలన్న తపనతో మానవత్వాన్ని మంటగలిపి,ఆ మంటల్లో చలికాసుకునే పైశాచికత్వం మరోవైపు ప్రపంచంలో ప్రబలిపోతుండడం విచారకరం. మానవత్వపు ఛాయలు విచ్ఛిన్నకారుల మనస్సుల్లో



మచ్చుకైనా కానరావు. కరడు గట్టిన రాక్షసత్వమే నైజంగా బ్రతికే ఉగ్రవాదులను విప్లవకారులుగా,సంస్కర్తలుగా కీర్తించే దేశాలను,ఉగ్రమూకలకు వత్తాసు పలుకుతూ, వారు సాగించే ఘోర హింసాకాండకు ఆర్థికంగా, నైతికంగా సహకరించే దేశాల అనైతిక పోకడలను వర్ణింపతరం కాదు. మతమౌఢ్యవాదంతోనో, సామ్రాజ్యవాదంతోనో, స్వేచ్ఛ పేరుతోనో అమాయకుల కుత్తుకలను ఖండించే దుశ్చర్యలకు పాల్పడే కర్కశవాదం నుండి పుట్టిన ఉగ్రవాదాన్ని కూకటి వ్రేళ్ళతే పెకలించాయి.చాలామంది ఉగ్రవాదులకు తాము సాగిస్తున్న మారణ కాండకు సంబంధించి సహేతుకమైన కారణం కనిపించదు.కొంతమంది ప్రోద్భలంతోనో,వారిచేత ప్రేరేపించబడిన తీవ్రమైన మానసిక భావజాలంతోనో ఉగ్రవాదులుగా మారిన వారు కొందరైతే...ఉగ్రవాద శిబిరాలను నడుపుతూ ఇతర దేశాల నుండి అందుతున్న డబ్బు సంచులకు మోజుపడి స్వార్థ పూరితమైన లక్ష్యాలతో ఉగ్రవాదులను పెంచి పోషించే వారు మరికొందరు ప్రపంచాన్ని అశాంతికి గురిచేస్తున్నారు. ఉగ్రవాదం కూడా కొంతమందికి ఉపాధినిచ్చే ముడిసరుకుగా మారడం అత్యంతహేయం, అమానవీయం.అశాంతిని సృష్టించడం వలన సాధించేదేమీ ఉండదన్న నగ్నసత్యం ఇప్పుటి వరకూ జరిగిన మొదటి,రెండవ ప్రపంచ యుద్ధ ఫలితాలు నిరూపించాయి.అమాయకుల ప్రాణాలు బలికావడం తప్ప ఉగ్రవాదుల దుశ్చర్యల వలన ఒనగూడే ప్రయోజనం శూన్యమని ప్రపంచంలో అనేక విధ్వంసాలు సృష్టించి తెరమరుగైన ఉగ్రవాద సంస్థల దృష్టాంతాలను గమనించాలి.భారత దేశం శాంతి కాముక దేశం. ఈ శాంతి వచనాల వల్ల ఇప్పటికే దేశం ఎంతో కోల్పోయింది. భవిష్యత్తులో మన దేశం ఇలాంటి శాంతి వచనాలు వల్లించడానికి సంసిద్ధంగా లేదు. వ్యూహానికి ప్రతివ్యూహం...దెబ్బకు ఎదురుదెబ్బ అన్నట్టుగా ముందుకు సాగితేనే శతృదేశాలు దారిలోకి వస్తాయి. ఐక్యరాజ్య సమితి కూడా ఉగ్రవాదం వలన భారత్ ఎదుర్కొంటున్న సమస్యల పట్ల మొసలి కన్నీరు కార్చిందే తప్ప పాకిస్తాన్ పట్ల కఠిన వైఖరి తీసుకోలేకపోయింది. ద్వైపాక్షిక ఒప్పందాలతో సమస్యలను పరిష్కరించుకోవాలని చాలా దేశాలు నెచ్చచెప్పడం జరిగింది. మన దేశం కూడా ఎన్నో సార్లు పాక్ తో ద్వైపాక్షిక ఒప్పందాలకు సిద్దమైంది. అయితే పాక్ తో కుదుర్చుకున్న ప్రతీ ఒప్పందాన్ని పాక్ పాలకులు తుంగలో తొక్కి విధ్వంస రచనకు తెరతీసారు. జుల్ఫికర్ ఆలీ భుట్టో నుండి జియా-ఉల్- వరకు, ముషారఫ్ నుండి నవాజ్ షరీఫ్ వరకు భారత్ లో హింస రచనకే అగ్రతాంబూలమిచ్చారు.

1971వ సంవత్సరంలో భారత్ - పాకిస్తాన్ మధ్య జరిగిన యుద్ధం వలన పాకిస్తాన్ నుండి తూర్పు పాకిస్తాన్ విడివడి బంగ్లాదేశ్ గా అవతరించింది. ఈ యుద్ధంలో ఘోరపరాజయం పొందిన పాకిస్తాన్ భారత్‌తో సిమ్లా ఒడంబడిక చేసుకున్నది.ఈ ఒడంబడిక ద్వారా ఇరుదేశాల విషయంలో మూడో దేశం మధ్యవర్తిత్వం వహించరాదు. అయినప్పటికీ పాక్ ప్రతీ సమస్యకూ ఐక్యరాజ్య సమితి, ఇతర దేశాల మధ్య వర్తిత్వానికి ప్రాకులాడడం,సరిహద్దుల్లో కాల్పులకు తెగబడడం,సీమాంతర ఉగ్రవాదానికి పాల్పడడం సిమ్లా ఒడంబడికకు విరుద్ధమే. కార్గిల్‌లో చొరబాట్లకు పాల్పడి,చావు దెబ్బ తిన్న పాక్ ఇంకా గుణపాఠం నేర్చుకోలేదు. లాల్ బహదూర్ శాస్త్రి,ఇందిరా గాంధీ, వాజ్‌పేయి, మోడీ వంటి భారతీయ ప్రధానులు పాకిస్థాన్‌కు దీటైన సమాధానం చెప్పారు. అయినప్పటికీ సరిహద్దుల్లో పాక్ ఆగడాలు ఆగడం లేదు. పుల్వామా,పఠాన్ కోట్,యూరి వంటి, పహల్గాం వంటి సంఘటనలపై స్పందించిన ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం 'సర్జికల్ స్ట్రయిక్స్' ద్వారా, ఆపరేషన్ సిందూర్ ద్వారా పాక్ కు గట్టిగా గుణపాఠం నేర్పింది. అయినప్పటికీ పాక్ వైఖరిలో మార్పు రావడం లేదు.ఉగ్రవాదం వలన భారత్ తన అపారమైన వనరులను అభివృద్ధికి వెచ్చించలేకపోతున్నది. రక్షణ రంగానికి అధిక నిధులను కేటాయించవలసి వస్తున్నది. ఉగ్రవాదులకు ఊతమిస్తున్న పాక్ ఆర్థికంగా పీకల్లోతు కష్టాల్లోకి నెట్టబడింది. పాకిస్తాన్ భవితవ్యమే అగమ్యగోచరంగా మారింది. పాక్ ప్రజలు కూడా పాక్ ప్రేరిత ఉగ్రవాదం పట్ల అసహనంగా ఉన్నమాట వాస్తవం. పాక్ ప్రభుత్వ విధానాల వల్ల అక్కడ ప్రజల్లో తిరుగుబాటు చెలరేగి చీలిక ఏర్పడింది. ఇప్పటికైనా పాకిస్తాన్ బుద్ధి తెచ్చుకుని, ఉగ్రవాదానికి స్వస్తి వాక్యం పలకాలి. 'ఉగ్రవాదం' ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న అంతర్జాతీయ సమస్య. ముఖ్యంగా పాక్ ప్రేరిత ఉగ్రవాదం భారత దేశానికి తీవ్రనష్టం కలిగిస్తున్నది. ఐక్యరాజ్య సమితి, ఇతర అగ్రరాజ్యాలు వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకుని పాక్ ఆగడాలను అరికట్టి, ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి? భారత దేశం లో జన్మించిన ప్రతీ ఒక్కరూ శాంతి కాముకలే...ఉగ్రవాదానికి వ్యతిరేకులే. ఉగ్రవాదానికి వ్యతిరేకంగా భారతీయ యువత నిరంతరం పోరాడాలి. యువత భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలంటే దేశంలో శాంతి సుస్థిరతలు వెల్లివిరియాలి. అభివృద్ధి పునాదులను పెకలించే ఉగ్రవాదాన్ని కూకటి వ్రేళ్ళతో పెకలించాలి.ఉగ్రవాదం ఆధునిక సమాజంలో పరమజుగుప్సాకరమైన,అత్యంత క్రూరమైన ఆటవిక ప్రక్రియ. ప్రపంచమంతా ఈ హేయమైన ఉగ్రవాద దుశ్చర్యలను ఏవగించుకుంటుంటే ఇంకా ఇలాంటి ఆటవిక చర్యలను ప్రేరేపిస్తూ ఉగ్రవాదులకు ఆశ్రయమిస్తూ తమ పబ్బం గడుపుకుంటున్న పాక్ లాంటి దేశాలపై ఆర్థిక పరమైన ఆంక్షలు విధించాలి. ఉగ్రవాదాన్ని ఉపేక్షించడం తగదు. ఈ దారుణ పైశాచిక అకృత్యా లను అరికట్టాలి. అప్పుడే భారత దేశం లాంటి దేశాలు పురోగామి పథంలో పయనిస్తాయి. దావూద్ ఇబ్రహీం, మసూద్ అజహర్,బిన్ లాడెన్ లాంటి ఉగ్రవాదనాయకుల కర్కశ వ్యూహాలకు భారతదేశంలో ఎంతోమంది అమాయక ప్రజలు,సైనికులు తమ ప్రాణాలను కోల్పోయారు. బింద్రన్ వాలే చంపబడినా అతని ఉగ్ర ప్రేరణ సజీవమై ఇందిరాగాంధీని అంతమొందించింది. ప్రభాకరన్ వంటివారి దుశ్చర్యలకు రాజీవ్ గాంధీ లాంటి నాయకాగ్రగణ్యులు బలై పోయారు. ఎంతో మంది భారతీయ ముద్దుబిడ్డలు ఈ దేశ సమైక్యత కోసం బలిదానం గావించబడ్డారు. వారి రక్తతర్పణం వృథాగా పోలేదు. చనిపోయిన వీరుల త్యాగ ఫలం వలనే భారత దేశం సమైక్యంగా మనగలుగుతున్నది. భారత ప్రభుత్వం రాజీవ్ గాంధీ ప్రాణత్యాగం చేసిన మే 21 వ తేదీని ప్రతీ ఏటా 'జాతీయ ఉగ్రవాద వ్యతిరేక దినం' గా పాటిస్తూ ఉగ్రవాదంపై అలుపెరుగని పోరు సాగిస్తున్నది.

**- సుంకవల్లి సత్తిరాజు**
9704903463

## ఉండిపోవచ్చు కదా..!

నాలా నేను లేనప్పుడు
నీలో నన్ను దాచుకున్నావు
నీలో నేనున్నానని తెలిసేలోపు

నా కనుచూపుకు సైతం చిక్కకుండా
నా మదిని చిక్కుల్లో పెట్టేసావు
రోజంతా ప్రతి పనిలోనూ

నీ జ్ఞాపకాలే... గడియ గడియలో
నీ తలంపులే... పంచుకోలేను
తెంచుకొని బయటికి రాలేను

తప్పుకుందామంటే మనసొప్పుకోవడం లేదు
నిదురలోనూ నీ రూపు కానరాక
ఒకటే వెతుకులాట నీ మాట వినబడక
రావని తెలుసు వచ్చిందా నాపై విసుగు

వుండిపోవచ్చు కదా..! చితిలోనూ తోడొస్తా
ఊపిరాడనివ్వని నీ గురుతుల సాక్షిగా ...
ఊహకందని నీపై నాకున్న ప్రేమ సాక్షిగా..

**- వాసి జ్యోత్స్న**
9866843005

**ఎడిట్ పేజీ కోసం మీ సామాజిక విశ్లేషణలు, సాహిత్య వ్యాసాలు manamlekhalu@gmail.com మెయిల్ అడ్రస్‌కు పంపగలరు.**
**- ఎడిటర్**

## మద్దతు ఉండి ఏం లాభం

ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిలో భారత్ చేరిక ఊరిస్తోంది. భారత్ ప్రధాని మోదీ ఏ దేశ పర్యటనకు వెళ్ళినా భారత్ కు భద్రతా మండలిలో శాశ్వత సభ్య స్థానం ఉండాల్సిందే అని ఆయా దేశాలు నొక్కి చెప్పడం గమనార్హం. మోదీ ఇటీవల బ్రిక్స్ సమావేశానికి వెళ్ళినప్పుడు ఐక్యరాజ్య సమితిలో భారత్ కు శాశ్వత సభ్య స్థానం ప్రస్తావించారు. శాశ్వత స్థానం భారత్ పొందిన కొన్ని రాజకీయ కారణాల వల్ల కొన్ని దేశాలు అడ్డుపడుతున్నాయి అనేది నగ్న సత్యం. ముఖ్యంగా చైనా, పాక్ దేశాలకు భారత్ భద్రతా మండలిలో చేరడం సుతరాము ఇష్టం లేదు. పాక్, చైనా రాజకీయాల వలన భారత్ చేరిక ఉండటం లేదు. ఒక దశలో అమెరికా కూడా భారత్ చేరిక పై అసంతృప్తి వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయి.ఆసియా ఖండంలో భారత్ చేరితే చైనా 'ప్రభ'తగ్గుముఖం పట్టడం ఖాయం. ముందు పాక్ కు ఎట్టి పరిస్థితి లోను ఒప్పుకోదు. పాక్ భద్రతమండలిలో శాశ్వత సభ్య దేశం కాకున్నా భారత్ చేరికను చైనాతో లేక అమెరికాతో అడ్డుకునే ప్రయత్నాలు చేస్తుంది. భారత్ ను ధైర్యంగా ఎదుర్కొనే సాహసం చేయక శిఖరాగ్ర సమావేశాలలో భారత్ ను దోషిగా చూపెట్టి తను లాభ పడాలని చూసి భంగ పడినా తన వైఖరి మార్చుకోవడం లేదు.

భారత్ ప్రధాని సందర్శించి న పలు దేశాలలో భద్రతా మండలిలో భారత్‌కు మా మద్దతు ఉంటుందని చెప్పినా ప్రయోజనం శూన్యం. రష్యా, ఫ్రాన్స్ దేశాలు భారత్ కు మద్దతు తెలిపినా చైనా వీటో చేస్తుంది. అమెరికా బ్రిటన్ దేశాలు చైనా ఆ పని చేస్తుందని తెలిసి మౌనంగా ఉంటాయి. రాజకీయం అంటే అదే. విశ్వంలో భారత్‌కు ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిలో పాక్, చైనా తప్పితే దాదాపు ప్రతి దేశం భద్రతా మండలిలో స్థానం ఉండాల్సిందే అని చెప్పినా ఆ దిశలో చర్యలు లేవు. ఐక్యరాజ్య సమితి, భద్రతా మండలిలో అమెరికా పెత్త నం ఉంది. ఎందుకంటే సమితికి భారీ నిధులు ఒక్క అమెరికానుంచే అందుతున్నాయి. ఆరవ శాశ్వత సభ్య దేశం చేరాలంటే ముందు ఆయా దేశాల కున్న 'వీటో' పవర్ రద్దు చేయాలి. 'వీటో' పవర్ ఎట్టి పరిస్థితులలోనూ రద్దు కాదు. ఎన్నో సంస్కరణల తో అమెరికాను నడిపిస్తున్న ట్రంప్ భద్రతా మండలిలో ఆరో దేశంగా భారత్ ను చేర్చు కోవాలి. ఏ తీర్మానం చేయకనే అమెరికా, భారత్ ను ఆహ్వానించాలి. భారత్ తో పాటు జర్మనీ, దక్షిణ ఆఫ్రికా, బ్రెజిల్ మొదలగు దేశాలు కూడా ముందు వరుసలో ఉన్నాయి. ఒకవేళ భారత్ చేరకుండా మిగతా దేశాలు చేరితే మాత్రం భద్రతా మండలికి అంత హంగు ఉండదు. భారత్ చేరితేనే సమితికి కళ. భారత్ అతి త్వరలో భద్రతా మండలిలో శాశ్వత సభ్య దేశంగా చేరుతుందని ఆశిద్దాం.

**- కనుమ ఎల్లారెడ్డి**
93915 23027

## స్కూల్ సమావేశాల్లో ఇతరుల జోక్యం తగదు

జులై 10 తేదీన ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని అన్ని స్కూళ్ళలో జరుగబోవు మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ కొరకు లీప్ యాప్ నందు విట్నెస్ రిజిస్ట్రేషన్ అన్ని స్కూల్స్ నందు చేయాలని ప్రభుత్వం ఆదేశాలు ఇచ్చింది. విట్నెస్‌గా విద్యాశాఖలో పని చేస్తున్న ఉద్యోగులు కాకుండా వేరే ఏదో ఒక డిపార్ట్‌మెంట్‌కు చెందిన ప్రభుత్వ ఉద్యోగిని రిజిస్ట్రేషన్ చెయ్యాలని చెబుతున్నారు. ఈ విట్నెస్‌గా ఉన్న వ్యక్తి సమావేశం రోజున 30 సెకండ్ల వీడియో మరియు 4 ఫోటోలను అప్లోడ్ చెయ్యాల్సి ఉంటుంది. స్కూళ్ల నందు జరిగే తల్లి దండ్రుల ఉపాధ్యాయుల సమావేశాలలో స్కూళ్ళలో వేరే డిపార్ట్‌మెంట్ వారి జోక్యం తగదు. దీనికి స్కూళ్లలోని టీచర్లనే వాడాలి. దీన్ని పూర్తిగా ప్రభుత్వం విరమించుకోవాలి. ఇతర డిపార్ట్‌మెంట్ వారి జోక్యం లేకుండా సమావేశాలు నిర్వహించాలి.

**- వాసిలి సురేష్**
9494615360

# ఏది సత్యం? ఏదసత్యం!?



'జంగ్ ఔర్ మొహబ్బత్ మే సబ్ జాయజ్ హోతా హై' అనేది ఒక హిందీ సామెత. అంటే దీనర్థం యుద్ధం, ప్రేమలో ప్రతీది సమంజసమే. దీన్ని నరనరాన ఒంటబట్టించుకున్న ఇండియా, పాకిస్తాన్‌కు చెందిన మీడియా చానళ్లు.. యుద్ధ సమయంలో ఇష్టానుసారంగా వ్యవహరించాయి. సమాజం పట్ల తమకు సైతం ఒక నైతిక బాధ్యత ఉంటుందని మరిచి.. ఫేక్ న్యూస్‌ను ప్రసారం చేశాయి. సోషల్ మీడియాలోనూ జోరుగా అసత్య ప్రచారం వైరల్ అయింది. దీంతో ప్రజల్లో భయాందోళనలు, మానసిక ఒత్తిడి రెకెత్తింది. అయితే ఇండియాలో పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్, ఆల్ట్ న్యూస్, పాకిస్తాన్ లో మీడియా మ్యాటర్స్ ఫర్ డెమోక్రసీ వంటి సంస్థలు ఫ్యాక్ట్ చెక్ చేసి అనేక అసత్య ప్రచారాలను ప్రజల ముందుకు తెచ్చాయి. ఆ తర్వాత కొన్ని చానళ్లు క్షమాపణలు కోరినా.. అప్పటికే జరగాల్సిన నష్టం జరిగిపోయింది. రెండు దేశాల మీడియా చానళ్లపై ప్రపంచవ్యాప్తంగా విశ్వసనీయత తగ్గిపోయింది. మరోవైపు ఆయా దేశాల ప్రజలకు మీడియా వ్యవహరిస్తున్న తీరు తెలిసొచ్చింది.

భారత్, పాకిస్తాన్ కు చెందిన న్యూస్ చానళ్లు, సోషల్ మీడియా అకౌంట్లు యుద్ధ సమయంలో చేసిన అనేక క్లెయిమ్స్ ఫేక్ అని ఆ తర్వాత నిర్ధారించబడ్డాయి. భారత రాఫెల్ యుద్ధ విమానం బహవల్పూర్ సమీపంలో కూల్చివేశారని, భారత సైనిక స్థావరంపై దాడి జరిగిందని పాకిస్తాన్ కు చెందిన కొన్ని చానళ్లు, సోషల్ మీడియా ఖాతాలు క్లెయిమ్ చేశాయి. అయితే ఆ వీడియోలు, చిత్రాలు 2021లో పంజాబ్లో జరిగిన మిగ్-21 క్రాష్, 2024లో మహారాష్ట్రలో సుఖోయ్-30 క్రాష్కు సంబంధించినవిగా తేలింది. పాకిస్తాన్లోని నన్కానా సాహిబ్ గురుద్వారాపై డ్రోన్ దాడి జరిగిందని జరిగిన ప్రచారాన్ని సైతం పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఖండించింది. 2020లో లెబనాన్లోని బీరుట్ పేలుడు ఫుటేజీని భారత్పై మిస్సైల్ దాడిగా పాకిస్తాన్ మీడియా చిత్రీకరించింది. మరోవైపు కరాచీ పోర్టుపై భారత నావికాదళం దాడి చేసిందని ఆజ్ తక్ చానల్ తప్పుడు వార్తను ప్రసారం చేసింది. ఆ తర్వాత అది ఫేక్ అని తేలింది. రెండు జేఎఫ్-17 జెట్ లు కోల్పోయామని పాకిస్తాన్ సైనిక అధికారి ఒప్పుకున్నట్లు ఒక ఏఐ జనరేటెడ్ డీప్ ఫేక్ వీడియోను ఒకరు పోస్టు చేయగా, దాన్ని ఏడు లక్షల సార్లు షేర్ చేశారు. అయితే ఆ తర్వాత అది నకిలీదని గుర్తించారు. అంతేకాకుండా ఇస్లామాబాద్ ను భారత సైన్యం స్వాధీనం చేసుకున్నదని, పాకిస్తాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్ బంకర్ లో దాక్కున్నారని, భారత్ కు లొంగిపోయారని, పాకిస్తాన్ ఆర్మీ చీఫ్ ఆసీం మునీర్ రాజీనామా చేశారని, ఆయనను అరెస్ట్ చేశారని, పాకిస్తాన్ సైనికులను భారత్ ఖైదీలుగా చేసుకున్నదని ఇండియన్ మీడియా ఊదరగొట్టింది. అయితే ఇవన్నీ అసత్యాలేనని తర్వాత తేలింది. తప్పుడు, అసత్య ప్రచారాలను ప్రజల ముందుకు తేవడానికి ఫ్యాక్ట్ చెకింగ్ తప్పనిసరిగా మారింది. ఆపరేషన్ సిందూర్ తర్వాత.. భారత ఎస్ 400 ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్ ధ్వంసమైందని, భారత పైలట్ శివానీ సింగ్ను పాకిస్తాన్ అదుపులోకి తీసుకున్నదని, ఇలాంటి 60కి పైగా జరిగిన అసత్య క్లెయిమ్ లను పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ ఖండించి వాస్తవాలను ప్రజల ముందుంచింది. పాకిస్తానీ జర్నలిస్టులు పాత ఘటనలను సంబంధించిన చిత్రాలను షేర్ చేస్తున్నట్లు ఆల్ట్ న్యూస్ సహ-స్థాపకుడు ప్రతీక్ సిన్హా గుర్తించి ప్రజల ముందుకు తెచ్చారు. పాకిస్తాన్లోని మీడియా మ్యాటర్స్ ఫర్ డెమోక్రసీ సంస్థ అక్కడి స్థానిక మీడియా సంస్థలు తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నారని గుర్తించి రివర్స్ ఇమేజ్ సెర్చ్ ద్వారా ఫ్యాక్ట్ చెక్ చేసి వాస్తవాలను ప్రజల ముందుకు తెచ్చింది.

ఇండియాకు చెందిన కొన్ని న్యూస్ చానల్స్ లైవ్ రిపోర్టింగ్ చేస్తున్నట్లు నటించాయి. ఫలానా చోటి నుంచి సైనికులు బయలుదేరారని, ఎయిర్ క్రాఫ్ట్ లు బయలుదేరాయని చెప్పాయి. దీని ద్వారా జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లే ప్రమాదం ఏర్పడింది. మరోవైపు భారత్లో 70% విద్యుత్ గ్రిడ్ సైబర్ దాడి వల్ల కుప్పకూలిందని, పాకిస్తాన్ మిస్సైల్ దాడులు చేసిందని వంటి కొన్ని




తప్పుడు క్లెయిమ్ లు ప్రజల్లో భయాందోళనలను రేకెత్తించాయి. అసత్య సమాచారం వల్ల ప్రజల్లో ఆందోళన, భయం, ఒత్తిడి పెరిగింది. నన్కానా సాహిబ్ గురుద్వారాపై భారత్ డ్రోన్ దాడి చేసిందని పాకిస్తానీ ఖాతాలు చేసిన తప్పుడు క్లెయిమ్స్ తో భారత్లో సిక్కు సమాజంలో కల్లోలాన్ని రేకెత్తించే ఉద్దేశ్యంతో ఉందని పీఐబీ ఫ్యాక్ట్ చెక్ యూనిట్ గుర్తించింది. అయితే తప్పుడు క్లెయిమ్స్ ఆయా దేశాల మీడియా ఖ్యాతిని అంతర్జాతీయంగా దెబ్బతీశాయి. మీడియా సంస్థలు విశ్వాసాన్ని కోల్పోయాయి. ప్రస్తుత ఏఐ, డిజిటల్ యుగంలో న్యూస్ చానల్స్, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారాన్ని మొదటిసారే విశ్వసించకుండా క్రాస్ చెక్ చేసుకోవడం మంచిది. ఇలాంటి ప్రచారాలు జరగకుండా సోషల్ మీడియా ప్లాట్ ఫామ్స్ సైతం తమ అల్గారిథమ్ లో మార్పులు చేయాల్సిన అవసరముంది. న్యూస్ చానల్స్ కూడా బాధ్యతగా వ్యవహరించి వాస్తవాలను మాత్రమే ప్రసారం చేయాలి.

పాకిస్తాన్లోని కిరానా హిల్స్ వద్ద ఉన్న అణు స్థావరాలపై భారత్ దాడి చేసిందని, దీని వల్ల న్యూక్లియర్ రేడియేషన్ లీక్ అవుతోందని ఒక పత్రం సోషల్ మీడియాలో తెగ వైరల్ అయింది. పాకిస్తాన్ ప్రభుత్వం ప్రకటిస్తున్నట్లు ఏఐ ద్వారా ఈ పత్రాన్ని క్రియేట్ చేశారు. స్థానిక ప్రజలు వాంతులు, తలనొప్పి, వికారం వంటి లక్షణాలతో బాధపడుతున్నారని, ఇది రేడియేషన్ లీక్కు సంకేతమని అందులో పేర్కొన్నారు. భారత సైనిక దాడులు సర్గోధా, నూర్ ఖాన్ ఎయిర్బేస్లను లక్ష్యంగా చేసుకున్నాయని, కిరానా హిల్స్ సమీపంలో జరిగిన దాడుల వల్ల రేడియేషన్ లీక్ జరిగిందని ఇందులో పేర్కొన్నారు. దీన్ని 'ఎక్స్'లో కొన్ని లక్షల సార్లు షేర్ చేశారు. దీంతో పాకిస్తాన్ తోపాటు ప్రపంచవ్యాప్తంగా ఆందోళన నెలకొన్నది. ఒక సందర్భంలో ఇది భారత్-పాకిస్తాన్ మధ్య అణు యుద్ధ భయాన్ని సైతం రేకెత్తించింది. అయితే ఇది నకిలీదని ఇంటర్నేషనల్ అటామిక్ ఎనర్జీ ఏజెన్సీ స్పష్టం చేసింది. పాకిస్తాన్లో ఎటువంటి న్యూక్లియర్ రేడియేషన్ లీక్ కాలేదని చెప్పింది. ఈ పత్రంలో అనేక తప్పులు ఉన్నాయని పేర్కొంది. భారత్ చర్యలు సంప్రదాయ ఆయుధాల పరిధిలోనే ఉన్నాయని, అణు స్థావరాలను లక్ష్యంగా చేసుకోలేదని భారత విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి రణధీర్ జైస్వాల్ కూడా స్పష్టం చేశారు.

**- ఫిరోజ్ ఖాన్**
9640466464

## ఇంటి దొంగలు

తల్లి పాలు తాగి
రొమ్ము గుద్దే తనయులు
హక్కుల దారి వెంట వస్తు
దారిని మూసే దరిద్రులు
తిన్నంటి వాసాలు
లెక్కపెట్టే మోసగాళ్లు
సహాయం చేసే చేతులను
నరికే నరరూప రాక్షసులు
కని పెంచిన వాళ్లను సహితం
కనికరించని కఠినాత్ములు
పేగు బంధాలను
పట్టించుకోని పాపాత్ములు
అధికారం కోసం, ఆస్తుల కోసం
అన్నదమ్ములను, తల్లిదండ్రులను
అమానవీయంగా హతమార్చంచే
దగా కోరు ఇంటి దొంగలు
పురాణాల్లో వెతికిన
ప్రస్తుత సమాజంలో చూసిన
ఎక్కడ చూసిన అక్కడ వీరే
ఈశ్వరుడైన వీరిని గుర్తించలేరు

**- నెరువట్ల చైతన్య**
9491470746

## నీ హృదయానికి..

పుట్టుకతో వచ్చే లక్షణాలు
క్రమంగా అలవాట్లుగా
గుణాలుగా మారుతాయి ఆ గుణాలు
నలుగురు ఆచరించేలా ఉండాలి
స్ఫూర్తి పెంచేలా ఉండాలి
చెడు గుణాల్ని త్యజించి
మంచి కర్మలని చేసిన రోజే

ఓ మనిషి పరిణతి చెందుతాడు
ఓ మనిషి పరిగణలోకి వస్తాడు
ఏది సరైనదో నీ హృదయానికి
తప్పక తెలుస్తుంది.. తప్పని తెలిసినా
తప్పదని నువ్వు చెయొద్దు
ఆ ఈశ్వరుడిని
వదులుకోవద్దు

**- కోటం త్రిశూల్**
8523005678

## ఉగ్రవాదానికి సామాజిక పరిష్కారం



రాజకీయ, మతపరమైన లేదా సైద్ధాంతిక లక్ష్యాల కోసం జనాభాను లేదా ప్రభుత్వాన్ని బెదిరించ డానికి హింసను సృష్టించడం ఉగ్రవాదంగా పే ర్కొంటారు. ఉగ్రవాదం దేశ భద్రతకు సవాల్ విసుర తోంది. ప్రజల ఆర్థిక, సమాజిక జీవనాన్ని దెబ్బతీస్తుంది. దేశ ఆర్థిక వ్యవస్థకు కూడా నష్టం. దేశాభివృద్ధికి విఘాతంగా మారుతుంది. మే 21, 1991లో తమిళనాడులోని శ్రీ పెరంబుదూర్ లో జాతీయ ఎన్నికలకు పార్టీ అధ్యక్షుడిగా కాంగ్రెస్ పార్టీ ప్రచార సభలో రాజీవ్‌గాంధీ ప్రసంగిస్తున్నప్పుడు ఉగ్రవాదుల చేతుల్లో హత్యకు గురైయ్యారు. ఆ తర్వాత భారత ప్రభు త్వం ఇటువంటి సంఘటనలు జరగకూడదనే ఉద్దేశ్యంతో ఈ రోజును జాతీయ ఉగ్రవాద వ్యతి రేక దినోత్సవంగా ప్రకటించింది. ఇది భారతదేశ మాజీ ప్రధానమంత్రి స్వర్గీయ రాజీవ్ గాంధీ వర్ధంతి రోజు అని చెప్పవచ్చు. మానవత్వం, కోసం పాటుపడేలా ప్రజలలో ఐక్యతను పెంపొందించడం కోసం ఈ దినోత్సవాన్ని జరుపు కుంటారు. ప్రపంచ శాంతి కోసం అహింస సందే శాన్ని ప్రజలకు అవగతమ య్యేలా చేయడం, యువత పెడదోవ పట్టకుండా చేయడం వంటివి ఈ దినోత్సవం ముఖ్యోద్దేశాలు. ఈ రోజున ఉగ్ర వాద వ్యతిరేకంగా పోరాడిన వేలాది మంది సైనికులు చేసిన త్యాగాలను గుర్తుచేసుకోవడమే కాక వారికి నివాళుల అర్పిస్తారు. మానవత్వం మరియు శాంతి సందేశాన్ని ప్రచారం చేయడం జరుగు తుంది.

భారత దేశంలో ఉగ్రవాదం ప్రదానంగా బోర్డర్ నుంచి పొంచి ఉంది. ఇది దేశవ్యాప్తంగా కూడా విస్తరించే ప్రమాదం ఉంది. మన దేశసరిహద్దు దేశాలకు మధ్య ఉన్న రాష్ట్రాలకు నిరంతరం వలసలు రావడం వలన ఉగ్రవాద ప్రమాదం ఉంటుంది. ముఖ్యంగా చైనా, పాకిస్తాన్ సరిహద్దు రాష్ట్రాలతో మనకు ప్రమాదం ఉంది. ఇటివల జమ్మూ కాశ్మీర్ లోని పహల్గామి ప్రాంతంలో జరిగిన ఉగ్రదాడిలో 28 అమాయక భారతీయులు ప్రాణాలు కోల్పోయారు. ఉగ్రవాద ముప్పు తొలగిపోయిందన్న నేపథ్యంలో ఈ దాడి జరగడం మరొకసారి భారతదేశాన్ని భయోందోళనలకు గురిచేసింది. దీనికి భారతదేశం ఆపరేషన్ సింధూర్ పేరుతో ప్రతిదాడి చేసింది. ఇప్పటికే భారత దేశంపై పలు మార్లు ఉగ్రదాడి జరిగింది. చాలా ప్రాణ, ఆస్తి నష్టం జరిగింది. కానీ గత కొంతకాలం నుంచి భారత్ వివిధ దేశాలతో కొన సాగిస్తున్న దౌత్య సంబంధాల నేపథ్యంలో ఉగ్ర దాడి తగ్గిన సంగతి తెలిసింది. మరోవైపు భారతదేశంలో వేల సంవత్సరాల నుంచి చాప కింద నీరులా కొనసాగుతున్న సామాజిక వివక్షత వలన అంతర్గత సంఘర్షణను పెరుగుతున్నాయి. కులం పేరుతో విభజించి అవకాశాలు అందకుండా చేయడం కూడా ఉగ్రవాదమే. ముఖ్యంగా రాజకీయ, సామాజిక, ఆర్థిక అవకాశాలు కొన్ని వర్గాల వారికే అందడం వలన సమాజంలో అంతర్గత కలహాలు పెరిగిపోతాయి. దీంతో గతంలో వామపక్ష తీవ్రవాదం తీవ్రంగా పెరిగిపోయింది. ఇప్పటికీ అక్కడక్కడ కొనసాగుతుంది. దీనికి ప్రధాన కారణాన్ని అన్వేషించి పరిష్కరించాల్సిన అవసరం ప్రభుత్వాలపైన ఉన్నాయి. కానీ ఇటీవల చత్తీస్ ఘడ్ రాష్ట్రంలోని కర్రెగుట్టల వద్ద ఆపరేషన్ కగారు పేరుతో అణచివేయడం వలన వామపక్ష తీవ్రవాదం అంతం కాదు. అనేక ప్రజా సంఘాల సైతం దీన్ని వ్యతిరేకిస్తున్నాయి. అతిపెద్ద జనాభా గల భారతదేశంలో అంతర్గత మరియు బహిర్గత ఉగ్రవాదం అత్యంత ప్రమాదకరం. దీన్ని నిలువరించాలంటే ప్రపంచ దేశాలతో స్నేహపూరిక దౌత్యసంబంధాలను పెంపొందించుకోవాలి. సరిహద్దు దేశాలతో ఉన్న బార్డర్ సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించు కోవాలి. ఉగ్రవాదం అంతం చేయడానికి ఆధునిక సాంకేతికను వాడాలి. ఉగ్రవాదాన్ని పెంచి పోషిస్తున్న దేశాలపై నిఘా పెట్టాలి. భారతదేశంలో అంతర్గతంగా అశాంతి కూడా ఉగ్రవాదానికి ఆజ్యం పోస్తుంది. ముఖ్యంగా మతోన్మాదాన్ని నివారించాలి. కులం పేరుతో కొనసాగుతున్న అణచివేతను తగ్గించాలి. అన్ని రంగాలలో బడుగు, బలహీన వర్గాల ప్రజలకు అవకాశాలు కల్పించాలి. ఉగ్రవాదం అంటే తుపాకీలతో కాల్చాడం. బాంబులను పేల్చాడం ఉగ్రవాదం కాదు, ప్రజలను కులాలుగా, మతాలుగా విభజించడం కూడా అతి భయంకరమైన ఉగ్రవాదమే అని గుర్తెరిగి నడుచుకోవాలి.

**- సంపతి రమేష్ మహారాజ్**
7989579428

# ప్రజావాణి దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల జులై 7 (మనం ప్రతినిధి)ః ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్ రావు, హరికృష్ణ లతో కలిసి అర్జీదారుల నుండి దరఖాస్తులు స్వీకరించారు. నెన్నెల మండలం గుండ్లసోమారం గ్రామానికి చెందిన జాడి తిరుపతి తమ తాతల నుండి కాస్తులో ఉన్న తమ భూమిని అటవీశాఖ వారు తమ భూమి అంటూ అడ్డుకుంటున్నారని, ఈ విషయమై విచారించి తమకు పూర్తి హక్కు కల్పించి ఆదుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. సింగాపూర్, గుత్తదారిపల్లి, ఆర్ ఆర్ కాలనీ-1 అభివృద్ధి కమిటీ ప్రతినిధులు సమ్మయ్య తమ దరఖాస్తులో తమ కాలనీలో గోదావరి నీరు అందించాలని, మురుగు కాలువల వ్యవస్థ, కమానా బోర్డులు, అంగన్వాడీ కేంద్రం, బోర్వెల్స్, వీధిదీపాలు ఏర్పాటు చేయాలని, కాలనీలోని సమస్యలను పరిష్కరించాలని కోరారు. చెన్నూర్ మండలం బుద్దారం అంగన్వాడీ టీచర్ తగరం సునంధ తాను పని చేస్తున్న అంగన్వాడీ కేంద్రానికి భవనం లేదని, అసంపూర్తిగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించడం జరుగుతుందని, ఈ కేంద్రం ద్వారా 20 మంది పిల్లలు, 4గురు తల్లులు సేవలు పొందుతున్నారని, ఈ కేంద్రానికి స్వంత భవనం ఏర్పాటు చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి మండలం మాలగురిజాల గ్రామానికి చెందిన జి. అశోక్ తమ గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు అదనపు తరగతి గది, వంటశాల, ఒక తరగతికి మరమ్మత్తులకు సంబంధించిన పనులు మంజూరు చేయాలని కోరుతూ అర్జీ సమర్పించారు. లక్షెట్టిపేట మండలం వెంకట్రావుపేట గ్రామానికి చెందిన తోట సతవ్వ తన మామయ్య నుండి తమకు రావలసిన వాటా భూమితో పాటు తన స్వంత భూమిలోకి రాకుండా అడ్డుకుంటున్నారని, ఈ విషయమై విచారించి తనకు న్యాయం చేయాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. బెల్లంపల్లి కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి కొలిపాక శ్రీనివాస్ బెల్లంపల్లి పట్టణంలోని ప్రభుత్వ భూములు, సింగరేణి క్వార్టర్లు, షాపులు కబ్జాకు గురయ్యాయని, మున్సిపల్ పరిధిలోని వార్డులలో రహదారులు మూసివేసి ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారని, ఈ మేరకు బెల్లంపల్లిలో హైడ్రా తరహా కార్యాలయం ఏర్పాటు చేసి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ అర్జీ సమర్పించారు. బెల్లంపల్లి పట్టణానికి చెందిన సింగిరెడ్డి లావణ్యరెడ్డి తాము కిరాయికి ఉంటున్నామని, తమకు సొంత ఇంటి స్థలం ఉందని, ఇందిరమ్మ ఇండ్ల పథకం వర్తింపజేసి ఆర్థిక సహాయం అందించాలని కోరుతూ దరఖాస్తు అందజేశారు. లక్షెట్టిపేట మండలం మోదెల గ్రామానికి చెందిన దమ్మ సూర్య తనకు వృద్ధాప్య ఫించన్ ఇప్పించాలని కోరుతూ అర్జీ సమర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణి కార్యక్రమంలో 35 దరఖాస్తులు అందాయని, ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించే విధంగా అధికారుల సమన్వయంతో చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మేడిపల్లి భీమారంలను ఆదర్శంగా తీర్చిదిద్దుతా

### పెండింగ్ పనులను స్వతరమే పూర్తి చేయండి

### కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్



జగిత్యాల, జూలై 7 ( మనం ప్రతినిధి)ః జిల్లాలోని మేడిపల్లి , భీమారం మండలం లో అభివృద్ధిలో భాగంగా ఆదర్శంగా తీర్చిదిద్దుతాం . పెండింగ్ పనులను సత్వరమే పూర్తి చేయాలని అధికారులతో కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. జిల్లా కలెక్టర్ బి సత్యప్రసాద్. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రికి బండి సంజయ్ కుమార్ పూల మొక్క ఇచ్చి స్వాగతం పలికారు. సోమవారం జిల్లాలోని మేడిపల్లి భీమారం మండలం లో ,ఈజీఎస్, ఎంపీ ల్యాడ్స్ నిధులతో మంజూరైన పలు అభివృద్ధి లో భాగంగా సీసీ రోడ్డు నిర్మాణానికి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ , జిల్లా కలెక్టర్ సత్య ప్రసాద్ తో కలిసి శంకుస్థాపన చేశారు. అనంతరం కల్వకోట గ్రామంలో ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పథకం లో భాగంగా దమ్మన్నపేట నుండి కాచారం వరకు నిర్మిస్తున్న రోడ్డు విస్తరణ పనులను ప్రారంభించారు. వెంకట్రావు పేట గ్రామంలోని పీఎం శ్రీ పథకం కింద ఎంపికైన ప్రభుత్వ పాఠశాలను సందర్శించి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, మాట్లాడుతూ, గ్రామాల అభివృద్ధి పట్టుకొమ్మలని దానిలో భాగంగా ప్రధానమంత్రి సడక్ యోజన ద్వారా ఎంపీ నిధుల ద్వారా సీసీ రోడ్స్ లకు నిధులు మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో, కోరుట్ల రెవెన్యూ డివిజన్ అధికారి , ఈ పి ఆర్ ఇంజనీరింగ్ అధికారి లక్ష్మణరావు, తహసిల్దారులు ఎంపిడిఓలు సంబంధిత,అధికారులు తదితరులు, పాల్గొన్నారు.

## జూలై 9 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు




- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, జూలై 07 (మనం ప్రతినిధి)ః రానున్న 3 రోజుల పాటు పెద్దపల్లి జిల్లాలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో కోరారు. వాతావరణ శాఖ సూచనల ప్రకారం బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం కారణంగా పెద్దపల్లి జిల్లాలో జూలై 7 నుంచి జూలై 9 వరకు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అన్నారు. భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు. నీటి వనరులలో నీటి నిల్వలను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని, ఎక్కడ ఎటువంటి ప్రమాదాలు జర్గకుండా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు.

## నిర్దిష్ట గడువులోగా అభివృద్ధి పనులను పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, జూలై 07 (మనం ప్రతినిధి)ః జిల్లాలో చేపట్టిన పలు అభివృద్ధి పనులను నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో రోడ్లు భవనాల శాఖ, టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి ద్వారా చేపట్టిన అభివృద్ధి పనులు పై సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పెద్దపెల్లి జిల్లాలో డిఎంఎఫ్టి, ఇతర నిధుల నుంచి రోడ్లు భవనాలు ,శాఖ ద్వారా చేపట్టిన బ్రిడ్జి, రోడ్లు, ఆసుపత్రి , పాఠశాల భవనాలు , ఇతర అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేయాలని, నిర్దిష్ట గడువులోగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకొని రావాలని కలెక్టర్ ఆదేశించారు. టి.జి.ఈ.డబ్ల్యూ.ఐ.డి.సి ద్వారా జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చేపట్టిన 102 అభివృద్ధి పనులను సమీక్షించిన కలెక్టర్ వీటిని త్వరగా పూర్తి చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సమావేశంలో ఈఈ ఆర్బీ భావ్ సింగ్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## ప్రజావాణి అర్జీలు సకాలంలో పరిష్కరించాలి



- కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

రాజన్న సిరిసిల్ల, జూలై 7 ( మనం ప్రతినిధి)ః ప్రజావాణిలో వచ్చే అర్జీలను సకాలంలో పరిష్కరించాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా 151 దరఖాస్తులు కలెక్టర్ స్వీకరించి.. వాటిని పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు. రెవెన్యూ శాఖకు 48, హౌసింగ్ కు 36, డీ ఆర్ డి ఓ కు 23, డీ పీ ఓ కు 10, జిల్లా విద్యాధికారికి 8, జిల్లా ఉపాధి కల్పనాధికారికి 5, సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్, జిల్లా సంక్షేమ అధికారికి మూడు చొప్పున, ఎస్ డీ సీ కి 2, ఎస్పీ, హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్‌టైల్స్, ఈ ఈ ఇరిగేషన్, ఎండి సెస్, ఎల్ డి ఎం, ఈ ఈ పి ఆర్, ఈఓ ఎస్ ఆర్ ఆర్ టెంపుల్ వేములవాడ, జిల్లా పౌరసరఫరాల అధికారి, మున్సిపల్ కమిషనర్ వేములవాడ, ఏడీ ఎస్ ఎల్ ఆర్, జిల్లా వైద్యాధికారి, ఈ డీ ఎస్సీ కార్పొరేషన్, ఈ డీ ఎం కు ఒకటి చొప్పున దరఖాస్తులు వచ్చాయి.కార్యక్రమంలో జడ్పీ సీఈవో వినోద్ కుమార్, డీఆర్డీఓ శేషాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇవ్వాలి




- జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత

జగిత్యాల, జూలై 7( మనం ప్రతినిధి)ః ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే దరఖాస్తులకు అధిక ప్రాధాన్యత ఇచ్చి క్షేత్ర స్థాయిలో పరిశీలించి వెంటవెంటనే పరిష్కరించాలని జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుండి పిర్యాదులు, వినతులను జిల్లా అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ కలెక్టర్ బి ఎస్ లత మాట్లాడుతూ సమస్యల పరిష్కారం కోరుతూ జిల్లా కేంద్రంతో పాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి ప్రజలు ఎన్నో వ్యయ ప్రయాసలకు ఓర్చి వస్తారని, అధికారులు వారి శాఖల వారిగా స్వీకరించిన ఫిర్యాదులపై సానుకూలంగా వ్యవహరించడంతో పాటు సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. అర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. కాగా ప్రజావాణి కార్యక్రమానికి మొత్తం 39 పిర్యాదులు, వినతులు వచ్చాయని, వాటిని వెంటనే సంబంధిత అధికారులను పరిష్కరించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల రెవెన్యూ డివిషనల్ అధికారి మధుసూదన్, మెట్పల్లి రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస్,వివిధ జిల్లా అధికారులు, తహసీల్దర్లు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 15 లోపు ఎస్సీ, ఎస్టీ, విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నమోదు చేసుకోవాలి



- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

పెద్దపల్లి, జూలై 07 (మనం ప్రతినిధి)ః జూలై 15 లోపు ఎస్సీ ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుల నమోదుకు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాస్థాయి విజిలెన్స్ కమిటీ, మానిటరింగ్ కమిటీ ఎస్సి ఎస్టీ పిసిఆర్/పిఓఎ యాక్ట్ 1989 పెద్దపెల్లి జిల్లా నందు క్యాటగిరి ఎఫ్ నందు 5 అనధికార సభ్యుల ఎస్సీ ఎస్టీ చెందిన వారు సభ్యత్వం కొరకు, క్యాటగిరి జి నందు ముగ్గురు నాన్ అఫీషియల్ సభ్యులు స్వచ్ఛంద సేవ సంస్థలతో సంబంధాన్ని కలిగి ఉన్న ఎస్సీ ఎస్టీలు కాకుండా ఉన్న జిల్లా పెద్దపెల్లి జిల్లాకు చెందిన వారి నుంచి దరఖాస్తులు కోరుతున్నామని అన్నారు. ఆసక్తిగల ఎస్సీ ఎస్టీ చెందిన అభ్యర్థులు సేవా కార్యక్రమాలతో కూడిన ఆధారాలు పేపర్ క్లిప్పింగ్ లు, ఫోటోలు స్వచ్ఛంద సేవ సంస్థలకు చేసిన సేవలతో కూడిన ఆధారాలతో జులై 15 సాయంత్రం 5 గంటలకు జిల్లా షెడ్యూల్ కులంలో అభివృద్ధి అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని, ఈ కమిటీ నందు ఎన్నికైన సభ్యులకు ఎలాంటి పారితోషకాలు ఉండవని కలెక్టర్ పేర్కొన్నారు.

## కాటమయ్య రక్షా కిట్ల ద్వారా ప్రమాదాల నివారణ

జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్



మంచిర్యాల, జులై 7 (మనం ప్రతినిధి)ః గీత కార్మికుల సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం అందిస్తున్న కాటమయ్య రక్షా కిట్ల ద్వారా 80శాతం వరకు ప్రమాదాలను నివారించవచ్చని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. సోమవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా అటవీ అధికారి శివ్ ఆశిష్ సింగ్, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు శ్రీనివాస్రావు, హరికృష్ణ, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి ఎ.పురుషోత్తం లతో కలిసి గౌడ కులస్తులకు కాటమయ్య రక్షా కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం గౌడ కులస్తుల సంక్షేమంలో భాగంగా కాటమయ్య రక్షా కిట్లను పంపిణీ చేస్తుందని తెలిపారు. కాటమయ్య రక్షా కిట్ల ద్వారా 80 శాతం వరకు ప్రమాదాలు తగ్గాయని, కాటమయ్య రక్షా కిట్లపై శిక్షణ పూర్తి చేసుకొని అర్హత పొంది 19 మంది గౌడ కులస్తులకు కిట్లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. గౌడ కులస్తులు కాటమయ్య రక్షా కిట్లను సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆబ్కారీ-మద్యనిషేధ శాఖ సి.ఐ. సమ్మయ్య, వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ అధికారి సురేష్, నరేష్, శ్రీధర్ సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అర్జీల పరిష్కారం సత్వరమే పూర్తి చేయాలి

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



పెద్దపల్లి, జూలై 07 (మనం ప్రతినిధి)ః అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో అదనపు కలెక్టర్ డి.వేణు తో కలిసి ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. సుల్తానాబాద్ మండలం, కొదురుపాక గ్రామానికి చెందిన మచ్చ రాములు సర్వే నెంబర్ 803 ఏ లో 11 గుంటల భూమి, సర్వే నెంబర్ 815 ఏదో 3 గుంటలో భూమి గల్లంతు అయిందని, భూ భారతిలో సర్వే చేయించి న్యాయపరంగా కొత్త పాస్ పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.రామగుండం మండలం 8 ఇంక్లైన్ కాలనీ కు చెందిన కోండా రాజమ్మ సింగరేణి భూసేకరణ క్రింద తీసుకున్న నాలుగు గంటల భూమి లో 2 గుంటల కు మాత్రమే పరిహారం అందించారని, మరో 2 గుంటల భూమికి పరిహారం ఇప్పించాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా తహసిల్దార్‌కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కొత్తపల్లి ప్రాథమిక విద్యాలయాల సందర్శన

- రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ కటారి రేవతి



పెద్దపల్లి, జూలై 07 (మనం ప్రతినిధి)ః పెద్దపల్లి మండలం కొత్తపల్లి గ్రామంలో గల ప్రాథమిక విద్యాసంస్థలను తనిఖీ, పాఠశాలల ఆవరణలో గల వంటశాల వంటలు తరగతి గదులను పరిశీలించారు. రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ కటారి రేవతి.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులను చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల లలో విద్యా కమిటీ చైర్ పర్సన్ సబ్బు రాజ కుమారి సతీష్ అధ్యక్షతన పలు అభివృద్ధి పనులు జరగడం సంతోషకరమన్నారు. రాజకుమారి సతీష్ ల ప్రోద్భలం తోనే ఈ కొత్త పల్లి ప్రాథమిక విద్యాసంస్థల సందర్శనకు రావడం జరిగిందని ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు వారి విధి నిర్వహణలో చక్కటి ప్రతిభను కనబరుస్తూ విద్యార్థినీ విద్యార్థులకు చక్కటి క్రమశిక్షణతో పాటు విద్యను బోధించడం పట్ల సంతృప్తిని వ్యక్తం చేస్తూ గురువులను ప్రశంసించారు. చైర్ పర్సన్ రాజకుమారి సతీష్ అభ్యర్థన మేరకు పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి అధికారులతో మాట్లాడి సహకారం అందిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

### పేరెంట్ కమిటీ విన్నపం

ఇతర గ్రామాల నుండి వచ్చు విద్యార్థిని విద్యార్థులు ప్రభుత్వం రవాణా సౌకర్యాన్ని ఏర్పాటు చేస్తున్నారు. కానీ గ్రామ పరిధిలో గల తెనుగువాడ ఎస్సీ కాలనీకి చెందిన విద్యార్థిని విద్యార్థులకు రవాణా సౌకర్యం కల్పించడం లేదు దక్షిణ మధ్య రైల్వే వారు గేటు మూసివేయకముందు ఈ రహదారి ద్వారా విద్యార్థినీ విద్యార్థులు పాఠశాలలకు చేరుకునేవారు. కానీ ఇటీవల దక్షిణ మధ్య రైల్వే వారి ఉత్తర్వులు మేరకు ఆ గేటు మూసివేయడం ద్వారా రైల్వే వారి అండర్ బ్రిడ్జి కిందుగా పాఠశాలకు చేరుకునేసరికి సుమారుగా మూడు నాలుగు కిలోమీటర్ల దూరాన్ని భరించవలసి వస్తున్నది. దీనివలన తమ పిల్లలను పాఠశాలలో చేర్చడానికి పాఠశాల వదిలిపెట్టిన తర్వాత ఇంటికి తీసుకొని వచ్చు డానికి చాలా కష్టంగా ఉందని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో రవాణా సౌకర్యం ఉన్న ప్రైవేటు విద్యాసంస్థలలో చేర్పించాలనుకుంటున్నారు ఇదే జరిగినట్టయితే ఈ పాఠశాలలో సగానికి పైగా విద్యార్థిని విద్యార్థులు తగ్గుతారని చైర్ పర్సన్ రాజకుమారి సతీష్ ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. కలెక్టర్ కి మీ ద్వారాఈసమస్యనుతెలియజేయవలసిందిగా కోరుతూ రాష్ట్ర మహిళా కమిషన్ మెంబర్ కటారి రేవతి కు పేరెంట్ కమిటీ వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు విద్యార్థినీ విద్యార్థులు ఉపాధ్యాయ ఉపాధ్యాయనియులు యువ నాయకులు బాలసాని క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ కీర్తి విశ్వవ్యాప్తం కావాలి

- క్రీడల్లో హుస్నాబాద్‌కి మంచి పేరు తేవాలి
- స్పోర్ట్స్ పాలసీ ప్రకటించుకున్నం
- నలుగురు డి.ఎస్.పి.పోస్టులు కొట్టాలి
- దేశానికి ఒక్క ఒలింపిక్ మెడల్ రాలేదు
- పొన్నం అన్న అడుగుడెంది..నేను ఇవ్వకపోవుడెంది
- హుస్నాబాద్‌కు స్విమ్మింగ్ పూల్
- క్రీడలు, యువజన సర్వీసులు, డైరీ, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి
- క్రీడారంగంలో ''హుస్నాబాద్'' ను నెం.1 స్థానంలో నిలుపుతా
- రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్





**హుస్నాబాద్, జూలై 7(మనం న్యూస్):** గత ఒలింపిక్స్‌లో దేశానికి ఒక్క మెడల్ కూడా రాలేదని, కానీ వచ్చే 2036 ఒలింపిక్స్‌లో తెలంగాణ పేరును విశ్వవ్యాప్తంగా కీర్తించేలా ఆటలు ఆడాలని క్రీడలు, యువజన సర్వీసులు, డైరీ, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి అన్నారు. పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంను మంత్రి పొన్నం ప్రభాకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డిలతో కలిసి రాష్ట్ర క్రీడలు, యువజన సర్వీసులు, డైరీ, ఫిషరీస్, పశుసంవర్ధక శాఖ మంత్రి వాకిటి శ్రీహరి సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక క్రీడాకారులు, విద్యార్థులతో క్రీడా సౌకర్యాల పై మాట్లాడి క్రీడల అభివృద్ధికి ఏం కావాలో అడిగి తెలుసుకున్నారు. ఆనంతరం మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పొన్నం అడగటం ఏందు..మనం ఇవ్వకపోవడమేంది అన్నారు. 2036 లో జరిగే ఒలింపిక్స్ కోసం ఇప్పటి నుంచే 13,14,15 సంవత్సరాలున్న బాలబాలికలను ట్రైన్ చేసి సీఎం కప్ అనే పేరు పెట్టి గ్రామ, స్కూల్ స్థాయి నుంచి పోటీలు నిర్వహించి నైపుణ్యం ఉన్న పిల్లలను వెలికితీయడానికి సీఎం రేవంత్‌రెడ్డి ప్రణాళిక చేస్తున్నారని తెలిపారు. గ్రామ స్థాయి నుంచి మండలం, మండల స్థాయి నుంచి నియోజకవర్గం, నియోజకవర్గం నుంచి జిల్లా, జిల్లా నుంచి రాష్ట్రం, రాష్ట్రం నుంచి జాతీయ స్థాయిలో ఎదిగేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు. క్రీడల్లో రాణించి హుస్నాబాద్‌కు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. అంతర్జాతీయ స్థాయిలో క్రీడాకారులు ఎదగడానికి సాధారణమైన కృషి సరిపోదని క్రీడలే శ్వాసగా భావించి నిరంతరం సాధన చేస్తేనే సాధ్యమవుతుందని అన్నారు. క్రీడాకారులకు అవసరమైన మౌళిక సదుపాయాలు ప్రభుత్వం సమకూరుస్తుందన్నారు. చిన్నతనం నుంచే ఇష్టమైన క్రీడల్లో సాధన చేస్తే దేశం గర్వించదగ్గ క్రీడాకారులు ఎదుగుతారన్నారు. ప్రపంచాన్నే మరిచిపోయి క్రీడల్లో సాధన చేసి జాతీయ స్థాయిలో పతాకం సాధించినపుడు ఏ ప్రపంచంకు నువ్వు దూరం ఉన్నావో అదే ప్రపంచం నీకు జై కొడుతది అన్నారు. ఆ పొగడ్తలో మీ హుస్నాబాద్‌కు పేరు వస్తుంది అన్నారు. హుస్నాబాద్‌లో స్విమ్మింగ్ పూల్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. క్రికెట్ మైదానానికి సంబంధించి స్థలం ఇబ్బంది ఉందని దానిని వెంటనే కలెక్టర్ పరిష్కరించాలన్నారు. తొలి కేబినెట్‌లో స్పోర్ట్స్ పాలసీని ప్రకటించుకున్నాం అన్నారు. సుమారు రూ.700 నుంచి 800 కోట్ల బడ్జెట్‌తో క్రీడా నైపుణ్యంకు కేటాయించినట్లు తెలిపారు. తెలంగాణను విశ్వవ్యాప్తంగా కీర్తించే విధంగా ఆటలు ఆడాలని ఆయన కోరారు. జాతీయ స్థాయిలో రాణిస్తే సిరాజ్‌కు నగదుతో పాటు డిఎస్‌పి ఉద్యోగం ఇచ్చామన్నారు. హుస్నాబాద్ నుంచి క్రీడాకారులు జాతీయ స్థాయిలో ఆడి నలుగురు డిఎస్.పి.పోస్టులు కొట్టాలన్నారు. ఆనంతరం వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా స్టేడియంలో మంత్రులు మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేన రెడ్డి, జిల్లా కలెక్టర్ కె.హైమావతి, అడిషనల్ కలెక్టర్ గరిమా అగ్రవాల్, క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ సోనీ బాలదేవి, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ కేడం లింగమూర్తి, రాష్ట్ర హౌజ్‌ఫెడ్ మాజీ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, ఆర్డీవో రామ్మూర్తి, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకటనర్సయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కంది తిరుపతిరెడ్డి, సింగిల్ విండో చైర్మన్ బొలిశెట్టి శివయ్య, వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బంక చందు, చిత్తారి పద్మ, తదితరులున్నారు.



### హుస్నాబాద్‌ను నం.1 స్థానంలో నిలుపుతా: మంత్రి పొన్నం

క్రీడా రంగంలో హుస్నాబాద్‌ను నం.1 స్థానంలో నిలుపుతా అని రాష్ట్ర రవాణా, బీ.సీ.సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. హుస్నాబాద్ నుంచి జాతీయ స్థాయిలో కబడ్డీ పోటీల్లో పాల్గొన్న క్రీడాకారులు ఉన్నారని కొనియాడారు. స్పోర్ట్స్ ఆడుకునే సదుపాయాలు కల్పించాలని కోరారు. చెరువుల్లో, బావుల్లో ఈత కొడితే పిల్లలు ప్రాణాలు పోతున్నాయి కాబట్టి గ్రామీణ ప్రాంత నియోజకవర్గం కాబట్టి హుస్నాబాద్‌కు స్విమ్మింగ్ పూల్ కేటాయించాలని కోరారు. నా దగ్గరి పిల్లలు చనిపోవద్దు ఈత రావాలంటే స్విమ్మింగ్‌పూల్ కావాలన్నారు. ఈ స్టేడియాన్ని మరింత అభివృద్ధి చేసేది ఉందన్నారు. సంవత్సరంలో ప్రతి గ్రామంలో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

ప్రతి పోటీలో హుస్నాబా ద్ గెలవాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో పోటీలను హుస్నాబాద్‌లో నిర్వహించే విధంగా ఏర్పాటు చేద్దామన్నారు. పిల్లలందరూ స్పోర్ట్స్‌లో కూడా నం.1గా ఉండాలన్నారు. అన్ని రంగాల్లో హుస్నాబా ద్ ముందుండి అవార్డులు పొందాలన్నారు. కబడ్డీ కోర్టులో క్రీడాకారులను పరిచయం చేసుకుని రాష్ట్ర మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్, క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన, క్రీడా ప్రాధికార సంస్థ డైరెక్టర్ సోనీ బాలదేవిలు స్వయంగా కబడ్డీ ఆడి క్రీడాకారులను ఉత్సాహపరిచారు. మంత్రి పొన్నం ప్రభాకర్ కబడ్డీ కోర్టుకు రెండు మ్యాట్లు మంజూరు చేశారు.

---

## వెల కట్టలేనిది మహిళా శక్తి.. అన్నిరంగాలలో రాణించాలి

- జిల్లా కలెక్టర్ హైమావతి




**సిద్దిపేట, జూలై 07(మనం న్యూస్ ప్రతినిధి):** ప్రతి నిత్యం ఇంట్లో, వివిధ రంగాల్లో మహిళలు చేస్తున్న పనికి వారి శక్తి వెలకట్టలేనిది సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి అన్నారు. సిద్దిపేట అర్బన్ మండలంలోని మిట్టపల్లి గ్రామ శివారులో జిల్లా మహిళా సమాఖ్య భవనంలో ఇందిరా మహిళా శక్తి సంబరాల కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కె. హైమావతి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా సమాఖ్య భవనం ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా బాదం మొక్కను అధికారులతో కలిసి నాటారు. ఈ సంవత్సరాలో ఎస్.హెచ్.జి కొత్త సంఘాల ఏర్పాటైనవి 1530, వాటి నుండి జిల్లా సమాఖ్య వరకు కొత్త వారికి అధికారం, ఈ నెల 10 నుండి 16 తేదీ వరకు నియోజకవర్గ స్థాయిలో ప్రజాప్రతినిధుల సమక్షంలో వివిధ కార్యక్రమాలు చేసుకుంటామని తెలిపారు. మహిళలకు ప్రభుత్వం ఏర్పడిన తరవాత వివిధ పథకాలు గూర్చి తెలపడం, సకాలంలో బ్యాంక్ రుణాలు కట్టిన సంఘాలకు వడ్డీ లేని రుణాలు ప్రభుత్వం మంజూరు చేయనుందనీ లోన్ బీమా, ప్రమాద బీమా అందిస్తుందన్నారు. మహిళలు చాలా శక్తి వంతులు మనోధైర్యం చాలా పెద్దది. మహిళా సంపాదించింది అంటే ఒక కుటుంబం అభివృద్ధి కావడానికి ముందు వరసలో ఉందని అర్థం అన్నారు. బిజినెస్ వైపు మహిళలు ఆలోచనలు చెయ్యాలని, మండలానికి ఒక పెద్ద గోడౌన్ కట్టుకుని అందులో అన్ని సదుపాయాలు కల్పించి మండల సమాఖ్యకు ఆదాయం వచ్చేలా చూద్దామన్నారు. ఆసక్తి ఉన్న వాళ్ళకు శిక్షణ ఇప్పించి తప్పకుండా వారికి ఉపాధి పెంచేలా చేస్తామని, అందరి సహకారంతో మంచి కార్యక్రమాలు చెయ్యాలని ఉపాధి రంగంలో ఉన్నత స్థాయిలో వెళ్ళాలని తెలిపారు. దేశ జిడిపి లో కూడా మహిళలు చాలా ముందు వరసలో ఉన్నారని మహిళలో ఇంట్లో చేస్తున్న పనికి కూడా లెక్క చేస్తే వారి శ్రమకు వెలకట్టలేమని తెలిపారు. అంతకుముందు డిఆర్డిఒ జయదేవ్ ఆర్య ఇందిరా మహిళా శక్తిలో సాధించిన పలు విజయాలను వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమాఖ్య అధ్యక్షులు రేణుక, అదనపు డిఆర్డిఓ సుదీర్ కుమార్, సమాఖ్య సభ్యులు, పలువురు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

---

## మంద కృష్ణ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ

**ఘనంగా ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం**



**సిద్దిపేట అర్బన్, జూలై 7(మనం న్యూస్):** మంద కృష్ణ మాదిగ పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని అరుంధతి మాదిగ కుల సంఘం నాయకులు పేర్క దర్గయ్య, పుట్ల మల్లయ్య కుల పెద్దలు అన్నారు. ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం, మందకృష్ణ మాదిగ జన్మదిన వేడుకలను సిద్దిపేటలో అరుంధతి మాదిగ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సిద్దిపేట అంబేద్కర్ నగర్ లోని బాబు జగ్జీవన్ రామ్ విగ్రహం వద్ద అన్నదాన కార్యక్రమం, రక్తదాన కార్యక్రమంతో పాటు, పలువురు కుల సంఘ నేతలకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ గత 31 సంవత్సరాలుగా మందకృష్ణ మాదిగ అనేక విషయాలలో పోరాటం చేశారని గుర్తు చేశారు. ఎస్సీ వర్గీకరణ సాధించుకుని మాదిగలు రిజర్వేషన్ ఫలాలను అందుకుంటున్నారంటే అది మందకృష్ణ మాదిగ పోరాట ఫలితమేనని తెలిపారు. అలాగే వృద్ధులు, వికలాంగుల పెన్షన్ పెంపు కోసం, రేషన్ బియ్యం కోటా పెంపు కోసం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ పోరాటం చేశారని గుర్తు చేశారు. 31 సంవత్సరాల సుదీర్ఘ పోరాటంలో ఎన్నో విజయాలు సాధించారని ఎమ్మార్పీఎస్ 31 సంవత్సరాల ప్రస్థానాన్ని గుర్తు చేసుకుంటూ ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, బిజెపి జిల్లా అధ్యక్షుడు భైరి శంకర్, కౌన్సిలర్లు నాయిని చంద్రం, రియాజుద్దీన్ సంఘము నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

---

## వాహనదారులు సకాలంలో టాక్స్ చెల్లించాలి



- ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తాం
- ఉమ్మడి మెదక్ జిల్లా డిప్యూటీ రవాణా శాఖ అధికారి వెంకటరమణ

**సిద్దిపేట రూరల్, జూలై 7(మనం న్యూస్):** రవాణా శాఖ పరంగా ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తున్నామని మెదక్ ఉమ్మడి జిల్లా డిప్యూటీ రవాణా శాఖ అధికారి వెంకటరమణ అన్నారు. సోమవారం సిద్దిపేట రవాణా శాఖ కార్యాలయాన్ని ఆయన సందర్శించి అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మధ్యవర్తులను ఆశ్రయించకుండా నేరుగా ప్రజలు రవాణా శాఖ కార్యాలయానికి వచ్చి సేవలను పొందాలన్నారు. జిల్లాలో స్పెషల్ డ్రైవ్ కింద స్కూల్ బస్సులను తనిఖీ చేస్తున్నామన్నారు. ఫిట్నెస్ లేని స్కూల్ బస్సులను సీజ్ చేస్తామన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వాహనాల్లో ఎక్కువ మందిని ఎక్కిస్తే శాఖ పరంగా కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు నిబంధనలను తప్పకుండా పాటించాలన్నారు. ఆయన వెంట జిల్లా రవాణా శాఖ అధికారి లక్ష్మణ్, ఏవో నజీర్ తదితరులు ఉన్నారు.

---

## పక్కా ప్రణాళికతో విలీన గ్రామాల అభివృద్ధి

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



**రామచంద్రాపురం, జూలై 7(మనం న్యూస్):** అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలో విలీనమైన గ్రామ పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధులు కేటాయిస్తూ.. అభివృద్ధి పథంలో ముందుకు తీసుకుని వెళ్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. అమీన్ పూర్ మున్సిపల్ పరిధిలోని పటేల్ గూడ హరివిల్లు కాలనీ, ఇందిరమ్మ కాలనీలలో ఒక కోటి పది లక్షల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే జిఎంఆర్ మాట్లాడుతూ.. విలీన గ్రామాల పరిధిలో ఏర్పడుతున్న నూతన కాలనీలలో మౌలిక వసతుల కల్పనకు ప్రథమ ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రధానంగా సిసి రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీలు, వీధిదీపాల ఏర్పాటుకు కృషి చేస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం అందించే నిధులతోపాటు సిఎస్ఆర్ నిధులతో అభివృద్ధి పనులకు నిధులు కేటాయిస్తున్నామని పేర్కొన్నారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను సైతం అర్హులకు మాత్రమే అందిస్తున్నామని తెలిపారు. అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములైనప్పుడే సత్ఫలితాలు వస్తాయని తెలిపారు. కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలోని శ్రీరామ్ నగర్ కాలనీ మీదుగా సంగమేశ్వర స్వామి దేవాలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణానికి నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్ పూర్ మున్సిపాలిటీ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, అమీన్ పూర్ మాజీ ఎంపీపీ దేవానంద్, మాజీ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సునీత సత్యనారాయణ, మున్సిపల్ కమిషనర్ జ్యోతి రెడ్డి, డిఈ వెంకటరమణ, ఏఈ ప్రవీణ్, సీనియర్ నాయకులు గోపాల్, కృష్ణ, శ్రీకాంత్, గోవింద్, కాలనీ సభ్యులు, ప్రజలు పాల్గొన్నారు.

---

## ప్రజావాణి సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

**సంగారెడ్డి, జూలై 7(మనం ప్రతినిధి):** ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఫిర్యాదులకు ప్రాధాన్యతనిస్తూ త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి ప్రావీణ్య అధికారులను ఆదేశించారు. జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 46 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్ తో పాటు, అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డిఆర్ఓ పద్మజరాణిలకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కాగా, అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ అర్జీదారులకు సమాచారం తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.



---

## ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ కే. హైమావతి

**సిద్దిపేట అర్బన్, జూలై 7(మనం న్యూస్):** ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కే. హైమావతి అధికారులను



ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఐడిఓసిలోని సమావేశ మందిరంలో జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్, అదనపు కలెక్టర్ రెవిన్యూ అబ్దుల్ హమీద్ లతో కలిసి ప్రజల నుండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. అంతకుముందు జిల్లా అధికారులతో నిర్వహించిన రివ్యూలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి మంగళవారం, శుక్రవారం మండల ప్రత్యేక అధికారులు మండలంలో పర్యటించి సానిటేషన్, ఇందిరమ్మ ఇండ్ల ప్రగతి, వనమహోత్సవం సహ అన్ని ప్రభుత్వ ప్రధాన కార్యక్రమాల ప్రగతిని పర్యవేక్షించాలని అన్నారు. ప్రజావాణి ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి శనివారంలోగా దరఖాస్తులను పరిష్కరించి ఆన్లైన్లో పొందుపరచాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ నాగరాజమ్మ, కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రభుత్వ భూమి క్రమబద్ధీకరించుకున్న వారిపై చర్యలు తీసుకోండి

- ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు

**సంగారెడ్డి, జూలై 7(మనం ప్రతినిధి):** మోసపూరితంగా ప్రభుత్వ భూమిని 59 జి ఓ ద్వారా క్రమబద్దికరణ చేసుకున్న వారిపై చర్య తీసుకోవాలని సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు .సంగారెడ్డి జిల్లా కేంద్రం సంగారెడ్డి పట్టణంలోని సర్వే నం. 374లోని ప్రభుత్వ భూమిలో దాదాపు 900 గజాల పైగా ప్రభుత్వ భూమిలో ఇండ్లు లేకున్నా ఇండ్లు ఉన్నట్టు ఐదుగురు వ్యక్తులు మున్సిపల్ కార్యాలయంలో తప్పుడు పత్రాలతో ఇంటి నంబర్లు పొంది వాటి ద్వారా మోసపూరితంగా 59 జీఓ కింద తహసీల్దార్ సంగారెడ్డి ద్వారా క్రమబద్ధీకరణ చేసుకొని, అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని, ఇట్టి అక్రమ నిర్మాణాలపై గత డిసెంబర్ నుండి అనేక సార్లు ఫిర్యాదు చేసిన సంగారెడ్డి తహసీల్దార్, రెవెన్యూ డివిజన్ అధికారి సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్లు అక్రమ నిర్మాణాలపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆర్‌డిఓ సంగారెడ్డి తహసీల్దార్ సంగారెడ్డి, మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డిల అలసత్వం కారణంగా కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి అక్రమార్కుల చేతిలో అన్యాక్రాంతం అవుతున్న అధికారుల తీరుపై అనుమానాలు కలుగుతున్నాయని వెంటనే ఇట్టి అక్రమ క్రమ బద్దికరణ, అక్రమ నిర్మాణల కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతూ సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్ కి ఫిర్యాదు చేసిన సంగారెడ్డి పట్టణానికి చెందిన జి. వి.వసంత్, ఎం.శ్రీధర్ ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.



# భద్రాద్రి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

## వ్యవసాయ శాఖా మంత్రి మంత్రి తుమ్మల నాగేశ్వరావు



భద్రాచలం, జూలై 7( మనం న్యూస్): దక్షిణ అయోధ్యగా పేరుగాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని వ్యవసాయ శాఖ మంత్రి తుమమ్మ నాగేశ్వరరావు పేర్కొన్నారు. భద్రాచలంలోని శ్రీ సీతారామచంద్ర స్వామి దేవస్థానం మాడవీధుల విస్తరణ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ దేవస్థానం అభివృద్ధి చేయడానికి ,భూ సేకరణ కోసం ఎన్నో సంవత్సరాల నుండి నివాసం ఉంటున్న మాడ వీధుల ఇంటి యజమానులను ఒప్పించడానికి రెవెన్యూ యంత్రాంగం అహర్నిశలు శ్రమించిందన్నారు. వారి కృషిని అభినందించారు. అభివృద్ధి నిధుల కోసం మంత్రులందరరం, ఎంఎల్ఏలంతా సీఎం దృష్టికి తీసుకుపోగా వెంటనే మొదటి విడతగా 33 కోట్ల రూపాయలు విడుదల చేశారని తెలిపారు. ఇంకా నాలుగు కుటుంబాలు మిగిలిపోయాయని ,వారికి కూడా నిధులు ఇప్పించి మాడవీధుల విస్తరణ ప్రక్రియ పూర్తి స్థాయిలో చేస్తామన్నారు. జీవనోపాధి కోసం షాపింగ్ కాంప్లెక్స్ నిర్మాణం చేసుకోవడానికి అవకాశం కల్పించాలని మాడవీధుల యజమానులు కోరినట్లు తన దృష్టికి వచ్చిందని, తప్పకుండా ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. మాడవీధుల పక్కన ఉన్న హోటల్లో జిల్లా అధికారులతో కలిసి టీ తాగుతూ కాసేపు సేద తీరారు.

తొలుత భద్రాచలం పట్టణంలోని అంబేద్కర్ సెంటర్లో అంబేద్కర్ సెంటర్ నుండి చర్ల రోడ్డు వరకు స్పెషల్ డెవలప్మెంట్ నిధులు కోటి 15 లక్షల వ్యయంతో సెంట్రల్ లైటింగ్, డివైడర్లు నిర్మాణం చేపట్టే శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ బి పాటిల్, ఐటీడీఏ పీవో బి రాహుల్, ఏ ఎస్ పి విక్రాంత్ కుమార్ సింగ్, శిక్షణ కలెక్టర్ సౌరబ్ శర్మ, జడ్పీ సీఈవో నాగలక్ష్మి, ఆర్డీవో దామోదర్ రావు, భద్రాచలం తాసిల్దార్ జగదీష్ ప్రసాద్, పంచాయతీరాజ్ ఈ ఈ సత్యనారాయణ, డి ఈ ఇర్ఫాన్, ఏఈ శ్రీరామ్, మిషన్ భగీరథ ఏఈఈ రాజారావు, జి పి ఈవో శ్రీనివాస్ ఇతర శాఖల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

### బీజపూర్‌లో ఎన్ కౌంటర్

# మృత దేహం గుర్తింపు





చర్ల, జూలై 7 (మనం న్యూస్) : ఛత్తీస్గఢ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా నేషనల్ పార్క్ అటవీప్రాంతంలో ఈ నెల 5 వ తేదీన జరిగిన ఎదురుకాల్పులలో మృతిచెందిన మావోయిస్టు రూ. 8 లక్షల రివార్డు కలిగిన డిప్యూటీ కమాండర్ సోధి కన్నా గా పోలీసులు గుర్తించారు. నేషనల్ పార్క్ అటవీప్రాంతంలో తెలంగాణ రాష్ట్ర కమిటి, నేషనల్ పార్క్ ఏరియా కమిటీ, పి ఎల్ జి ఏ నెంబర్ 1 బెటాలియన్ కు చెందిన మావోయిస్టులు సంచరిస్తున్నారన్న ప్రక్కా సమాచారంతో ఈ నెల 4 వ తేదీ నుండి బీజపూర్ జిల్లా డి ఆర్ జి, దంతెవాడ ఎస్ టి ఎఫ్, కోబ్రా 202, కోబ్రా 210, సి ఆర్ పి ఎఫ్ యంగ్ ప్లాటూన్ బలగాలు కూంబింగ్ చేపట్టాయి. ఈ క్రమంలో శనివారం జరిగిన ఎదురుకాల్పులలో ఒక మావోయిస్టు మృతి చెందిన విషయం విదితమే. ఇతడు కేంద్ర కమిటీ సభ్యుడు మడివి హిడ్మా సహచరుడు, పి ఎల్ జి ఏ బెటాలియన్ 1 వ కంపెనీకు చెందిన డిప్యూటీ కమాండర్ సోది కన్నా గా గుర్తించారు. గత ఏడాది పామేడ్ పోలీస్ స్టేషన్ ధర్మారం భేస్ క్యాంప్ పై దాడికి పాల్పడిన ఘటనలో నిందితుడిగా ఉన్నాడు. ఎన్ కౌంటర్ ప్రాంతం వద్ద నుండి 303 రైఫిల్, 5 రౌండ్లు, ఏకే 47 మ్యాగజైన్, 59 రౌండ్లు, కోడెక్స్ వైర్, డిటోనేటర్, మావోయిస్టు సాహిత్యం, రేడియో, రోజు వారీ ఉపయోగించే వస్తువులతో పాటు పెద్ద ఎత్తున మందుగుండు సామగ్రి స్వాదీన పరుచుకున్నట్లు బస్తర్ రేంజ్ ఐజి సుందర్ రాజ్, బీజపూర్ జిల్లా ఎస్ పి జితేంద్ర యాదవ్ లు తెలిపారు. గత 18 నెలల కాలంలో బస్తర్ ప్రాతంలో జరిగిన వివిద ఎన్ కౌంటర్లలో 415 మంది మావోయిస్టులు మృతి చెందినట్లు ప్రకటించారు. మావోయిస్టుల కొరకు వర్షాకాలంలోనూ కూంబింగ్ చేపడతామని వెల్లడించారు. కాగా ఈ ఏడాది ఫిబ్రవరి 9 న నేషనల్ పార్క్ అటవీప్రాంతంలో జరిగిన ఎన్ కౌంటర్ లో 31 మంది మావోయిస్టులు మృతి చెందగా ఇద్దరు జవాన్లు సైతం మృతిచెందారు. ఏప్రెల్ 11 న జరిగిన ఎదురుకాల్పులలో ముగ్గురు మృతి చెందగా జూన్ 5 న జరిగిన ఎదురుకాల్పులలో కేంద్ర కమిటీ సభ్యుడు తెంటు లక్ష్మి నర్సింహాచలం అలియాస్ సుధాకర్, 6 వ తేదీన జరిగిన ఎదురుకాల్పులలో తెలంగాణ రాష్ట్ర కమిటి సభ్యుడు మైలారపు ఆడెల్లు అలియాస్ బాస్కర్, 7 వ తేదీన జరిగిన ఎదురుకాల్పులలో మరో 5 గురు మావోయిస్టులు మృతి చెందారు.

## ఆహార భద్రత కార్డుదారులందరూ ఈకెవైసి చేయించుకోవాలి

- జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్
- వాణిజ్య అవసరాలకు నాన్ డొమెస్టిక్ సిలిండర్లను ఉపయోగించాలి

ఖమ్మం, జూలై 7(మనం న్యూస్)ః ప్రభుత్వ ఆదేశాలనుసారం ఆహారభద్రత కార్డుదారులు అందరూ రేషన్ షాపులలో ఈకెవైసి చేయించుకోవాలని జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారి చందన్ కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 4,15,905 ఆహార భద్రత కార్డులకు 12,03,943 మొత్తం యూనిట్లకు గాను 9,64,236 యూనిట్లు మాత్రమే ఈకెవైసి చేయించుకున్నారని, మిగిలిన సభ్యులు అందరూ వెంటనే ఈకెవైసి చేయించాలని తెలిపారు. ఎన్ఫోర్స్మెంట్ స్టాఫ్ తనిఖీలలో ఖమ్మం నగరంలో వాణిజ్య సముదాయాలలో అనగా హోటల్స్, హాస్టల్స్, రెస్టారెంట్లలో గృహ ఉపయోగానికి వాడాల్సిన గ్యాస్ సిలిండర్లను ఉపయోగిస్తున్నట్లు తెలిసి, వారిపై 6 ఏ కేసు నమోదు చేస్తూ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకొన్నట్లు తెలిపారు. వాణిజ్య అవసరాలకు నాన్ డోమెస్టిక్ సిలిండర్లను ఉపయోగించాలని, లేకుంటే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# 15 ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

- కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి
- స్కూల్ మేనేజ్మెంట్ కమిటీ ద్వారా అభివృద్ధి పనులు చేపట్టాలి
- ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ వారం రోజులలో పూర్తి చేయాలి
- మధిర పట్టణంలో జి+2 విధానంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ప్రణాళిక
- ఇందిరమ్మ ఇండ్లు, విద్యా శాఖ, తదితర అంశాలపై సమీక్షించిన కలెక్టర్




ఖమ్మం, జూలై 07(మనం బ్యూరో)ః జిల్లాలో 15 ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, దీనికి అవసరమైన పటిష్ట ప్రణాళికలు తయారు చేయాలని ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజతో కలిసి ఇందిరమ్మ ఇండ్లు, విద్యా శాఖ, తదితర అంశాలపై సోమవారం సంబంధిత అధికారులతో కలెక్టర్ సమీక్షించారు.ఈ సందర్భంగా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ జిల్లాలో 15 ప్రభుత్వ పాఠశాలలను ఎంపిక చేసి, పైలెట్ ప్రాజెక్టు క్రింద వాటిని సంపూర్ణంగా అభివృద్ధి చేయాలని అన్నారు. తెలంగాణ విద్య కమీషన్ చైర్మన్ ఆకునూరి మురళీతో సమన్వయం చేసుకుంటూ ఈ కార్యక్రమం చేపట్టాలన్నారు. 15 ప్రభుత్వ పాఠశాలలను పైలెట్ గా అభివృద్ధి చేయాలని, ఎటువంటి పొరపాట్లు రాకుండా ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, దీనికి అవసరమైన నిధులను ప్రత్యేకంగా ఎస్.డి.ఎఫ్, సిఎస్ఆర్ నిధుల ద్వారా మంజూరు చేయనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ప్రతి పాఠశాలకు ప్రత్యేక అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని, ఎటువంటి నిర్లక్ష్యానికి ఆస్కారం ఉండకూడదని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఉన్న 12 కోట్ల సిఎస్ఆర్ నిధులతో పనులు ప్రారంభించాలని కలెక్టర్ తెలిపారు. మధిర పట్టణంలో జి+2 మోడల్లో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించే ప్రతిపాదనలు తయారు చేయాలన్నారు. 13 ఎకరాల స్థలం గుర్తించామని, అక్కడ 427 ఇండ్లు నిర్మించడానికి ప్రణాళికలు అందించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గుడిసెల్లో ఉంటున్న పేదలను ఎంపిక చేసి ఇండ్లు మంజూరుకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ తెలిపారు. ఖమ్మం అర్బన్ మండలం, సత్తుపల్లి, వైరా, పాలేరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలో కూడా పెండింగ్ ఇండ్ల మంజూరు కోసం లబ్దిదారుల ఎంపిక బఫర్ జాబితాతో కలిపి సిద్దం చేయాలని అన్నారు. ఇందిరా మహిళా డెయిరీ కింద అవసరమైన షెడ్స్ ఉపాధి హామీ కింద నిర్మించాలని కలెక్టర్ తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పీ సీఈఓ దీక్షా రైనా, హౌసింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, విద్యాశాఖ ప్లానింగ్ కో ఆర్డినేటర్ రామకృష్ణ, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రైవేట్ స్కూళ్ల ఫీజుల దోపిడిని అరికట్టాలి

- సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లావుడియా ప్రసాద్ నాయక్
- ప్రజావాణిలో ఫిర్యాదు



లక్ష్మీదేవిపల్లి, జూలై 7 (మనం న్యూస్)ః ప్రైవేట్ స్కూల్స్ అధిక ఫీజు దోపిడీని అరికట్టాలని సేవాలాల్ బంజారా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రసాద్ నాయక్ అన్నారు. సోమవారం భద్రాద్రి కలెక్టరేట్లో జరిగిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం ఇచ్చారు. విద్యా సంవత్సరం ప్రారంభం కాగానే ప్రతి సంవత్సరం లాగానే జిల్లాలోని లక్ష్మీదేవిపల్లి, చుంచుపల్లి, కొత్తగూడెం మండలాల్లో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ఫీజులను వసూలు చేస్తున్నాయని ఫిర్యాదు చేశారు. పాఠ్యపుస్తకాలు, ఫీజులు,యూనిఫాంల పేరుతో తల్లిదండ్రులను అడ్డంగా దోపిడీ చేస్తూ..వేలాది రూపాయలను అడ్డగోలుగా ముక్కుపిండి వసూలు చేస్తున్నారని మండిపడ్డారు. ఎన్నడూలేని విధంగా ఈ ఏడాది ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు అధిక ధరలకు పుస్తకాలను విక్రయిస్తున్నట్లు మాకు సమాచారం ఉందన్నారు.ఎల్ కె జి నుంచి 5వ తరగతి వరకు రూ.30 వేల నుంచి రూ.35 వేలు వసూలు చేస్తున్నారని అదనపు కలెక్టర్ కు తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఒక్కో విద్యార్థి నుంచి తరగతులను బట్టి పుస్తకాల కోసం రూ.3వేల నుంచి రూ.6500 వరకు,యూనిఫాంకు రూ.5 నుంచి రూ.6 వేలు వసూళ్లు చేస్తున్నారని వెల్లడించారు. తల్లిదండ్రులు బిల్ అడిగితే బిల్లులు ఇవ్వకుండా ఆడిటింగ్ కు దొరకకుండా, తమవద్ద వున్న తాత్కాలిక బుక్కుల్లో వ్రాసుకుంటూ.. ఏజెన్సీ ప్రజలను నిలువునా దోచుకుంటున్నారని విమర్శించారు. జీఎస్టీ బిల్లును మాత్రం ఇవ్వకుండా విద్యార్థుల తల్లిదండ్రులను ఇబ్బందులకు గురి చేయడం విచారకరం అని ఆందోళన వ్యక్తం చేశారు. సదరు మండలాల్లోని ప్రైవేట్ విద్యాసంస్థల దోపిడిని, ధన దాహార్తికి తమరు స్పందించి అడ్డుకట్ట వేయాలని కోరారు. విద్యార్థుల తల్లి తండ్రుల బలహీనతను ఆసరాగా తీసుకోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వేలాది రూపాయలు దోపిడీ చేస్తున్నారని తెలిపారు. వీరిపై జిల్లా విద్యాశాఖ అధికారి, కమర్షియల్ టాక్స్ ఉన్నత అధికారులకు, ఆదాయ పన్ను శాఖ అధికారులకు తక్షణమే చర్యలు చేపట్టేలా ఆదేశాలు జారీ చేయాలని అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ ను కోరారు. ఏజెన్సీ ప్రాంత గిరిజనులకు న్యాయం చేయాలని అభ్యర్థించారు.శ్రీ చైతన్య స్కూల్ లక్ష్మీదేవిపల్లి మండలం ప్రశాంతి నగర్ గ్రామపంచాయితీ నందు నిర్వహిస్తున్న సదరు బిల్డింగ్ జి ప్లస్ ఫోర్ కు ఏజెన్సీ 1/70 ఏరియాలో ఇలాంటి అనుమతులు లేదన్నారు. ఏజెన్సీలో చట్టాలను ముల్లంగిస్తూ యధేచ్ఛగా విద్యను వ్యాపారంగా మారుస్తున్నారని అన్నారు.కొన్ని విద్యా సంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా కనీసం షిఫ్టింగ్ పర్మిషన్ కూడా లేకుండా విద్యాసంస్థలను నడుపుతున్నారని చెప్పారు. నిబంధనలకు విరుద్ధంగా ఇంత జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఫిర్యాదు చేశారు.చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో సేవాలాల్ బంజారా సంఘం జిల్లా అధ్యక్షుడు నునావత్ రాంబాబు నాయక్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ నాయక్,జిల్లా కార్యదర్శి ధరావత్ నాగరాజు నాయక్, భారతీయ గోర్ బంజారా జిల్లా అధ్యక్షుడు దుర్గాప్రసాద్ నాయక్, ప్రసాద్ నాయక్, గణేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## ఆదివాసీ ప్రజలకు అండగా ఉంటాం..



- అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్) నరేందర్
- ఆదివాసులకు మౌలిక సదుపాయాలు కల్పిస్తాం : డిఎస్పి
- రేగళ్ల గుత్తికోయ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రాం

కరకగూడెం, జూలై 7(మనం న్యూస్): ఆదివాసీ ప్రజలకు అండగా ఉంటామని అడిషనల్ ఎస్పీ (ఆపరేషన్) నరేందర్ పేర్కొన్నారు. కరకగూడెం సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ పివిఎన్ రావు ఆధ్వర్యంలో రేగళ్ల గుత్తికోయ గ్రామంలో కమ్యూనిటీ కనెక్ట్ ప్రోగ్రామ్‌ను సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ ఆపరేషన్స్ జి.నరేందర్ ,మణుగూరు డిఎస్పీ రవీందర్ రెడ్డి పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటిని పోలీసులు క్షుణ్ణంగా తనిఖీలు చేపట్టారు. అనంతరం గ్రామస్తులందరితో సమావేశమై అక్కడ నివసించే చిన్న పిల్లలకు పలకలు, పుస్తకాలతో పాటు, మహిళలకు నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. గ్రామంలోని యువతకు వాలీబాల్ కిట్లను అందశారు. అనంతరం ఓఎస్డి నరేందర్ మాట్లాడుతూ. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసి ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని తెలిపారు. ఆదివాసీ ప్రజలకు విద్య, వైద్యం, రవాణా వంటి కనీస సౌకర్యాలను అందించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు. గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు ప్రవేశిస్తే వెంటనే పోలీసు వారికి సమాచారం అందించాలని, అదేవిధంగా నిషేధిత మావోయిస్టులకు ఎలాంటి సహాయ సహకారాలు అందించవద్దని గ్రామస్తులకు సూచించారు. గ్రామంలోని పొలం పనులకు వెళ్లే మహిళలకు వర్షాకాలం ఇబ్బంది కలగకుండా ప్లాస్టిక్ రైన్ కోట్స్ ను అందించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ స్టేషన్ సిబ్బంది స్పెషల్ పార్టీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉద్యోగ విరమణ బకాయిలు చెల్లించండి

- కలెక్టర్కు పెన్షనర్ల వినతి

ఖమ్మం, జూలై 7(మనం న్యూస్)ః ఉద్యోగ బాధ్యతల నుంచి విరమణ పొంది నెలలు గడిచినా బకాయిల చెల్లింపులు జరగలేదని తక్షణం చెల్లించాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో పెన్షనర్లు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టికి సామూహిక వినతి పత్రం అందజేశారు. సోమవారం గ్రీవెన్స్ సందర్భంగా పెద్ద సంఖ్యలో కలెక్టరేట్ కు చేరుకున్న పెన్షనర్లు ఉద్యోగ విరమణ అనంతరం తమకు రావాల్సిన గ్రాట్యూటీ, జిపిఎఫ్, లీవ్ ఎన్ క్యాష్మెంట్, కమ్యూటేషన్, టిఎస్జిఎల్ఐ తదతర మొత్తాలను చెల్లించడం లేదని వినతి పత్రంలో తెలిపారు. అవి రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని ఇదే వేదనతో ఉద్యోగ విరమణ చేసిన కొందరు తనువు చాలించారని వినతి పత్రంలో పేర్కొన్నారు. గతంలో ఉద్యోగ విరమణ పొందిన వెంటనే పైన పేర్కొన్న మొత్తాన్ని అందజేసేవారని కానీ ఇప్పుడు ఏడాది గడిచినా అందించడం లేదని దీని వల్ల పిల్లల వివాహాలు, స్థిర నివాసం ఇతర ఆర్థిక అవసరాలు నెరవేర్చుకోలేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. వెంటనే ఉద్యోగ విరమణ పొందిన వారి బకాయిలను చెల్లించేవిధంగా రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేయాలని వినతి పత్రంలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పరిశ పుల్లయ్య, రాయలరవికుమార్, సంఘ బాధ్యులు ఐవి భాస్కరాచారి, పి. వీరభద్రరావు, వి. మేరీ ఏసుపాదం, జి. లక్ష్మి సుజాత, ఎండి మహబూబ్ -అలీఖాన్, ఎస్ కె మహ్మద్ హుస్సేన్, కె. నాగప్రసాద్, జి. కృష్ణారావు, తాడి అంజలి, కె. అన్నమ్మ, ఎం. నారాయణ, పీవీఆర్కే ప్రసాదరావు, మధుకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## శ్రీవిజ్ఞాన్ విద్యార్థి భానుప్రసాద్‌కి ఐఐటి అడ్మిషన్



మణుగూరు, జూలై 7(మనం న్యూస్): మణుగూరు మండల పరిధిలో గల గుట్ట మల్లారం ప్రాంతానికి చెందిన శ్రీ విజ్ఞాన్ స్కూల్ విద్యార్థి మేడ భానుప్రసాద్ పదవ తరగతిలో అత్యుత్తమంగా 580 మార్కులు సాధించి తన ప్రతిభను నిరూపించుకున్నాడు. ఈ శుభపరిణామం ఫలితంగా, అతడికి మహబూబ్‌నగర్ లోని ఐఐఐటి (ఆర్‌జియుకేటి)లో సీటు లభించింది. ఇది తమ విద్యార్థి కృషికి, తల్లిదండ్రుల ప్రోత్సాహానికి, ఉపాధ్యాయుల అంకితభావానికి నిదర్శనమని కరస్పాండంట్ సప్పిడి సాంబశివ రెడ్డి తెలిపారు. మేడ భానుప్రసాద్ కు అభినందనలు తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఐఐఐటిలో అడ్మిషన్ కి మణుగూరులో తమ శ్రీవిజ్ఞాన్ స్కూల్ నుండి ప్రతి ఏడాదికొకరు అర్హత పొందటం అనందంగా ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో ప్రిన్సిపాల్ రత్నకుమార్, దుర్గాదేవి, ధనలక్ష్మి ,రజిత పాల్గొన్నారు.

# ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును పరిష్కరించండి

- అదనపు కలెక్టర్ వేణుగోపాల్

భద్రాద్రి కొత్తగూడెం, జూలై 7 (మనంప్రతినిధి): ప్రజావాణి కార్యక్రమంలో వచ్చిన ప్రతి దరఖాస్తు క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ వేణుగోపాల్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందనతో కలిసి ప్రజావాణి నిర్వహించి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజల సమస్యల నుండి దరఖాస్తులు స్వీకరించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేశారు.

### గ్రీవెన్స్ లో వచ్చిన ఫిర్యాదులలో ముఖ్యమైనవి:-

కొత్తగూడెం సన్యాసి బస్తీకి చెందిన గొల్ల రాహుల్, తాను శారీరక వికలాంగుడనని 2020 సంవత్సరం లో డిగ్రీ పూర్తి చేసి ఉన్నప్పటికీ, ఉపాధి అవకాశాలు లేక కుటుంబం ఆర్థికంగా చాలా ఇబ్బందుల్లో ఉన్నదని, తన పరిస్థితిని అర్థం చేసుకొని ఏదైనా ఉపాధి అవకాశం కల్పించాలని చేసిన దరఖాస్తును పరిశీలించిన అదనపు కలెక్టర్ పరిష్కారం నిమిత్తం జిల్లా ఉపాధి కల్పన శాఖ అధికారి కి ఎండార్స్ చేశారు. ఇల్లందుకు చెందిన బైరి అనసూర్య తన ఇల్లు శిథిలావస్థలో ఉన్నదని, ఇందిరమ్మ ఇల్లు కొరకు దరఖాస్తు చేసుకున్నానని, మంజూరు చేసిన ఇల్లును తనకు 60 సంవత్సరాలు అని రద్దు చేశారని, తన స్థానంలో తన కుమారుడికైనా ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని చేసిన దరఖాస్తును పరిశీలించి పరిష్కారం నిమిత్తం గృహ నిర్మాణ శాఖ పి డి కి ఎండార్స్ చేశారు. పినపాక మండలం పోట్లపల్లి గ్రామానికి చెందిన ఆంబోజు వెంకటేశ్వర్లు గృహ జ్యోతి పథకం క్రింద ఉచిత కరెంటుకు దరఖాస్తు చేసుకొన్నానని కానీ ఇంతవరకు ఉచిత కరెంటు ఇవ్వడం లేదని తనకు గృహజ్యోతి పథకం కింద ఉచిత కరెంటు జీరో బిల్లు వర్తింప చేయగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి పరిష్కారం నిమిత్తం విద్యుత్ శాఖ ఎస్ఈకి ఎండార్స్ చేశారు. లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామానికి చెందిన వంక లక్ష్మయ్య గ్రామపంచాయతీలో సర్వే నంబర్ 97/అ6 లో తనకున్న 1:20 కుంటలలో వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నానని, సదరు భూమిలో కొంత భాగం ఇతరులు ఆక్రమించుకొని మమ్మల్ని భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆ భూమిని సర్వే చేయించాలని చేసిన దరఖాస్తును పరిశీలించి పరిష్కారం నిమిత్తం లక్ష్మీదేవిపల్లి తహసిల్దార్ కి ఎండార్స్ చేశారు. మణుగూరు కు చెందిన బత్తుల రాములు సర్వే నెంబర్ 138/1559 లో ఒక ఎకరం 20 కుంటల భూమి ఉన్నదని దానికి రైతు భరోసా డబ్బులు కూడా వస్తున్నాయని అట్టి పొలం ప్రభుత్వ మెడికల్ కళాశాల ఏర్పాటులో పోతున్నదని తనకు వ్యవసాయమే జీవనాధారం మని, కావున తన భూమిని తనకు ఇప్పించగలరని చేసిన దరఖాస్తును పరిశీలించి తగు చర్య నిమిత్తం ఓఎస్ ఈ సెక్షన్ పర్యవేక్షులకు ఎండార్స్ చేశారు. ఈ ప్రజావాణి కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## పోర్చుగల్ లో ఉపాధి అవకాశాల కోసం దరఖాస్తు సమర్పించాలి

- జిల్లా ఉపాధి అధికారిణి మాధవి

ఖమ్మం, జూలై 07(మనం న్యూస్)ః పోర్చుగల్ లో ఉపాధి అవకాశాల కోసం దరఖాస్తు సమర్పించాలని జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్ కామ్) ద్వారా పోర్చుగల్ లో హోటల్ మేనేజ్మెంట్, హౌజ్ కీపర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్పా థెరపీ, ఈవెంట్ కో ఆర్డినేటర్ వంటి పోస్టులకు, విద్యార్హతలు కలిగిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు ఉన్నాయని, 21 నుంచి 40 సంవత్సరాలు గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని, వీరికి 2 నుంచి 5 సంవత్సరాల అనుభవం ఉండాలని అన్నారు. పోర్చుగల్ లో డిప్లొమా/డిగ్రీ హోటల్ మేనేజ్మెంట్ అర్హతతో ఎఫ్‌బీ మేనేజర్, హౌస్ కీపింగ్ సూపర్వైజర్, హౌస్ కీపర్, వేయిటర్ ఖాళీలు, ఐటిఐ / డిప్లమా ఎలక్ట్రికల్ వర్క్ తో మెయింటనెన్స్ టెక్నీషియన్, కులినరి ఆరట్స్ లో డిగ్రీతో ఎగ్జిక్యూటివ్ చెఫ్, కుక్, ఇంటర్మీడియట్ సరైన అనుభవంతో కిచెన్ అసిస్టెంట్, మార్కెటింగ్ డిగ్రీతో సేల్స్ ఎగ్జిక్యూటివ్, ఈవెంట్ మేనేజ్మెంట్ డిగ్రీతో ఈవెంట్ కో ఆర్డినేటర్, మసాజ్ థెరపీ సర్టిఫికెట్ అర్హత తో స్పా థెరపిస్ట్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు.అభ్యర్థులకు వేతనం 90 వేల నుంచి లక్షా 50 వేల రూపాయల వరకు నెలకు అందుతుందని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు వివరాలకు 9440052592, 9440049937, 9440051452 ఫోన్ నెంబర్ల నందు సంప్రదించాలని ఆ ప్రకటనలో పేర్కొన్నారు.



# వర్గీకరణ తో మాదిగలకు న్యాయం

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి

**మహబూబ్ నగర్, జూలై 7(మనం బ్యూరో)**: ఎస్సీ వర్గీకరణ తోనే మాదిగలకు న్యాయం జరిగిందని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం మహబూబ్ నగర్ నగరపాలక పరిధి లోని ఏనుగొండ లో జరిగిన ఎంఆర్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎన్నో యేండ్లు మాదిగ వర్గీకరణ కోసం పోరాటం చేసినా ఫలితం లేకపోయిందని, ఎంతో గొప్ప చదువులు చదివినా తమ వర్గానికి కాకుండా వేరే వర్గానికి ఉద్యోగ , ఉపాధి అవకాశాలు లభించాయని అందుకే ఎస్సీ వర్గీకరణ కావాలని డిమాండ్ చేశారని ఆయన గుర్తు చేశారు. గతం ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణ చేయకుండా పది సంవత్సరాలు కాలయాపన చేశారని ఆరోపించారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రిగా , ప్రజా ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎస్సి రిజర్వేషన్ కోసం కమిటీ ఏర్పాటు చేసి ఎలాంటి న్యాయపరంగా సమస్యలు తలెత్తకుండా ఇబ్బందులు లేకుండా ఎస్సీ వర్గీకరణ అమలు చేయడం జరిగిందని, అందుకు ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క గతో పాటు, ప్రజా ప్రభుత్వం లోని అందరు ఎమ్మెల్యేలు ఎస్సీ వర్గీకరణకు సహకరించామని ఆయన గుర్తు చేశారు. అంతకుముందు గ్రామంలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పేదలకు , వృద్ధులకు , వితంతువులకు పండ్లు, దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్, మల్లెపోగు శ్రీనివాస్, రామస్వామి, కిరణ్ కుమార్, సిహెచ్ మంజుల, ఇమ్మడి పురుషోత్తం, వెంకటేష్ గౌడ్, శాంతి కుమార్ , యాంకి రమేష్ పాల్గొన్నారు.

# జీవో 282పై భగ్గుమన్న కార్మిక సంఘాలు

## తక్షణమే రద్దు చేయాలి

## కార్మిక సంఘాల ప్రతుల దగ్ధం.. నిరసన




**మహబూబ్ నగర్, జూలై 7(మనం బ్యూరో)**: ఎనిమిది గంటల పనికి బదులు 10 గంటలకు పనివేళలా సమయం పెంచుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక శాఖ దొడ్డిదారిన తెచ్చిన జీవో నెంబర్ 282ను తక్షణమే రద్దు చేయాలని వామపక్ష కార్మిక సంఘాల నేతలు డిమాండ్ చేశారు. జీవో నెంబర్ 282పై వామపక్ష కార్మిక సంఘాలు బగ్గుమన్నాయి. సోమవారం మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం ఎదుట ఏఐటీయూసీ సిఐటియు,టియుసిఐ,టిఎన్టియుసి సంఘాల ఆధ్వర్యంలో పనివేళల పెంచుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 282 ప్రతులను దహనం చేసి నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి పి.సురేష్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్, కురుమూర్తి,టియుసిఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు సి.వెంకటేష్,టిఎన్టియుసి జిల్లా నాయకులు ధన్వాడ రాములు మాట్లాడుతూ:-నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు,నాలుగు లేబర్ కోడ్ ల రద్దుకై దేశవ్యాప్తంగా జరుగుతున్న సార్వత్రిక సమ్మె ఆందోళనలో కాంగ్రెస్ మద్దతు ఇస్తూనే తెలంగాణలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం దొడ్డి దారిన కార్పొరేట్ యాజమాన్యాలకు అనుకూలంగా చీకటి ఒప్పందాలతో కార్మిక వర్గం శ్రమ దోపిడికి పని భారానికి గురిచేస్తూ ఎనిమిది గంటల పని వేళల నుండి 10 గంటల పని వేళల సమయానికి పెంచుతూ 282 జీవో నెంబర్ ను లేబర్ శాఖతో విడుదల చేయించడం అత్యంత దుర్మార్గమని అన్నారు. ఆనాడు 8 గంటల పని దినాలకై చికాగో నగరంలో జరిగిన కార్మిక వర్గ వీరోచిత పోరాట రక్తార్పణంతో ఎనిమిది గంటల పని దినం సాధించుకోవడం జరిగిందని. బ్రిటిష్ కాలం నుండే 8 గంటలు విధానం కొనసాగుతుండగా నేడు అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం 12 గంటలకు పెంచుతూ లేబర్ కోడ్ లు తెచ్చిందని దీనిని కాంగ్రెస్ ప్రభుత్వం బయటికి వ్యతిరేకిస్తున్నట్లు కనిపిస్తున్న చివరికి మోడీకి అనుకూలంగా 10 గంటల విధానం అమలు చేయడంతోనే కార్మిక వర్గంపై రాష్ట్ర ప్రభుత్వానికి ఏమాత్రం చిత్తశుద్ధి ఉందో అర్థమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. 282 జీవోలు వారంలో 48 గంటలు మించరాదని పొందుపరిచారని కానీ క్షేత్ర స్థాయిలో అమలు జరగదని యాజమాన్యం కార్మికులపై ఒత్తిడి తీసుకొచ్చి పని భారం మోపే ప్రమాదం ఉన్నదని అన్నారు.

కార్మికులపై చిత్తశుద్ధి ఉంటే వారంలో 48 గంటలు పని గంటలు అంటే శని ఆదివారాలు సెలవు దినాలుగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం పునరాలోచించి 20082 జీవోలు తక్షణమే రద్దు చేయాలని కార్మిక వర్గానికి కనీస వేతనం 26వేలకు పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లేనిచో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధమవుతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి ఏ. రాములు మద్దతిస్తు పాల్గొని ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై ప్రసంగించారు.ఏఐటీయూసీ, సిఐటియు, టియుసిఐ, టిఎన్టియుసి నేతలు,శ్రేణులు, గోపాల్ నాయక్,మొగులన్న, చంద్రకాంత్, రాజు కుమార్, రంగయ్య కామేశ్వర్,,బుచ్చన్న, దేవానంద్,బాలు, యాదయ్య,సాయి ప్రకాష్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు డి.రాము తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణికి 104 ఫిర్యాదులు

- సత్వరమే పిర్యాదులను పరిష్కరించాలి
- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్



**మహబూబ్ నగర్, జూలై 7, (మనం బ్యూరో)**: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 104 ఫిర్యాదులు అందాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ తో పాటు రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్,లకు అర్జీలు సమర్పించారు. కాగా, ఫిర్యాదులను పెండింగ్ లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలన జరుపుతూ, సమస్యలను సత్వరమే పరిష్కరించాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమన్వయ సమావేశం లో వివిధ అంశాలపై సూచనలు చేశారు. వర్షాకాలంలో వన మహోత్సవం కార్యక్రమం లో బాగంగా మొక్కలు నాటేందుకు సంబంధిత అధికారులు నిర్ణయించిన లక్ష్యం మేరకు ఈ నెల 10వ తేది లోగా వంద శాతం గుంతలను తీసి సిద్ధంగా ఉంచాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ పాఠశాలలు, కేజీబీవీలు, రెసిడెన్షియల్ పాఠశాలల్లో మండల ప్రత్యేక అధికారులు తనిఖీలు నిర్వహించి నిర్దేశించిన యాప్ లో అప్లోడ్ చేయాలని ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్లో ఉన్న కోర్టు కేసులకు సంబంధించిన వివరాలను సమర్పించాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.ఈ ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# భవిష్యత్తు బాగు కోసం సమయం వృధా చేయకండి

## ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి




**మహబూబ్ నగర్, జూలై 7(మనం న్యూస్)**: భవిష్యత్తు బాగు కోసం ఎవరూ సమయం వృధా చేయకండి అని మహబూబ్ నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు.. సోమవారం ఎమ్మెల్యే తన సొంత నిధులతో మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు 75 రోజుల పాటు స్థానిక అంబేద్కర్ కళాభవన్ లో హైదరాబాద్ ఫ్యాకల్టీ చేత ప్రత్యేక ఉచిత కోచింగ్ పొందిన వారికి ఎమ్మెల్యే గారు స్టడీ మెటీరియల్స్ ను క్యాంపు కార్యాలయంలో అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుముందు ఆయన మాట్లాడుతూ తాను ఎమ్మెల్యే అయినా వెంటనే మహబూబ్ నగర్ ను ఎడ్యుకేషనల్ హబ్ గా అభివృద్ధి చేయాలనే సంకల్పం తీసుకున్నానని అన్నారు. ఈ ప్రాంతానికి చెందిన ఎందరో వివిధ ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్ లలో ఉన్నత స్థానంలో నిలిచారని, మీరు కూడా వారి అడుగుజాడల్లో పయనించాలని సూచించారు. ఇప్పటికే టెట్ డిఎస్సీ పరీక్ష కోసం ఉచిత కోచింగ్ ఇచ్చామని, వారందరూ మంచి ఫలితాలు సాధిస్తారనే నమ్మకం ఉందన్నారు. గత పది సంవత్సరాలుగా ఎలాంటి ఉద్యోగ నోటిఫికేషన్లు రాలేదని, ఇప్పుడు మనం ఉద్యోగాలు ఇస్తుంటే కోర్టులో కేసులు వేస్తున్నారని, గ్రూప్ వన్ కూడా వారు చేసిన నిర్వాకం కారణంగా కోర్టులో పెండింగ్ లో ఉందన్నారు. నీళ్ళు, నిధులు, నియామకాల కోసమే తెలంగాణ రాష్ట్రం తెచ్చుకున్నామని, కానీ గత ప్రభుత్వం అలసత్వం వల్ల ఏ ఒక్క ఆశయం నెరవేరలేదని వాపోయారు.

చదువు మనలను నిలబెట్టి, మంచి జీవితాన్ని ఇస్తుందన్నారు. ఎప్పటికీ చదువుకు ఎక్స్పైరీ ఉండదనీ అన్నారు. నోటిఫికేషన్లు వచ్చేంతవరకు వేచి చూడకుండా ముందుగానే పోటీ పరీక్షలకు సిద్ధం కావాలని, ఇది పోటీ ప్రపంచం అనే విషయాన్ని ఎవరూ మరచిపోరాదని, ఒక్క ఉద్యోగానికి వేల సంఖ్యలో పోటీదారులు ఉంటారని వారందరిని అధిగమించి మీరు ఉద్యోగం సాధించాలన్నారు. సీరియస్ నెస్ తో చదివితేనే ఫలితం సాధ్యమని ఆయన స్పష్టం చేశారు. తెలిపారు. కేవలం ప్రభుత్వ ఉద్యోగం వస్తేనే జీవితంలో స్థిరపడ్డట్లు కాదని , త్వరలో రెవెన్యూ , పోలీసు శాఖలో ఉద్యోగాలు భారీగా వచ్చే అవకాశం ఉందని, ప్రభుత్వ శాఖల్లో ఎక్కడ ఖాళీలు ఉన్నా , నోటిఫికేషన్ల ద్వారానే ఉద్యోగాలు భర్తీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రైవేటు సెక్టార్ లో సైతం ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని అందిపుచ్చుకోవాలి అని ఆయన సూచించారు. మహబూబ్ నగర్ ఫస్ట్ ఆధ్వర్యంలో కోచింగ్ పొందిన మీరందరూ ఉద్యోగాలు సాధించి జీవితంలో స్థిరపడాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మహబూబ్ నగర్ ఫస్ట్ పర్యవేక్షకులు గుండా మనోహర్, నాని యాదవ్, సిజె బెనహార్, మాజీ కౌన్సిలర్ అంజద్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రీవెన్స్ డే లోని ఫిర్యాదుల బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి



- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

**జగిత్యాల జూలై 7 (మనం ప్రతినిధి)**: గ్రీవెన్స్ డే లోని ఫిర్యాదుల బాధితులకు సత్వర న్యాయం జరిగేలా చూడాలి అని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 11 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా ఎస్పీ సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని ఎస్పీ తెలిపారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలి

- జిల్లా ఎస్పీ అశోక్ కుమార్




**జగిత్యాల, జూలై 7 ( మనం ప్రతినిధి)**: రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో కృషి చేయాలని జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ అన్నారు. సోమవారం జిల్లా లో జరుగు రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా కలెక్టర్ కార్యాలయం లో జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, అదనపు కలెక్టర్ లత ఆధ్వర్యంలో జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతోంది అన్నారు. జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణకు జిల్లా స్థాయిలో ఒక ఇన్స్పెక్టర్ స్థాయి అధికారి ఆధ్వర్యంలో డిస్ట్రిక్ట్ ట్రాఫిక్ అనాలసిస్ బ్యూరో ని ప్రారంభించి ఇతర శాఖల అధికారులను సమన్వయం చేసుకుంట రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రమాదాల నివారణ తగు చర్యలు తీసుకోవాల్సిందిగా అధికారులను ఆదేశించారు. రోడ్డు ప్రమాదాలు పూర్తిగా నివారించాల్సిన అవసరం ఉందని అందులో బాగంగా జాతీయ రహదారి పై ఉన్న అన్ని గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదే విదంగా హైవేలపై జరిగే యాక్సిడెంట్ లకు సంబంధించి ఫస్ట్ రెస్పాండర్స్ గా ఉండేందుకు హైవేలపై ఉన్న పెట్రోల్ బంక్ వారికి, ధాబాలో పనిచేసే వారికి, యూత్ ,విలేజెస్, కి ఫస్ట్ ఎయిడ్ మరియు సిపిఆర్ పై అవగాహన కలిగించాలని అధికారులకు సూచించారు. జిల్లా లో ఉన్న 43 బ్లాక్ స్పాట్స్(ప్రమాదాలు అధికముగా జరుగు ప్రదేశాలు) ను పంచాయతీ రాజ్ మరియు ఆర్ అండ్ బి ప్రభుత్వ శాఖల సమన్వయంతో ప్రమాదాల నివరణ పై దృష్టి సారించాలని అన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ బిఎస్ లతా గారు మాట్లాడుతూ జిల్లాలో రోడ్డు ప్రమాదాల కారణంగా ఏ ఒక్కరూ వైకల్యం బారిన పడకుండా, ప్రాణాలు కోల్పోయే పరిస్థితులు లేకుండా రహదారి ప్రమాదాలు సంభవించకుండా రోడ్డు భద్రతా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ గారు అధికారులను ఆదేశించారు. రోడ్డు కండిషన్ లో లేకపోవడం, సైనేజ్ బోర్డులు,అవసరమైన చోట స్పీడ్ బ్రేకర్ లు లేకపోవడం వల్ల అక్కడక్కడ ప్రమాదాలు జరుగుతున్నాయన్నారు. సంబంధిత ఇంజనీరింగ్ శాఖలు అలాంటి ప్రదేశాలను గుర్తించి వెంటనే అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు.అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తూ రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆర్టీఓ లు డిఎస్పీలు మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులు , ఇతర సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలనలో రైతు కంట కన్నీరు

## మాజీ ఎమ్మెల్యే, జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్




**గోదావరిఖని, జూలై 07 (మనం న్యూస్)**: కాంగ్రెస్ పాలనలో పంట పోలాలకు సాగునీరు అందక రైతులు అష్ట కష్టాలు పడుతున్నారు. రేవంత్ సర్కార్ రైతులను అరిగోస పెడుతూ వారి కళ్లలో కన్నీరు నింపుతున్నారని, కన్నెపల్లి పంప్ హౌజ్ నుండి నీళ్లను ఎత్తిపోసి పంటపోలాలకు సాగునీరు అందించాలని లేదంటే నీళ్ల కోసం మరో ఉద్యమం చేస్తామని రామగుండం మాజీ శాసనసభ్యుడు,పెద్దపల్లి జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు కోరుకంటి చందర్ హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం గోదావరిఖని ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వ హాయంలో ఎంతో గొప్పగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం చేసి ప్రతి ఎకరాకు సాగునీరు అందించారని గుర్తు చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులో రెండు ఫిలర్లు కుంగాయని సాకుచూపి ఇప్పటికీ వరకు ఏలాంటి మరమత్తులు చేయడంలేదన్నారు. కేవలం కేసీఆర్ ను బదనాం చేయడానికే బిఆర్ఎస్ పార్టీపై బురద చల్లడానికి రైతులకు సాగునీరు అందించక ఇబ్బందులు పెడుతున్నరని ఆరోపించారు. కన్నెపల్లి పంప్ హౌజ్ నుండి పంపింగ్ మెదలుపెట్టి సుందిళ్ల అన్నారం బ్యారేజీలో నీటిని నిల్వ చేయాలని లేదంటే మరో ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. సింగరేణి సంస్దను పైవేటీకరణ చేసేందుకు కుట్రలు చేస్తున్నరని, ఈ నెల 9న కార్మిక సంఘాల జేఏసి తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మేకు బిఆర్ఎస్ పార్టీ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు ఆయన ప్రకటించారు. ఈ విలేఖరుల సమావేశంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గోపు అయులయ్య యాదవ్, నడిపెల్లి మురళీధర్ రావు, బోడ్డు రవీందర్, నారాయణదాసు మారుతి, నీరటి శ్రీనివాస్, పిల్లి రమేష్, మేతుకు దేవరాజ్, నూతి తిరుపతి, సట్టు శ్రీనివాస్, దొమ్మేటి వాసు, ఇరుగురాళ్ల శ్రావన్, జిట్టవేన ప్రశాంత్, బుర్ర వెంకటేష్, కొడి రామకృష్ణ, ఆవునూరి వెంకటేష్, చింటూ, యాసర్ల తిమోతి, రామరాజు, కిరణ్, నిమ్మరాజుల రాజు, బచ్చాల రాములు, కర్రీ ఓదేలు, రాయమల్లు, పాల్గొన్నారు.

# బాధితులకు తక్షణ న్యాయం అందించడమే లక్ష్యంగా గ్రీవెన్స్ డే



- జిల్లా ఎస్పీ డి. జానకి

**మహబూబ్ నగర్, జూలై 7(మనం బ్యూరో)**: ప్రజల సమస్యలకు చట్టపరమైన పరిష్కారాలు కల్పించేందుకు జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న గ్రీవెన్స్ డే కార్యక్రమం ఓ విశ్వసనీయ వేదికగా మారుతోంది. జిల్లా ఎస్పీ డి.జానకి ఆధ్వర్యంలోసోమవారం జరిగిన గ్రీవెన్స్ డే కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన పౌరుల నుండి మొత్తం 12 ఫిర్యాదులు స్వీకరించబడినట్లు తెలియజేశారు.ప్రతి ఫిర్యాదును సవివరంగా పరిశీలించి సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులను ఫోన్ ద్వారా సంప్రదించి, బాధితుల సమస్యలను వేగంగా, చట్టపరంగా పరిష్కరించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పోలీసు సేవలు ప్రజలకు మరింత చేరువ కావాలి. ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను ప్రామాణికంగా స్వీకరించి, అవసరమైతే క్షేత్ర స్థాయిలో పరిశీలించి, బాధితులకు తక్షణ న్యాయం అందించాలన్నదే మా ఉద్దేశమని చెప్పారు. ప్రతి ఫిర్యాదు ఆన్లైన్లో నమోదు చేయబడి, వాటి పరిష్కార స్థితిని క్రమం తప్పకుండా సమీక్షిస్తూ, ఫిర్యాదుదారులకు సమర్థవంతమైన సేవలు అందించేందుకు పోలీసు శాఖ కృషి చేస్తోందని తెలిపారు. ప్రజలు తమ సమస్యలను నేరుగా అధికారుల దృష్టికి తీసుకురావడానికి గ్రీవెన్స్ డే వేదికగా నిలుస్తోందని, వీలైనంత త్వరగా పరిష్కారం చూపించేందుకు పోలీసు యంత్రాంగం కట్టుబడి పనిచేస్తోందని తెలిపారు.

# సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి పటిష్ట చర్యలు

- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష



**పెద్దపల్లి, జూలై 07 (మనం ప్రతినిధి)**: సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణానికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నామని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో పీఎం కుసుమ్ పథకం అమలు పై సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, పిఎం కుసుమ్ పథకం క్రింద రైతులు లేదా రైతు సహకార సంఘాలు వారి భూమిలో 500 కిలో వాట్ల నుంచి 2 మెగావాట్ల వరకు సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ సంస్థలకు ఉత్పత్తి చేసిన విద్యుత్తు ను అమ్మడం ద్వారా నెల నెలా ఆదాయం పొందవచ్చని తెలిపారు. మన జిల్లాలో 4 రైతు సహకార సంఘాల ద్వారా పీఎం కుసుమ్ సోలార్ విద్యుత్ ప్లాంట్ ఏర్పాటు ఒప్పందాలు పూర్తి చేసుకున్నామని తెలిపారు. 9 నెలల కాలంలో 4 చోట్ల 1 మెగా వాట్ చెప్పిన సోలార్ విద్యుత్తు ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణం పూర్తి చేయాలని, ఇక్కడ ఉత్పత్తి చేసే విద్యుత్తు ఎన్.పి.డి.సి.ఎల్ కు విక్రయించడం జరుగుతుందని అన్నారు. టీజీ రెడ్కో నోడల్ ఏజెన్సీ సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం జరుగుతుందని అన్నారు. మార్కెట్ లో తక్కువ ఖర్చుతో సోలార్ విద్యుత్ ప్లాంట్ నిర్మాణం చేసేందుకు గల అవకాశాలను పరిశీలించి నివేదిక అందించాలని కలెక్టర్ తెలిపారు. నాణ్యత అంశంలో రాజీ పడకుండా చూడాలని, టాప్ 10 కంపెనీల ప్రతినిధులతో ఏర్పాటు చేసే కార్యాచరణ తయారు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఆసక్తి గల కంపెనీల నుంచి టెండర్లు ఆహ్వానించి, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణం, నిర్వహణ కు ఒప్పందం చేసుకోవాలని, ఈ ప్రక్రియ కు పకడ్బందీ మార్గదర్శకాల తయారు చేయాలని అన్నారు. సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణం కోసం భూమి లెవెలింగ్ పనులు ప్యాక్స్ పూర్తి చేయాలని అన్నారు. విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణం కోసం నాబార్డు ద్వారా రుణాలు అందిస్తామని అన్నారు. పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం క్రింద ఇంటి పై సోలార్ విద్యుత్ ప్యానల్ ఏర్పాటు చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒకే కాలనీలో వందల మంది లబ్ధిదారులు ఇంటి పై ప్యానెల్స్ ఏర్పాటు ముందు వస్తే కలెక్టరేట్ నుంచి అదనంగా 10 వేల రూపాయల సబ్సిడీ అందిస్తానని కలెక్టర్ హామీ ఇచ్చారు. జూలై నెలాఖరు వరకు పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజిలి యోజన పథకం క్రింద ఆసక్తి గల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో రెవెన్యూ డివిజన్ అధికారి బి.గంగయ్య, జిల్లా సహకార అధికారి శ్రీమాల, సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# కామారెడ్డి సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు

**రాష్ట్ర రోడ్లు భవనాలు ,సినిమాటోగ్రఫీశాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి**

**100 పడకల ఆసుపత్రి, ట్రామా సెంటర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలి**

**విద్యుత్ సరఫరా సజావుగా సాగేందుకు అవసరమైన సబ్ స్టేషన్ల నిర్మాణం**

**పెండింగ్ సాగునీటి ప్రాజెక్టు పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి**




కామారెడ్డి, జూలై 07 ( మనం జిల్లా ప్రతినిధి ): కామారెడ్డి జిల్లా సమగ్రాభివృద్ధికి పటిష్ట చర్యలు ప్రభుత్వం తీసుకుంటుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీశాఖ మంత్రివర్యులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. సోమవారం మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గంలో పర్యటించి స్థానిక ఎంపీ సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు, నారాయణ్ ఖేడ్ ఎమ్మెల్యే పటోళ్ళ సంజీవ్ రెడ్డి లతో కలిసి పలు రోడ్డు నిర్మాణ, అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేసారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి జిల్లా పర్యటన సందర్భంగా పూల మొక్క అందజేసి జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ ఘన స్వాగతం పలికారు. జుక్కల్ నియోజకవర్గం మద్దెలచెరువు - పిట్లం రోడ్,తిమ్మ నగర్ వద్ద 4 కోట్ల 86 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన హై లెవల్ బ్రిడ్జ్ ను మంత్రి ప్రారంభించారు. బిచ్కుంద నుంచి డోంగ్లీ వరకు 13 కోట్ల 20 లక్షల రూపాయలతో చేపట్టిన రొడ్డు పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం స్థానిక ఎమ్మెల్యే లక్ష్మి కాంతారావు క్యాంపు కార్యాలయంలో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పలు అభివృద్ధి సంక్షేమ పథకాల పై కలెక్టర్, పలు ఉన్నతాధికారులతో కలిసి మంత్రి సమీక్ష నిర్వహించారు. విద్యుత్ లైన్ సమస్యలు, సాగు నీటి ప్రాజెక్టులు, వైద్య ఆరోగ్య సేవలు, వ్యవసాయం, ఇందిరమ్మ ఇండ్ల పురోగతి, మిషన్ భగీరథ త్రాగు నీటి సరఫరా, అటవీ భూముల ఆక్రమణల, మహిళా సంఘాలకు రుణాలు వంటి పలు అంశాలను మంత్రి సుదీర్ఘంగా సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మాట్లాడుతూ., జిల్లాలో విద్యుత్ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని, పెరుగుతున్న విద్యుత్ డిమాండ్ అనుగుణంగా అదనపు సబ్ స్టేషన్ లు నిర్మించాలని, వీటి నిర్మాణానికి అనువైన భూములను ఎంపిక చేసి ప్రతిపాదనలు సమర్పించాలని, డిప్యూటీ ముఖ్యమంత్రితో చర్చించి వెంటనే సబ్ స్టేషన్ మంజూరు అయ్యేలా కృషి చేస్తానని అన్నారు. నీటి పారుదల ప్రాజెక్టు సంబంధించి పెండింగ్ కాల్వ నిర్మాణ పనులు, అవసరమైన భూ సేకరణ పనుల పరిపాలన అనుమతులు మంజూరు చేయాలని అన్నారు. సంగమేశ్వర, బసవేశ్వర ఎత్తిపోతల పథకాల పై నివేదిక అందించాలని అన్నారు. పెండింగ్ యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని అవసరమైన ప్రతిపాదనలు జూలై 9 నాటికి అందిస్తే తదుపరి క్యాబినెట్ సమావేశంలో ఆమోదం పొందుతుందని ఆయన తెలిపారు. కామారెడ్డి జిల్లా మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్ర ల బోర్డర్ రిమోట్ ఏరియా ఉందని, కావున ఇక్కడ 100 బెడ్ ల ఆసుపత్రికి ప్రతిపాదనలు పంపించాలని అన్నారు. జాతీయ రహదారి దగ్గర ట్రామా సెంటర్ అవసరం ఉందని , హైవే సమీపంలోని ఆసుపత్రిలో ట్రామా సెంటర్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. సన్న రకం ధాన్యం,కూరగాయలు, ఆయిల్ పామ్ వంటి లాభసాటి పంటల సాగు పై రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి సూచించారు. సేంద్రియ వ్యవసాయం పెరిగే విధంగా చూడాలని ఎరువుల వాడకం తగ్గించాలని అప్పుడే భూసారం కాపాడుకోగలుగుతామని అన్నారు. వ్యవసాయ విస్తరణ అధికారులు క్రాప్ బుకింగ్ పకడ్బందీగా చేయాలని, వాస్తవ పరిస్థితులకు రికార్డులకు చాలా తేడా ఉంటుందని, భవిష్యత్తులో ఇలా జరగడానికి వీలు లేదని అన్నారు. వ్యవసాయ పనిముట్లు సబ్సిడీ యూనిట్ల పట్ల రైతులకు అవగాహన కల్పించాలని మంత్రి పేర్కొన్నారు. డి.ఎం.ఎఫ్.టీ నిధులను ఆసుపత్రిలో అవసరమైన వైద్య పరికరాలకు కొనుగోలు, పాఠశాలలో మౌలిక వస్తువులు కల్పనకు వినియోగించాలని మంత్రి కలెక్టర్ కు సూచించారు.త్రాగునీటి సమస్య లేకుండా అవసరమైన అదనపు పైప్ లైన్, బోర్ వెల్స్ పనులకు సర్వే నిర్వహించాలని మిషన్ భగీరథ అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్లు దశల వారిగా అర్హులందరికీ అందుతాయని అన్నారు. జిల్లాలో మంజూరు చేసిన ఇందిరమ్మ ఇండ్లు త్వరగా గ్రౌండ్ చేసి నిర్మాణ పనులు ప్రారంభమయ్యేలా చూడాలని అన్నారు. 5 లక్షల రూపాయల 4 దశలలో లబ్ధిదారుల ఖాతాలలో గ్రీన్ ఛానల్ ద్వారా జమ చేయడం జరుగుతుందని అన్నారు. మహిళా



సంఘాలకు వడ్డీ లేని రుణాలు లక్షల మేరకు అందించాలని మంత్రి తెలిపారు. జిల్లాలో తదుపరి అటవీ భూముల ఆక్రమణ జరగకుండా జాగ్రత్త వహించాలని అన్నారు. పోడు భూములు సాగు చేసుకుంటున్న గిరిజనులకు ఇబ్బందులు కలిగించ వద్దని అన్నారు. అటవీ ప్రాంతంలో పాత రోడ్డు మరమ్మత్తు, పునః నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని అన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ అశిష్ సంగ్వాన్ మాట్లాడుతూ., మంత్రి ఆదేశాల మేరకు ఆస్పత్రి నిర్మాణానికి సంబంధించి ప్రతిపాదన సమర్పిస్తామని అన్నారు. ప్రభుత్వ ఆలోచన ప్రకారం మహిళా సంఘాల ద్వారా క్యాంటీన్ పెట్రోల్ బంక్ రైస్ మిల్ వంటి ఏర్పాటుకు ప్రణాళిక సిద్ధం చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ కిరణ్మయి, జాయింట్ కలెక్టర్ విక్టర్, జిల్లా అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చీకోటి మనోజ్ కుమార్, నిజాంసాగర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఏలే మల్లికార్జున్, ఇతర ప్రజా ప్రతినిధులు అధికారులు పాల్గొన్నారు.

## 4.86 కోట్లతో నిర్మించిన హైలెవెల్ వంతెనను ప్రారంభించిన మంత్రి



**కామారెడ్డి, జూలై 07 ( మనంప్రతినిధి):** రాష్ట్రంలో రోడ్ల నిర్మాణాలకు అధికమొత్తంలో నిధులిస్తున్నామని రోడ్ల భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కామారెడ్డి జిల్లా పిట్లం మండలం మద్దెల చెరువు రోడ్డు, తిమ్మానగర్ వద్ద ఎఫ్డీఆర్ నిధులు రూ. 4.86 కోట్లతో నిర్మించిన హైలెవెల్ వంతెనను సోమవారం ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ., రాష్ట్రంలో గ్రామీణ రోడ్లను మెరుగుపర్చాలనే కృతనిశ్చయంతో రేవంత్‌రెడ్డి సర్కారు ముందుకు వెళ్తుందన్నారు. కార్యక్రమంలో ఎంపీ సురేశ్ షెట్కార్, ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు, నారాయణఖేడ్ ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, బాన్సువాడ సబ్ కలెక్టర్ కిరణ్మయి తదితరులు పాల్గొన్నారు. జిల్లాకు వచ్చిన రోడ్లు భవనాల శాఖ సినిమాటోగ్రాఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి కాంగ్రెస్ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. మండలంలోని నర్సింగ్రావు పల్లి చౌరస్తా వద్ద ఎంపీ, ఎమ్మెల్యేలు, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌తో పాటు జుక్కల్ నియోజకవర్గంలోని పలు మండలాలకు చెందిన నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

# పురుగుల అన్నం పెడుతున్నారని విద్యార్థినుల నిరసన

- **పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్**



**కామారెడ్డి, జూలై 07 ( మనం ప్రతినిధి):** పురుగుల అన్నం పెడుతున్నారని నిరసిస్తూ విద్యార్థినులు ఆందోళనకు దిగారు. ఎల్లారెడ్డి గిరిజన బాలికల గురుకుల పాఠశాల విద్యార్థినులు సోమవారం ఎల్లారెడ్డి - బాన్సువాడ ప్రధాన రహదారిపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్నం తినేటప్పుడు తరచుగా పురుగులు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై పలుమార్లు ప్రిన్సిపల్, అధ్యాపకుల దృష్టికి తీసుకు వెళ్లినప్పటికీ వారు ఏమాత్రం పట్టించుకోవడంలేదని వాపోయారు. తప్పని పరిస్థితుల్లో తాము రోడ్డెక్కి నిరసన తెలుపుతున్నామని విద్యార్థినులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. విద్యార్థినుల నిరసనతో ఎల్లారెడ్డి - బాన్సువాడ ప్రధాన రహదారిపై వాహనాలు భారీగా నిలిచిపోయాయి. ఎల్లారెడ్డి తహశీల్దార్ ప్రేమ్ కుమార్ రోడ్డుపై బైఠాయించిన విద్యార్థినులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళనను విరమించారు.

**పాఠశాలను సందర్శించిన అదనపు కలెక్టర్..**

అనంతరం గిరిజన బాలికల పాఠశాలను జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విక్టర్ పాఠశాలను సందర్శించారు. విద్యార్థినుల రాస్తారోకో విషయాన్ని తెలుసుకున్న ఆయన పాఠశాలకు వచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో మాట్లాడారు. పాఠశాలలోని డైనింగ్ హాల్, స్టాక్ రూమ్, వాష్ రూమ్‌లను పరిశీలించారు. విద్యార్థుల సమస్యలను సావధానంగా విన్న ఆయన త్వరలోనే పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహశీల్దార్ ప్రేమ్ కుమార్, మున్సిపల్ కమిషనర్ మహేష్, ఎంఈవో రాజులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలి

- **కామారెడ్డి జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్**

**కామారెడ్డి, జూలై 07 ( మనంప్రతినిధి):** ప్రజావాణి ఆర్జీలను సత్వరమే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ చందర్ అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా ఐడిఓసి లోని సమావేశ మందిరంలో కామారెడ్డి ఆర్డిఓ వీణ తో కలిసి ప్రజలండి వివిధ సమస్యలపై అర్జీలు స్వీకరించారు. ఈరోజు ప్రజావాణి కార్యక్రమానికి 107 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ., ప్రజావాణి ఆర్జీలను ఎప్పటికప్పుడు పరిశీలించి శనివారంలోగా దరఖాస్తులను పరిష్కరించి ఆర్జి దారులకు న్యాయం



చేయాలనిఅన్నారు. ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది

- **స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్**



**కామారెడ్డి, జూలై 07 ( మనం ప్రతినిధి):** మహిళల ఆర్థికాభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ చందర్ నాయక్ అన్నారు. కామారెడ్డి పట్టణంలోని మహిళా సమాఖ్య భవనంలో మహిళా శక్తి ప్రగతిపై సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ., ఇప్పటివరకు సంఘాలలో లేని 8,800 మంది మహిళలను గుర్తించి సంఘాలలో చేర్పించడం జరిగిందన్నారు. మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళా సంఘ సభ్యులతో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు యూనిఫామ్స్ కుట్టించడం ద్వారా వారికి ఉపాధి కల్పించడం జరిగిందన్నారు. 183 వరిధాన్యం కొనుగోలు కేంద్రాలు మహిళా సంఘాలకు అప్పగించి.. వారి ద్వారా రూ.3కోట్ల విలువ గల ధాన్యం కొనుగోలు చేయడం జరిగిందన్నారు. పాడి గేదెలు, మదర్ యూనిట్స్, పెరటి కోళ్ల పెంపకం, పాల ఉత్పత్తుల కేంద్రాలు, మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ ప్లాంట్లు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మహిళా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లా మహిళా సమాఖ్య భవన నిర్మాణం కోసం రూ.5 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. ప్రస్తుతం భవనం నిర్మాణంలో ఉందని చెప్పారు. 2025-26 సంవత్సర కార్యచరణ ప్రణాళికలో భాగంగా పెట్రోల్ బంకులు, గోదాములు, రైస్ మిల్లులు, ఆర్టీసీ బస్సుల నిర్వహణ మహిళా సంఘాలకు అప్పగించే యోచనలో ప్రభుత్వం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్డీవో సురేందర్, అదనపు డీఆర్డీవో విజయలక్ష్మి, డీపీఎంలు, స్త్రీనిధి ఆర్ఎం, ఏపీఎంలు, జిల్లా సమాఖ్య అధ్యక్షురాలు పుష్ప, కార్యదర్శి, రాజమణి, కోశాధికారి లక్ష్మి, ఆయా మండల సమాఖ్యల అధ్యక్షులు పాల్గొన్నారు.

## జాతీయం- అంతర్జాతీయం

# ‘మండీని వదిలేసి టెక్సాస్ వరదలపై విచారమా!’

### మోదీపై కాంగ్రెస్ విమర్శలు



ఢిల్లీ, జూలై 7: ప్రధాని నరేంద్ర మోడీపై కాంగ్రెస్ సీనియర్ నేత పవన్ ఖేరా తీవ్ర విమర్శలు చేశారు. అమెరికాలోని టెక్సాస్‌లో వరదలపై ప్రధాని విచారం వ్యక్తం చేయడాన్ని తప్పుబట్టారు. హిమాచల్ ప్రదేశ్‌లోని మండిలో వరదల కారణంగా జరుగుతున్న ప్రాణ నష్టం, విధ్వంసంపై ఒక్క మాట కూడా మాట్లాడని మోడీ.. అమెరికాలో వస్తున్న వరదలపై మాత్రం విచారం వ్యక్తం చేస్తున్నారని మండిపడ్డారు. ‘‘హిమాచల్ ప్రదేశ్‌లో వర్షాలు సృష్టిస్తున్న బీభత్సం వల్ల 70కిపైగా ప్రజలు ప్రాణాలు కోల్పోయారు. కొండచరియలు విరిగిపడి ఇళ్లు ధ్వంసం కావడంతో వందల మంది నిరాశ్రయులయ్యారు. ఇంత విధ్వంసం జరిగినా ప్రధాని మోడీ అక్కడి ప్రజలకు ధైర్యం కలిగించేలా ఒక్క మాట కూడా మాట్లాడలేదు. టెక్సాస్ వరదలపై మాత్రం విచారం వ్యక్తం చేస్తున్నారు. విదేశీయుల జీవితాల కంటే భారత ప్రజల జీవితాలు అంత చులకనగా మారాయా? ప్రజలపై చూపించే జాలి కూడా రాజకీయంగా మారిపోయిందా?’’అంటూ పవన్ ఖేరా ప్రధానిని ప్రశ్నించారు.

టెక్సాస్‌లో సంభవించిన వరదల కారణంగా అక్కడి ప్రజలు, ముఖ్యంగా పిల్లలు ప్రాణాలు కోల్పోవడం తనను తీవ్రంగా బాధించిందని పేర్కొంటూ ప్రధాని మోడీ ఇటీవల సోషల్ మీడియా వేదికగా పోస్టు చేశారు. అమెరికా ప్రభుత్వానికి, మృతుల కుటుంబాలకు సంతాపం తెలియజేశారు. కాగా గత కొన్ని రోజులుగా హిమాచల్ ప్రదేశ్‌లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రాష్ట్రవ్యాప్తంగా ప్రధాన రహదారులపై కొండచరియలు విరిగిపడటం.. మెరుపు వరదలు, కుంభవృష్టితో పరిస్థితి దారుణంగా ఉంది. ఈ విషయంలో ప్రధాని స్పందించకపోవడం దారుణమని పవన్ ఖేరా ఆవేదన వ్యక్తం చేశారు.

# బ్రిక్స్ ఘర్షణ కోరుకోవట్లేదు

### ట్రంప్ ‘టారిఫ్’ బెదిరింపుపై చైనా స్పందన



**రియో డి జనీరో, జూలై 7:** బ్రిక్స్ అనుకూల దేశాలపై అదనపు టారిఫ్లు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన ప్రకటనపై చైనా స్పందించింది. బ్రిక్స్ గ్రూప్ ఘర్షణ కోరుకోవడం లేదని స్పష్టం చేసింది. ‘టారిఫ్ విధింపు విషయంలో మా స్పందనలో ఏ మార్పు లేదు. సుంకాల యుద్ధంలో విజేతలు ఉండరు. రక్షణాత్మక వైఖరితో ముందుకువెళ్లలేం’ అని చైనా పునరుద్ఘాటించింది.బ్రెజిల్ వేదికగా బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతున్నవేళ ట్రంప్ కీలక ప్రకటన చేశారు. ‘బ్రిక్స్‌లో అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే ఏ దేశానికైనా అదనంగా 10శాతం టారిఫ్లు విధిస్తాం. ఇందులో ఎలాంటి మినహాయింపులు ఉండవు’’ అని స్పష్టంచేశారు. ఈ సదస్సు సందర్భంగా భారత ప్రధాని మోదీ సహా పలువురు దేశాధినేతలు, ప్రతినిధులు అమెరికా విధానాలను ఉద్దేశిస్తూ సుంకాల అంశాన్ని వారు ప్రస్తావించినట్లు వార్తలు వచ్చాయి. ఈక్రమంలోనే ట్రంప్ స్పందన వచ్చినట్లు తెలుస్తోంది. వాణిజ్య సుంకాల విషయంలో ట్రంప్ కఠినంగా వ్యవహరిస్తోన్న సంగతి తెలిసిందే. కొన్నాళ్లక్రితం చైనా-అమెరికాల మధ్య సుంకాల యుద్ధం నడిచింది. తర్వాత రెండు అతిపెద్ద ఆర్థిక వ్యవస్థల మధ్య ట్రేడ్ డీల్ కుదరడంతో అది కొద్దిమేర సమసిపోయింది. ఇదిలాఉంటే.. బ్రిక్స్ దేశాలు డాలర్‌తో ఆటలు ఆడాలనుకుంటే తాము వాణిజ్యంతో వారికి చెక్ పెడతామని గతంలో ట్రంప్ బెదిరింపులకు పాల్పడిన సంగతి తెలిసిందే. ‘‘బ్రిక్స్ ఓ చెడ్డ ప్రతిపాదనను తీసుకొచ్చింది. చాలామందికి అది ఇష్టం లేదు. ప్రస్తుతం దానిపై మాట్లాడటానికి కూడా వారు వెనుకాడుతున్నారు. డాలర్‌తో ఆడుకోవాలనుకుంటే చర్యలు తీసుకుంటాననే నా హెచ్చరికతో వారు భయపడ్డారు. మాకు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటే.. ఆయా దేశాల దిగుమతులపై 100 శాతం సుంకాలు విధిస్తా. ఒకవేళ వారు అది చేయాలనుకుంటే.. టారిఫ్లు విధించవద్దని నా దగ్గరకు వచ్చి వేడుకుంటారు. నా బెదిరింపులతో బ్రిక్స్ అంతమైంది’’ అని వ్యాఖ్యలు చేశారు. బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాలతో ఏర్పడిన బ్రిక్స్ కూటమిలో ఈజిప్టు, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈలు ఆ తర్వాత చేరిన సంగతి తెలిసిందే.

## తుర్కియే సంస్థ ‘సెలెబి’కి ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురు



ఢిల్లీ, జూలై 7: తుర్కియేకి చెందిన సంస్థ ‘సెలెబి’కి ఢిల్లీ హైకోర్టులో చుక్కెదురైంది. దేశంలోని వివిధ విమానాశ్రయాల్లో భద్రతా పరమైన సేవలందిస్తున్న తమ సంస్థకు ‘పౌరవిమానయాన భద్రతా మండలి’ సెక్యూరిటీ క్లియరెన్స్ రద్దు చేయడాన్ని సెలెబి ఢిల్లీ హైకోర్టులో సవాల్ చేసింది. తాజాగా దీనిపై జరిగిన విచారణలో కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదిస్తూ.. దేశభద్రతను ప్రామాణికంగా తీసుకొని ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ నిర్ణయాన్ని సమర్థిస్తూ..న్యాయస్థానం ఆ పిటిషన్‌ను కొట్టేసింది.

జాతీయ భద్రతను దృష్టిలో ఉంచుకొని దేశంలోని వివిధ విమానాశ్రయాల్లో భద్రతా పరమైన సేవలందిస్తున్న తుర్కియే సంస్థ ‘సెలెబి’ ఏవియేషన్‌కు సెక్యూరిటీ క్లియరెన్స్‌ను బ్యూరో ఆఫ్ సివిల్ ఏవియేషన్ సెక్యూరిటీ రద్దు చేసింది. దీంతో సెలెబి ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించింది. ముందస్తు నోటీసు, తగిన కారణం లేకుండా బీసీఏఎస్ ఈ నిర్ణయం తీసుకుందని సెలెబి తరఫు న్యాయవాది పిటిషన్‌లో పేర్కొన్నారు. ఈ నిర్ణయం వల్ల దాదాపు 3,800 ఉద్యోగాలు ప్రభావితం అవుతాయని..అంతే కాకుండా భారత విమానయాన రంగంలో పెట్టుబడిదారుల విశ్వాసం దెబ్బతినే అవకాశం ఉంటుందని తెలిపారు.

# మస్క్ గాడి తప్పాడు.. కొత్త పార్టీ ప్రకటనపై ట్రంప్ ఫైర్



వాషింగ్టన్, జూలై 7: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ మధ్య మరోసారి వైరం నెలకొంది. అధ్యక్షుడు తీసుకొచ్చిన బిగ్ బ్యూటిఫుల్ బిల్లును బహిరంగంగా వ్యతిరేకించిన మస్క్ .. అన్నట్లుగానే కొత్త పార్టీని ప్రకటించారు. దీనిపై ట్రంప్ స్పందిస్తూ టెస్లా అధినేతపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆయన గాడితప్పారని, పార్టీ ప్రకటన హాస్యాస్పదమని మండిపడ్డారు. ఈ మేరకు తన ట్రూత్ ఖాతాలో సుదీర్ఘ పోస్ట్ చేశారు. ‘గత ఐదు వారాలుగా ఎలాన్ మస్క్ పూర్తిగా నియంత్రణ కోల్పోవడం విచారకరం. మా మధ్య బంధాన్ని దారుణంగా ముగించేస్థితికి ఆయన చేరుకున్నారు. అమెరికాలో మూడో రాజకీయ పార్టీ అనేది విజయవంతం కాదని, అలాంటి వ్యవస్థను అమెరికన్లు అంగీకరించరని చరిత్ర చెబుతోంది. అయినా కొత్త పార్టీని ప్రారంభించేందుకు సిద్ధమయ్యారు. రెండు పార్టీల వ్యవస్థను అనుసరిస్తున్న దేశంలో ఇలాంటి మూడో పార్టీ గందరగోళానికి, ఘర్షణలకు తావిస్తుంది’ అని ట్రంప్ ఆగ్రహం వ్యక్తంచేశారు.‘ప్రస్తుతం డెమోక్రాట్లలో విశ్వాసం సన్నగిల్లింది. రిపబ్లికన్ల ప్రభుత్వం సజావుగా నడుస్తోంది. ఇటీవల దేశ చరిత్రలోనే తొలిసారి ఓ భారీ బిల్లును ఆమోదించుకున్నాం. అది చాలా గొప్ప బిల్లు.. కానీ, మస్కుకు మాత్రం కాదు. ఎందుకంటే దానివల్ల మస్క్ కోరుకుంటున్న తప్పనిసరి ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం సాధ్యం కావట్లేదు. చాలా తక్కువ సమయంలో ప్రతిఒక్కరూ ఎలక్ట్రిక్ కారును కొనుగోలు చేయాలని ఆయన కోరుకుంటున్నారు. దీన్ని నేను ముందునుంచీ తీవ్రంగా వ్యతిరేకిస్తున్నా. ఈ బిల్లుతో ఇప్పుడు ప్రజలు తమకు నచ్చిన వాహనాన్ని కొనుగోలు చేయొచ్చు. అమెరికా ప్రజలను రక్షించడానికే నా మొదటి ప్రాధాన్యం’ అని ట్రంప్ తన పోస్ట్‌లో స్పష్టంచేశారు.

‘అమెరికా పార్టీ’ని స్థాపిస్తున్నట్లు మస్క్ ‘ఎక్స్’ వేదికగా ప్రకటించిన సంగతి తెలిసిందే. అమెరికాలో ప్రస్తుతం ప్రజాస్వామ్యం లేదని, ప్రజలకు స్వేచ్ఛ ఇచ్చేందుకే ఈ నిర్ణయం తీసుకున్నానని తెలిపారు. తన పార్టీ ద్వారా దేశంలోని ద్విపార్టీ వ్యవస్థను సవాలు చేయనున్నట్లు వివరించారు. అయితే తన పార్టీని ఎక్కడ రిజిస్టరు చేసేదీ ఆయన వెల్లడించలేదు.

## దలైలామాకు మోదీ శుభాకాంక్షలు

**చైనా నిరసన**



**రియో డి జనీరో, జూలై 7:** భారత్-చైనా మధ్య ఇటీవల కాలంలో దలైలామా వారసుడి అంశం చర్చనీయాంశంగా మారింది. ఈ క్రమంలో టిబెట్ ఆధ్యాత్మిక గురువు దలైలామా 90వ జన్మదిన వేడుకలు హిమాచల్ ప్రదేశ్‌లోని ధర్మశాలలో అట్టహాసంగా జరగ్గా.. ప్రధాని నరేంద్రమోదీ శుభాకాంక్షలు తెలియజేశారు. అలాగే జన్మదిన వేడుకలకు భారత ప్రతినిధులు హాజరయ్యారు. వీటిపై చైనా అభ్యంతరం వ్యక్తంచేసింది. టిబెట్ సంబంధిత అంశాలపై బీజింగ్ అభిప్రాయాలను న్యూఢిల్లీ పరిగణనలోకి తీసుకోవాలని వ్యాఖ్యానించింది. దలైలామాకు మోదీ శుభాకాంక్షలు చెప్పడంపై మీడియా అడిగిన ప్రశ్నకు చైనా విదేశాంగ శాఖ ప్రతినిధి మావోనింగ్ స్పందించారు. ‘‘టిబెట్ సంబంధిత వ్యవహారాలపై చైనా వైఖరి స్థిరంగా, స్పష్టంగా ఉంది. ఇది అందరికీ తెలుసు’’ అని వ్యాఖ్యానించారు.

## త్యాగనిరతికి, సహనానికి ప్రతీక మొహర్రం



- మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్

**కొండమల్లేపల్లి, జూలై 7 (మనం న్యూస్):** త్యాగనిరతికి, సహనానికి ప్రతీక మొహర్రం అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దేవరకొండ మాజీ శాసనసభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. కొండమల్లెపల్లి మండలం గుమ్మడవెల్లి గ్రామంలో మొహర్రం సందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలు, హిందువులు కలిసి నిర్వహించే 'పీర్ల' ఊరేగింపు తెలంగాణ ప్రజల మధ్య సఖ్యతను, ఐక్యతను, గంగా-జమునా తెహజీబ్ను చూపే సందర్భం అని ఆయన అన్నారు.ఈ పవిత్ర మొహర్రం పర్వదినం శాంతి, సౌభాగ్యం, మత సామరస్యం వెల్లివిరియాలి అని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ ఛైర్మన్ పల్లా ప్రవీణ్,బిఆర్ ఎస్ మండల అధ్యక్షులు వెల్లుగురి వల్లపు రెడ్డి,మారం రవీందర్ రెడ్డి, కేసాని లింగారెడ్డి, వేముల రాజు,ఇస్లావత్ అభిషేక్, రమావత్ రమేష్, రమావత్ తులసీరాం, రామావత్ రమేష్ నాయక్, అర్వపల్లి నర్సింహ, రావుల వెంకటేశ్వర్లు,మాజీ సర్పంచ్ లింగం, గ్రామ శాఖ అధ్యక్షులు లాలయ్య, పెద్దిశెట్టి సత్యం, షేక్ ఇస్మాయిల్, రమావత్ కృష్ణ, పాల్గొన్నారు.

## ఏసీబీ వలలో సివిల్ సప్లై డీటీ జావీద్



**నల్లగొండ జిల్లా 7( మనం న్యూస్ ):** రేషన్ బియ్యాన్ని తరలిస్తూ పట్టుబడ్డ వాహనాన్ని రిలీజ్ చేసేందుకు రూ. 70 వేలను లంచం గా డిమాండ్ చేసిన మిర్యాలగూడ సివిల్ సప్లై డిటి జావిద్ ను ఏసీబీ అధికారులు సోమవారం అరెస్టు చేశారు. మరింత సమాచారం కోసం నల్లగొండ జిల్లా కేంద్రంలోని డిఎస్ఓ కార్యాలయం పై ఏసీబీ అధికారులు దాడులు నిర్వహించి పలు రికార్డులను తీసుకెళ్లారు. జావిద్ అరెస్టుకు సంబంధించి ఏసీబీ అధికారులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కొద్ది రోజుల క్రితం మిర్యాలగూడ డివిజన్లో రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పోలీసులు పట్టుకొని సివిల్ సప్లై శాఖకు కేసును అప్పగించారు. దీంతో వారిపై కేసులు నమోదు చేశారు. వాహనాలను రిలీజ్ చేసేందుకు జావిద్ రూ . లక్ష డిమాండ్ చేయగా బాధితుడు రూ. 70 వేలు ఇచ్చేందుకు ఒప్పుకున్నాడు. జావిద్ తనను డబ్బులు డిమాండ్ చేసిన విషయమై బాధితుడు కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో అంతర్గత విచారణ జరిపించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి గత నెల జావిద్ ను సస్పెండ్ చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. అప్పటినుంచి పరారీలో ఉన్న జావిద్ ను అరెస్టు చేసి నాంపల్లి కోర్టులో రిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

## బాధితులకు సత్వర న్యాయం చేస్తాం



- ఎస్పీ శరత్ చంద్ర పవార్

**నల్లగొండ, జూలై 7 (మనం ప్రతినిధి):** ప్రతి సోమవారం ప్రజల సౌకర్యార్థం నిర్వహించే గ్రీవెన్స్ డే లో బాగంగా సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ శరత్ చంద్ర పవర్ జిల్లాలోని వివిధ ప్రాంతాల నుండి వచ్చిన 68 మంది అర్జీదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకొని సంబంధిత అధికారులతో ఫోన్ లో మాట్లాడి ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖను మరింత చేరువ చేయడం లక్ష్యంగా ప్రజా సమస్యలను పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నామని అన్నారు. పోలీస్ స్టేషన్ కి వచ్చిన ఫిర్యాదుదారులతో మర్యాదగా మాట్లాడి వినతులు స్వీకరించి సంబంధిత ఫిర్యాదులపై క్షేత్ర స్థాయిలో పరిశీలించి వేగంగా స్పందించి బాధితులకు న్యాయం జరిగే విధంగా చూడడం జరుగుతోందని ఎస్పి గారు తెలిపారు. ఎస్పీ ఆఫీస్ కి, పోలీస్ స్టేషన్ కి వచ్చే ఫిర్యాదు దారులు మధ్యవర్తులని తీసుకురావద్దని బాధితులు మాత్రమే వచ్చి ప్రత్యక్షంగా కలిసి ఫిర్యాదుకు సంబంధించిన విషయాలు తెలపాలని ఎస్పి తెలిపారు.

# ఘనంగా ఇందిరా మహిళా శక్తి విజయోత్సవాలు నిర్వహించాలి



**భువనగిరి, జూలై 7 (మనం న్యూస్):** రాష్ట్ర ప్రభుత్వం మహిళల సాధికారత కోసం ఈ నెల10 నుండి 16వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న ఇందిరా మహిళా శక్తి విజయోత్సవ సంబరాలను జిల్లాలో పండుగ వాతావరణంలో నిర్వహించాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం భువనగిరి జిల్లాల్లో ఇందిరా మహిళా శక్తి సంబురాల్లో భాగంగా జిల్లా మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యుల సమావేశానికి జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా హాజరై పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ విజయోత్సవ సంబరాల సన్నద్ధత, కార్యాచరణ కోసం ఈ నెల 8న అన్ని మండలాలలో మండల సమాఖ్య సమావేశాలు, 9 వ తేదీన గ్రామ సంఘాలతో సమావేశాలు నిర్వహించాలని సూచించారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు విజయోత్సవ సంబరాలలో ఉత్సాహంగా పాల్గొనేలా చూడాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు అన్ని రంగాలలో అధిక ప్రాధాన్యత ఇస్తుందని వాటిని మహిళలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా బలోపేతం కావాలని అన్నారు. ప్రభుత్వం మహిళలకు మొదటి ప్రాధాన్యత ఇస్తుందని, కోటి మంది మహిళలు కోటీశ్వరులుగా చేయాలన్న సంకల్పంతో స్వయం సహాయక సంఘాలను అన్ని రంగాల్లో ముందుకు తీసుకెళ్తున్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులకు రుణాలను అందిస్తూ వివిధ యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం సహకారం అందిస్తుందని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా లబ్ధి పొందిన మహిళలను ఆదర్శంగా తీసుకొని జిల్లాలోని అన్ని సంఘాల మహిళలు ఆర్థికంగా బలోపేతం చేయడమే ప్రభుత్వ ఉద్దేశమన్నారు. జిల్లాలో కలెక్టరేట్ ప్రాంగణంలో మహిళల బలోపేతానికి నూతన మహిళ సమాఖ్య భవనం కూడా నిర్మిస్తునామన్నారు. మహిళా సంఘాల సభ్యులు ఈ సంబురాలను గ్రామలలో మహిళలకు వివరంగా వివరించాలన్నారు. గత సంవత్సరం మన మహిళా సంఘాల రుణాలు తీసుకోవడం మన జిల్లా టాప్ లో ఉందన్నారు. మీ గ్రామాల్లో అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు వచ్చి కట్టుకోలేని పరిస్థితి ఉన్న పేదలకి మహిళా సంఘాల తరుపున రుణాలు ఇప్పించి ఇళ్లు కట్టుకునే చిరకాల కోరికను నెరవేర్చాలన్నారు.త్వరలో మహిళా శక్తి కింద పెట్రోల్ బంకులు ఇస్తామన్నారు. బ్యాంకు నుండి తీసుకున్న రుణాలను వృథా చేయకుండా వినూత్నంగా ఆలోచించి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని మంచి లాభాలు పొందాలని కలెక్టర్ సూచించారు. వన మహోత్సవంలో బాగంగా మండలం జిల్లా సమాఖ్య కార్యాలయంలో జిల్లా కలెక్టర్ హనుమంతరావు మొక్క నాటి నీరు పోశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వన మహోత్సవం కార్యక్రమంలో బాగంగా ప్రణాళిక ప్రకారం లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. జిల్లా వ్యాప్తంగా విస్తృతంగా మొక్కలు నాటడం ద్వారా వృక్షసంపద పెరుగుతుందని, మానవ మనుగడకు మొక్కలు ప్రాణాధారం అని జిల్లా కలెక్టర్ సందేశాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, జిల్లా విజిలెన్స్ అధికారి ఉపేందర్ రెడ్డి, అదనపు గ్రామీణాభివృద్ధి అధికారి సురేష్ , యం.పి.డి.ఓ ,యం.పి.ఓ, ఏ.పి.ఓ , జిల్లా సమాఖ్య కార్యవర్గం సభ్యులు పాల్గొన్నారు.

## ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులు దృష్టి పెట్టాలి

- అన్ని రకాల ఫిర్యాదులను మార్కు చేయాలి
- ఏమైనా ఇబ్బందులు ఉంటే ఫిర్యాదుదారులకు తెలియజేయాలి
- జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**నల్లగొండ, జులై 7 (మనం ప్రతినిధి ):** ప్రజావాణి ఫిర్యాదుల పరిష్కారం పై జిల్లా అధికారులు ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలని తాను మార్క్ చేసిన ఫిర్యాదులను తిరిగి కింది స్థాయికి మార్క్ చేయకుండా ప్రత్యక్షంగా వాటిని పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి జిల్లా అధికారులను ఆదేశించారు.ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించిన అనంతరం వివిధ అంశాలపై జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లా స్థాయిలో వచ్చిన ఫిర్యాదులు జిల్లా అధికారులతో పాటు, మండల స్థాయి అధికారులకు మార్క్ చేయడం జరుగుతున్నదని అయితే అలా వచ్చిన వాటిని అధికారులు వారి స్థాయిలోనే పరిష్కరించే చర్యలు తీసుకోవాలని, అలా కాకుండా తిరిగి కింది స్థాయికి పంపించవద్దని, ఒకవేళ సమస్యను పరిష్కరించడంలో ఏమైనా ఇబ్బంది ఉంటే పిర్యాదుదారుకు స్పష్టంగా తెలియజేయాలని చెప్పారు. రేషన్ కార్డుల దరఖాస్తులను పౌరసరఫరాల అధికారులు క్షుణ్ణంగా పర్యవేక్షించాలని, రేషన్ కార్డుకు చేసుకున్న దరఖాస్తు తిరస్కరణకు గురైతే స్పష్టంగా తెలియజేయాలని అన్నారు. మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపీడీవోలు వారి పరిధిలోని కేజీబీవీలను సందర్శించాలని, కేజీబీవీ లలో తక్షణ పనుల నిమిత్తం 20000 రూపాయలు మంజూరు చేయడం జరిగిందని, అయితే సంబంధిత కేజీబీవీల ప్రత్యేక అధికారులు వారికి నచ్చిన పనులు కాకుండా, అవసరమైన వాటిని ప్రతిపాదించాలని సూచించారు .చాలా కేజీబీవీలలో కోతుల బెడద కారణంగా ఫెన్సింగ్ అవసరం ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందని, సిమెంట్ ఫెన్సింగ్ కు ఎక్కువ ఖర్చు అయ్యే అవకాశం ఉన్నందున, ఇతర ఫెన్సింగ్ ప్రతిపాదించాలని చెప్పారు. కాగా ఈ సోమవారం మొత్తం (70) ఫిర్యాదులు రాగా, రెవిన్యూ శాఖకు (47),జిల్లా అధికారులకు (23) వచ్చాయి.అదనపు కలెక్టర్లు జె. శ్రీనివాస్, నారాయణ అమిత్, స్పెషల్ కలెక్టర్ సీతారామారావు, డి ఆర్ డి ఓ శేఖర్ రెడ్డి ,గృహ నిర్మాణ పీడీ రాజకుమార్, ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి ,జిల్లా అధికారులు ప్రజల వద్ద నుండి ఫిర్యాదులను స్వీకరించారు.

## ఘనంగా ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం



**తిరుమలగిరి జులై 07 (మనం న్యూస్):** తిరుమలగిరి మండలకేంద్రంలోని తెలంగాణ చౌరస్తాలో ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ సభను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఆర్పిఎస్ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఇన్చార్జి కందుకూరి మహేష్ మాదిగ మాట్లాడుతూ మాదిగ జాతి అస్తిత్వం ఆత్మగౌరవం తో పాటు అనేక కుల ఉద్యమాలకు పురుడు పోసిన ఉద్యమమే ఎమ్మార్పీఎస్ అన్నారు. నాటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 1994 జులై 7 తేదీన ప్రకాశం జిల్లా ఈదుమూడి అనే గ్రామంలో ఏర్పడి నేటికి సరిగ్గా 31 సంవత్సరాలు. రాజ్యాంగ ఫలాలు రిజర్వేషన్లు ఎస్సీ లో ఉన్న అన్ని ఉపకులాలకు సమాన పంపిణీ సామాజిక న్యాయం జరగాలని జనాభా నిష్పత్తి ప్రకారంగా రిజర్వేషన్ల వర్గీకరణ జరగాలని చేసిన పోరాటం విజయం సాధించిన సందర్భంగా ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ జెండా ఆవిష్కరణ చేశామన్నారు. జనాభా నిష్పత్తి ప్రకారం అందాలని సామాజిక న్యాయమైన ఎస్సీలకు కల్పించిన రిజర్వేషన్లను వర్గీకరించాలని గత 31వ సంవత్సరాలుగా భారతదేశ చరిత్రలోనే ఈ తెలుగు నేల మీద అనేక బలమైన ప్రజా ఉద్యమాలు మిలిటెంట్ పోరాటాల నిర్వహించి ప్రజలు ప్రజాస్వామిక వాదులు అందరి మద్దతుతో ఎస్సీ వర్గీకరణ సాధించుకోవడం జరిగిందని తెలిపారు. ఈ ఉద్యమానికి సహకరించిన అన్ని వర్గాల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. సమాజంలో అన్ని వర్గాలైన వృద్ధుల వితంతుల వికలాంగుల పెన్షన్ల కోసం మరియు గుండె జబ్బు చిన్నారుల కోసం చేసిన ఉద్యమ పోరాటమే ఆరోగ్యశ్రీ కార్డుగా మారిందని ఎస్సీ ఎస్టీలకు ప్రమోషన్లలో రిజర్వేషన్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ అత్యాచారక నిరోధక చట్టం తదితర అంశాలపై రాజీలేని పోరాటం చేసి సాధించింది కేవలం మందకృష్ణ మాదిగని తెలిపారు. ఇక భవిష్యత్తులో సమాజంలో అన్ని వర్గాల పేద ప్రజల సంక్షేమం కోసం జరిగే పోరాటంలో ప్రజలు ప్రజాస్థానిక వాదులు అన్ని వర్గాల ప్రజలు పెద్ద ఎత్తున ఉద్యమంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కందుకూరి నరసింహ నాయుడు, కందుకూరి మల్లయ్య పానగంటి శ్రీనివాస్, ఎర్రబెల్లి వెంకన్న, జేరిపోతుల శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## సిపిఐలో పార్టీలో భారీగా చేరికలు

### ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతర పోరాటాలు

### సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం



**మర్రిగూడ, జూలై 07(మనం న్యూస్ ):** సిపిఐ పోరాటాలకు ఆకర్షితులై శివన్న గూడెం,రాంరెడ్డిపల్లి గ్రామాలకు చెందిన పలువురు జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం సిపిఐ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు.రాంరెడ్డి పల్లి గ్రామం నుండి జాల చంద్రయ్య, కారింగ్ యాదయ్య,అయితగోని యాదయ్య మాజీ బ్యాంకు డైరెక్టర్,ఎడ్ల పెద్దులు,శివన్నగూడ గ్రామం నుండి గౌర్రె కాపల సంఘం అధ్యక్షులు దాసరి జంగయ్య,గుండ్లపల్లి ముత్యాలు,గుండెబోయిన లక్ష్మమ్మ,పంగ యాదమ్మ, భీమనపల్లి కలమ్మ జాయిన్ అయ్యారు.కష్టజీవుల రాజ్య స్థాపన కోసం నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారానికి పోరాటాలు సాగిస్తున్నది సిపిఐ అని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సోమవారం మర్రిగూడెం మండల కౌన్సిల్ సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ప్రజలను పాలక పార్టీలు సంక్షేమ పథకాల ఎరతో నిరంతరం భ్రమలలో ముంచుతూ వారి సమస్యల పరిష్కారంకి కృషి చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అన్నారు 10 సంవత్సరాల క్రితం ప్రారంభమైన డిండి ఎత్తిపోతల ,శివన్న గూడెం రిజర్వాయర్ పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడ అనే చందంగా ఉందని ఆందోళన వ్యక్తం చేశారు .ఎస్ఎల్బీసీ దిండి డిండి ఎత్తిపోతల పథకాలకు అధిక నిధులు కేటాయించి త్వరగా తిన పనులు పూర్తిచేసి సాగు త్రాగునీరు అందించాలని కోరారు. చౌటుప్పల ప్రాంతంలోని కాలుష్య ఫార్మా కంపెనీల అనుమతుల రద్దు కోసం పెద్ద ఎత్తున ప్రజా ఆందోళనకు సన్నద్ధమైతున్నట్లు తెలిపారు.దివిస్ విషకోరాల నుండి ఈ ప్రాంత ప్రజలను కాపాడాలని ప్రభుత్వాన్ని కోరారు. జూలై 15న దేవరకొండ పట్టణంలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని కోరారు.సమావేశంలో సిపిఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు బిక్షం రెడ్డి, మండల కన్వీనర్ బుర్ర శేఖర్,ఏఐవైఎఫ్ జిల్లా అధ్యక్షులు బూడిద సురేష్,మండల కార్యవర్గ సభ్యులు కౌన్సిల్ సభ్యులు,ఎరుకల నిరంజన్,ఆకుల రఘుమయ్య,జక్కల అంజయ్య ఇసుకిల్ల మహేందర్,శిరసవాడ నరసింహ అల్వాల నరసింహ, అయితగోని వెంకటయ్య, ఎరుకల యాదయ్య, వేముల సత్తయ్య,ఎండి నజీర్,రాధమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**భువనగిరి, జూలై 7(మనం న్యూస్):** ప్రజావాణిలో వచ్చిన అర్జీలకు అధిక ప్రాధాన్యమిస్తూ సత్వర పరిష్కారం కోసం చర్యలు చేపట్టాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల ప్రజల నుండి 48 అర్జీలను, జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరారెడ్డితో కలసి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అర్జీలను స్వీకరించారు. సంబంధిత అధికారులు దరఖాస్తులను పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిశీలించి పరిష్కరించాలన్నారు. అందులో రెవిన్యూ శాఖ 34, జిల్లా పంచాయతీ శాఖ 5, జిల్లా వ్యవసాయ శాఖ 2, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ 2, హౌసింగ్, డిప్యూటీ కమీషనర్ ఆఫ్ పోలీస్ , మున్సిపాలిటీ, జిల్లా సంక్షేమ శాఖ, ఇరిగేషన్ శాఖలకు ఒక్కొకటి చొప్పున వచ్చాయని తెలియజేశారు. వివిధ శాఖలకు వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి ప్రజల సమస్యలు పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజావాణి అనంతరం జిల్లా



అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్లు, బడిబాట, వనమహోత్సవం, ఇందిరా మహిళా శక్తి వంటి కార్యక్రమాల పై జిల్లా అధికారులతో సమీక్షించారు. జిల్లాలో మొదటి విడతలో గ్రామాల్లో మంజూరీ అయినా ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు త్వరగా పూర్తి చేయాలన్నారు. ఇంకా పునాది తీసుకోనని వారిని త్వరగా తీసుకునేలా మండలం తహసీల్దార్లు, యం పి డి ఓ లు,మండల ప్రత్యేక అధికారులు చొరవ చూపాలన్నారు. బేస్మెంట్ తీసుకున్న వారికి ప్రతి సోమవారం లక్ష రూపాయలు ఖాతాలో జమ చేయడం జరుగుతుందన్నారు. బడి బాట కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వ పాఠశాల పై నమ్మకం పెరిగిందని చాలా మంది ప్రైవేట్ స్కూల్లో చదివిన విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్స్ తీసుకుంటున్నారన్నారు. వన మహోత్సవంలో భాగంగా మొక్కలు నాటేందుకు మొక్కల సిద్ధంగా ఉన్నాయన్నారు. మొక్కలు నాటిన తర్వాత, నాటిన మొక్కలు సంరక్షించే బాధ్యత కూడా మొక్కను నాటిన వారిపై ఉందన్నారు. ఇందిరా మహిళా శక్తి పథకం కింద ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేసిందన్నారు. మహిళలకు సోలార్ ప్లాంట్ , పెట్రోల్ బంకులు, మహిళా శక్తి క్యాంటీన్లు ఇవ్వడం జరిగిందని తెలిపారు. జిల్లా అధికారులందరూ ఈ కార్యక్రమల పై శ్రద్ధ చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీ సీఈఓ శోభా రాణి, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి నాగిరెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## 9న,దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయండి




- సిపిఎం పార్టీ రాష్ట్ర సభ్యులు కొలిశెట్టి యాదగిరిరావు

**తుంగతుర్తి, జూలై 7 (మనం న్యూస్ ):** కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, కర్షక, ప్రజావ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 9న జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను విజయప్రదం చేయాలని సీపీఎం పార్టీ రాష్ట్ర సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షుడు బుర్ర శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సిఐటియు, ఏఐటీయూసీల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ ప్రభుత్వం అనేక సంవత్సరాల నుండి కొట్లాడి సాధించుకున్న 29 కార్మిక చట్టాలను తొలగించి నాలుగు లేబర్ కోడ్ లుగా తీసుకురావడంలో కార్మిక హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. అనంతరం మెయిన్ రోడ్డుపై రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన పనిగంటల పెంపు జీవో 282ను వెంటనే రద్దు చేయాలనిజీవో 282 ప్రతులను దగ్ధం చేసి నిరసన వ్యక్తం చేశారు. పెట్టుబడిదారులు, కార్పొరేట్ సంస్థల ప్రయోజనాల కోసమే 8 గంటల విధానాన్ని 10 గంటలకు పెంచారని, బీజేపీ ప్రభుత్వ అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలని ఈనెల 9న చేపట్టే సార్వత్రిక సమ్మెకు సకలజనులు మద్దతు ఇచ్చి జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కందాల శంకర్ రెడ్డి, పోలోజు సైదులు, పల్లా సుదర్శన్, గడ్డం ఎల్లయ్య, బోనాల వెంకన్న, దేవరాజు, కార్మిక నాయకులు నాయకులు గుగులోతు రాజారాం, రామస్వామి, జాజుగల ముత్తయ్య, ఉప్పుల సోమయ్య, బత్తుల జనార్ధన్, భాస్కర్, కేవీపీఎస్ నాయకుడు దేవరకొండ యాదగిరి, పూలమ్మ, వెంకయ్య, అంతయ్య, మల్లయ్య, లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్షయ వ్యాధిని సమూలంగా నివారిద్దాం



**పెన్ పహాడ్, జూలై 07 (మనం న్యూస్):** క్షయ వ్యాధిని సమూలంగా నివారిద్దామని వైద్య ఆరోగ్య సిబ్బంది సూచించారు. మండల పరిధిలోని గాజుల మల్కాపురం పల్లె దవాఖానాలో క్షయ వ్యాధి పై వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో సోమవారం నిక్షయ శివిర్-2 క్యాంపు నిర్వహించడం జరిగింది. ఈ శిబిరంలో 58 మంది నుండి తెమడ (కళ్లె) నమూనాలను సేకరించి సి బి నా ట్ ల్యాబ్ కు పంపించడం జరిగిందని ఎం పి హెచ్ ఈ ఓ భూతరాజు శ్రీనివాస్ తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ క్షయవ్యాధి రాకుండా ముందు జాగ్రత్తగా నివారణ చర్యలు(తగు జాగ్రత్తలు) తీసుకోవాలని, ఈ వ్యాధి లక్షణాల్లో భాగంగా వారం రోజులుగా రాత్రి పూట జ్వరం, ఎడతెరిపి లేకుండా దగ్గు, తేమడలో రక్తపు చారలు రావడం, ఆకలి మందగిచడం, బరువు తగ్గటం వంటి లక్షణాలు ఉన్నచో అనుమానిత క్షయ లక్షణాలు గా గుర్తించి మీ సమీప ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎమ్ లను సంప్రదించాలని లేదా మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో సంప్రదించి వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాలని, వ్యాధి నిర్ధారణ ఐతే ఉచితంగా 6 నెలల పాటు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మందులను అందిస్తారని ప్రజలకు సూచించారు క్షయ వ్యాధి నిర్ధారణమైన వారు తగ్గినా తుమ్మినా తుంపర్లు ఇతరులకు వ్యాపించకుండా మూతికి అడ్డుగా చేతి రుమాలు పెట్టుకోవాలని సూచించారు. ఈ క్యాంపు లో గ్రామస్తులకు వర్షా కాలంలో నీటి నిల్వాలు, మురికి నీటి గుంటలలో నీళ్లు నిల్వ ఉండుట వలన దోమలు వృద్ధి చెంది మలేరియా,డెంగ్యూ, ఫైలేరియా మొదలగు విషజ్వరాలు, డయేరియా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉందని కావున ప్రజలు ఇంటి చుట్టు ప్రక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకొని అప్రమత్తంగా ఉండాలని, త్రాగునీటిని వేడి చేసి చల్లార్చి వడకట్టి తాగాలి లేదా పరిశుభ్రమైన నీటిని తాగాలని సూచించారు. ఐ డి సి ఎఫ్,స్టాప్ డయోరియా నిర్మూలనలో బాగంగా 0-5 సంజూజూ ల పిల్లలకు అతిసార వ్యాధి లక్షణాలు ఉంటే వారిని మా సిబ్బంది (ఏఎన్ఎం , ఆశాలు)గుర్తించి ఇంటి వద్దనే ఓ ఆర్ ఎస్, జింక్ టాబ్లెట్ ఇచ్చి చికిత్స చేస్తారని ఎవరికైనా సీరియస్ గా ఉంటే ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి పంపిస్తారని తెలియచేశారు. ప్రపంచ జూనోసిస్ దినోత్సవం సందర్భంగా జంతువులు మరియు మానవుల మధ్య సంక్రమించు వ్యాధుల గురించి (రేవిస్ బౌల్ క్లూ ల కోవిడ్ 19 మొదలగు వ్యాధులు) అప్రమత్తంగా ఉంటూ ఎటువంటి అనారోగ్యం కలిగిన వెంటనే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సంప్రదించాలని సూచించారుఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ ఈ ఓ భూతరాజు సైదులు, ఎల్టి లింగాల రాజు, ఎస్టిఎస్ ప్రిన్సి, ఎంపీహెచ్ఏ బి. ప్రేమ్ కుమార్, ఎంపిహెచ్ఏ (ఎఫ్) ఆర్ పెద్ద సైదమ్మ, ఆర్. చిన్న సైదమ్మ, ఆశా కార్యకర్తలు బి. రమాదేవి, సిహెచ్, రమణ, ఎల్. శారద, యు. అలివేలు, బి. లలిత, గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ విత్తనాలతో రైతులు మోసపోవొద్దు

**విత్తన చట్టాన్ని రూపొందించుటకు చర్యలు తీసుకుంటున్నాం**

**రూ.లక్షా ఐదు కోట్లతో రైతులకు సంక్షేమ ఫలాలు**

**పట్టు వదలని విక్రమార్కుడిలా పనిచేసిన జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్**

**రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకారం, చేనేత, వస్త్రాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు.**

**ఇందిరమ్మ పాలనలో దళారీ దందా ఉండదు**

**గిరిజన ప్రాంతంలో నకిలీ పదం వినిపిస్తే సహించేది లేదు**

**రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క**



**ములుగు/వెంకటాపురం/వాజేడు, జూలై 7(మనం ప్రతినిధి):** నకిలీ విత్తనాలతో రైతులు మోసపో వద్దని, విత్తన చట్టాన్ని రూపొందించుటకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ , సహకారం, చేనేత, వస్త్రాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. సోమవారం ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో వాజేడు, వెంకటాపురం, కన్నాయి గూడెం మండలాల్లో 1521 ఎకరాల్లో మొక్కజొన్న వేసి పంట నష్టపోయిన 671 రైతులకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ , సహకారం, చేనేత, వస్త్రాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, తెలంగాణా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్.అన్వేష్ రెడ్డి, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐటీడీఏ పీఓ చిత్ర మిశ్రా లతో కలిసి 3 కోట్ల 80 లక్షల 97 వేల 264 రూపాయల విలువగల చెక్కులను పంపి ణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ జిల్లాలోని వాజేడు, వెంకటాపురం, కన్నాయి గూడెం మండలాల్లో మొక్క జొన్న పంట వేసి నష్టపోయిన రైతులందరికీ ప్రైవేట్ కంపెనీల ద్వారా నష్టపరిహారం అందించడం జిల్లా అధికారుల సమష్టి కృషితోనే సాధ్యమైందని, రాష్ట్రంలోని రైతులకు లక్ష అయిదు కోట్ల రూపాయలు అందించి రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నామన్నారు. రైతులు విత్తనాలతో మోసపోకుండా రాష్ట్రంలో విత్తన చట్టాన్ని రూపొందిస్తున్నామని అన్నారు. ఆదివాసీల జీవన విధానంలో మార్పు రావడానికి మంత్రి సీతక్క ప్రజా జీవితాన్ని ప్రారంభించడం గొప్ప విషయమని, ప్రైవేటు కంపెనీల యజమానుల మెడలు వంచి రైతులకు నష్టపరిహారం అందించడం జిల్లా అధికారుల కృషి ఎన్నటికీ మరువలేమన్నారు. రాష్ట్రంలోని ప్రజా ప్రభుత్వం పార్టీలకు అతీతంగా అభివృద్ధి ఫలాలను అమలు చేస్తున్నద ని, గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు కలిగినప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుందని అభిప్రాయపడ్డారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ములుగు జిల్లాలో పర్యాటక ప్రాంతాలు ఉన్నాయని, రానున్న రోజులలో కర్రెగుట్టలను పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దామని తెలిపారు. గతంలోని పాలకులు రైతులకు మాయమాటలు చెప్పి ఓట్లు దండుకున్నారని, తాము అధికారంలోకి వచ్చిన అనంతరం ఇందిరమ్మ రాజ్యం ద్వారా రైతులకు అన్ని సంక్షేమ ఫలాలను అందజేస్తున్నామని అన్నారు. కేంద్ర ప్రభుత్వం, ప్రతిపక్షాలు సహకరించకపోయిన అప్పులు తీర్చుతూనే నూతన పథకాలను ప్రవేశ పెడుతున్నామని, జిల్లాలో పామాయిల్ పంట సాగు చేయడమే కాకుండా హార్టికల్చర్, సెరికల్చర్ ద్వారా రైతులకు ఆదాయం అందే విధంగా చర్యలు తీసు కుంటామన్నారు. రైతులు దళారులను ఆశ్రయించ కుండా విత్తనాలు, ఫర్టిలైజర్ కొనుగోలు చేసిన పక్షం లో బిల్లులు తప్పనిసరిగా పొందాలని, వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలని సూచించారు.



### నకిలీని సహించేది లేదు: సీతక్క

ఐదు నెలల పోరాట ఫలితంగా నేడు రైతులు ప్రైవేట్ కంపెనీల ద్వారా నష్ట పరిహారం పొందుతున్నారని, ఇది చరిత్రలోనే నిలిచిపోతుందని మంత్రి సీతక్క తెలిపారు. జిల్లా కలెక్టర్ పలుసార్లు సమావేశా లు నిర్వహించడమే కాకుండా ప్రైవేట్ కంపెనీలను ఒప్పించడంలో విజయం సాధించారని హర్షం వ్య క్తం చేశారు. పలు ప్రాంతాలలో లారీల సమస్య అధి కమైందని సమస్య పరిష్కారం కోసం జిల్లా పోలీసు యంత్రాంగంతో చర్చించడం జరిగిందని, అవసరాలను దృష్టిలో ఉంచుకొని పలువురు మోసానికి గురి చేస్తారని తెలిపారు. దళారీ వ్యవస్థ రూపు మాపేందుకు ప్రతి ఒక్కరు కంకణ బద్ధులు కావాలని పిలుపు నిచ్చారు. 2019 సంవత్సరంలో రైతులు రెండు వేల ఎకరాల మిర్చి పంట కోల్పోగా గత పాలకులు ఏ మాత్రం పట్టించుకోకుండా నేడు తాము చేస్తున్న పని తనాన్ని జీర్ణించుకోని కొందరు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను రైతులను ఎవరు మోసం చేసిన నష్టపరిహారం చెల్లించక తప్పదని హెచ్చరించారు. ఇది రైతులు సాధించిన విజయం అని, ఐదారు నెలలుగా ఈ సమస్యపై పోరాట ఫలితం అని అన్నా రు. మల్టీనేషనల్ కంపెనీలతో ఫైట్ చేసి నష్టపరిహా రం చెల్లించేలా చూశాం అన్నారు. చాలా కష్టపడి పనిచేశారని కలెక్టర్ దివాకర టీఎస్‌ని అభినం దిచారు. ఐదారు కంపెనీల వారందరిని ఒప్పించి నష్టప రిహారం చెల్లించేలా చేశామని, సీడ్ రైతులు కంపెనీలతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు. అనుమ తులు ఉన్న కంపెనీలతోనే ఒప్పందాలు చేసుకుని కలిసి పనిచేయాలని అన్నారు. నష్టపోయి ఏ ఒక్క రైతు సూసైడ్ చేసుకోవద్దనీ, రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక స్కీమ్‌లు తెస్తుందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ, భరోసా, సన్నాలకు బోనస్ లాంటివి తెచ్చిందని అన్నారు. దళారుల ను నమ్మి మోసపోవద్దనీ రైతులని మోసం చేసి ఆర్గనైజర్లు బాగా సంపాదించుకున్నారని తెలిపారు. రైతులను మోసం చేసే ఆర్గనైజర్ల పట్ల కఠినంగా వ్యవహరిస్తాం అని అన్నారు. ఆర్గనైజర్లు రైతులకు డబ్బులు ఇవ్వకుండానే ఇచ్చినట్లు రాసుకున్నారని, అలాంటి దందాలు ఇక మానుకోండి లేదంటే బాగో దని హెచ్చరించారు. ఇది ప్రజా ప్రభుత్వం, రైతు ప్రభుత్వం, మంత్రి తుమ్మలకు ఈ ప్రాంతంపై పూర్తి అవగాహన ఉందని, ఇక్కడ ఆయన చాలా అభివృద్ధి పనులు చేశారని కొనియాడారు. ట్రైబల్ ఎమ్మెల్యే లంతా సీఎంను కలిసి తమ ప్రాంతంలో అదనంగా ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలని కోరితే అదనంగా మం జూరు చేశారని అన్నారు. ఈ సందర్భంగా తెలంగా ణ వ్యవసాయం, రైతు సంక్షేమ కమిటీ చైర్మన్ ఎం.కోదండ రెడ్డి మాట్లాడుతూ విత్తనం పై రైతుకు హక్కు ఉంటుందని దానిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దేశానికి అన్నం పెట్టే రైతన్న వెన్నుముక లాంటి వారిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతుల సంక్షేమం కోసం అదనంగా నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. పలు మండ లాల్లో జరిగిన నష్టాన్ని అంచనా వేయడానికి నిపుణు ల కమిటీ నియమించి దేశంలోనే మొదటిసారిగా నష్టపరిహారం చెల్లించడం జరిగిం దని, విత్తనాలకు బండగారం తెలంగాణ రాష్ట్రమని అన్నారు. కార్యక్రమంలో రైతుల సంక్షేమ కమిషన్ సభ్యులు మరికాంతి భవాణి, రాములు నాయక్, రామ్ రెడ్డి గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, కేవీ నర్సింహా రెడ్డి, మాజీ ఎంఎల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, అదనపు ఎస్పి సదానందం, ఆర్డీఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత వివిధ శాఖల అధికారులు, కార్యాలయ సిబ్బంది రైతులు, తదితరులు పాల్గొన్నారు.

---

## పోలీస్ స్టేషన్‌ను ప్రారంభించిన మంత్రి



**మంగపేట, జూలై 7(మనం ప్రతినిధి):** సోమవారం ములు గు జిల్లా మంగపేట మండల కేంద్రంలో రూ.2 కోట్ల 50 లక్షలతో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్ నూతన భవనా న్ని రాష్ట్ర పంచాయితీ రాజ్ గ్రామీణాభివృద్ధి స్త్రీ శిశు సంక్షే మ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ (సీతక్క), ఎస్పీ శభరీష్‌తో కలిసి ప్రారంభించా రు. కార్యక్రమంలో పోలీస్ అధి కారులు కాంగ్రెస్ పార్టీలోని వివిధ శ్రేణులు, ఇంకా పలువురు కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

---

## 9న జరిగే సార్వత్రిక సమ్మెకు టీపీఎస్ మద్దతు



- **టీపీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య**

**వర్ధన్నపేట, జూలై 7(మనం ప్రతినిధి):** ఈ నెల 9వ తేదీన జరుగనున్న సార్వత్రిక సమ్మెకు తెలంగాణ అంబేద్కర్ సంఘం రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలలో మద్దతు ప్రకటిస్తున్నామని సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జన్ను నర్సయ్య తెలిపారు. సోమవారం వర్ధన్నపేట నియోజక వర్గ కేంద్రంలో విలేఖర్లతో మాట్లాడుతూ దేశ సంపదను బడా కార్పొరేట్లకు కట్ట బెట్టేందుకు బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను మారుస్తూ ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని విమర్శించారు. పలు సమస్యలకు పరిష్కారం చూపే దిశగా సమ్మె కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో తెలంగాణ అంబేద్కర్ సంఘం వరంగల్ జిల్లా కో కన్వీనర్ జంగిలి భాస్కర్, జాతీయ బీసీ సంక్షేమ సంఘం వర్ధన్నపేట కార్యదర్శి మామిండ్ల చెన్నయ్య పాల్గొన్నారు.

---

## మంత్రుల పర్యటనను అడ్డుకోవడం సిగ్గుచేటు



- **డాకుల అశోక్**

**ములుగు, జూలై 7(మనం ప్రతినిధి):** ములుగు జిల్లా వాజేడు మండలంలో గత సంవత్సరం నకిలీ విత్తనాల వల్ల నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెక్కుల పంపిణీ కార్యక్రమం, మంగపేట మండలంలో నూతన పోలీసు స్టేషన్ భవన ప్రారంభ కార్యక్రమంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వచ్చిన మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, మంత్రి సీతక్క పర్యటనలను బీఆర్ఎస్ నేతలు అడ్డుకోవడానికి రావడంపై డాకుల అశోక్ మండిపడ్డారు. ములుగులో ఉన్న బి ఆర్ ఎస్ నాయకులకు చేత కాక పక్క నియోజకవర్గాల నుండి అద్దెకు తెచ్చుకుని వారితో పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బి ఆర్ ఎస్ నాయకులు చేయలేని అభివృద్ధి ప్రజా నాయకురాలు మంత్రి సీతక్క చేస్తుంటే జీర్ణించుకోలేక పోతున్నారన్నారు. ములుగులో చిల్లర మాటలు మాట్లాడిన నాయకుల గత చరిత్ర గురించి మాట్లాడాలంటే సమయం వృథా అని అన్నారు. మంత్రి సీతక్క గురించి గానీ మా కాంగ్రెస్ పార్టీ నాయకుల గురించి ఇంకోసారి మాట్లాడితే మీకు పుట్టగతులు ఉండవని మీడియా సాక్షిగా హెచ్చరించారు. ఈ సమావేశంలో ములుగు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ భానోత్ రవిచందర్, జిల్లా నాయకులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, యూత్ నాయకులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

---

## లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ



**ములుగు, జూలై 7(మనం ప్రతినిధి):** సోమవారం ములుగు జిల్లా వాజేడు మండల కేంద్రంలో వాజేడు, వెంకటాపురం, కన్నాయి గూడెం మండలాల్లో 1521 ఎకరాల్లో మొక్కజొన్న వేసి పంట నష్టపోయిన 671 రైతులకు రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్ , సహకారం, చేనేత, వస్త్రాల శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణ అభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి దనసరి అనసూయ సీతక్క, తెలంగాణా వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం.కోదండరెడ్డి, తెలంగాణా విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ ఎస్. అన్వేష్ రెడ్డి, భద్రాచలం శాసన సభ్యులు తెల్లం వెంకట్రావు, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్, ఐటీడీఏ పి.ఓ.చిత్ర మిశ్రాలతో కలిసి 3 కోట్ల 80 లక్షల 97 వేల 264 రూపాయల విలువ గల చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో రైతుల సంక్షేమ కమిషన్ సభ్యులు మరికాంతి భవాని, రాములు నాయక్, రాంరెడ్డి గోపాల్ రెడ్డి, గడుగు గంగాధర్, కేవీ నర్సింహారెడ్డి, మాజీ ఎంఎల్సి బాలసాని లక్ష్మీనారాయణ, ఏఎస్పీ శివం ఉపాధ్యాయ, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, అదనపు ఎస్పీ సదానందం, ఆర్డీఓ వెంకటేష్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రజా సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ఏకైక లక్ష్యం

- **సొంతింటి కల నెరవేరుతున్న వేళ.. లబ్ధిదారుల ముఖంలో చిరునవ్వు**
- **ఇందిరమ్మ ఇళ్ల భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న ఏఎంసీ చైర్మన్**



**పరకాల, జూలై 7 (మనం న్యూస్):** పరకాల పురపాలక సంఘం రెండవ వార్డ్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు బొమ్మకంటి రుద్రమదేవి- చంద్రమౌళి ఇల్లు మంజూరు కావడం జరిగింది. ముఖ్య అతిథిగా పరకాల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి రెండో వార్డులో ఇందిరమ్మ ఇల్లు భూమి పూజ చేసి, కొబ్బరికాయ కొట్టి ఇల్లు నిర్మాణం కోసం ముగ్గు పోసి ప్రారంభించ డం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా ఏ ఒక్క ఇల్లు కూడా మంజూరు చేయని గత ప్రభుత్వం కేవలం అసమర్థ పాలన పరిపాలించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ప్రజా సంక్షేమ పథకాల ద్వారా పేద ప్రజలను ఆదుకునే రీతిలో నడిపిస్తున్నదని తెలంగాణ రాష్ట్రంలో ఇందిరమ్మ ఇండ్ల కట్టుకుని బాగుపడాలని అర్హులైన వారికి ఇండ్లు మంజురు చేసి వారిని ఆదుకునే రీతిలో ప్రభుత్వం ప్రజాపాలన కొనసాగిస్తుందన్నారు. సొంతింటి కల నెరవేరుతున్న వేళ ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులు ఆనందాన్ని వ్యక్తం చేస్తున్నారని ప్రభుత్వాన్ని కొనియాడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏఎంసి డైరెక్టర్ బొమ్మకంటి రుద్రమదేవి - చంద్రమౌళి, (ఎస్సీ సెల్ అధ్యక్షులు) హనుమకొండ జిల్లా సేవాదళ్ అధ్యక్షులు బొచ్చు చం దర్, కాంగ్రెస్ నాయకులు మచ్చ సుమన్, పోరండ్ల వేణు, బొచ్చు మోహన్, బొచ్చు జెమిని, దావు పరమేశ్వర్ వార్డ్ ఆఫీసర్ కృష్ణంరాజు, ఇందిరమ్మ కమిటీ సభ్యులు మడికొండ కవిత చంగల్ రావు, రిటైర్డ్ హెచ్ ఎం ఆకునూరి పుష్ప విజయ్ కుమార్, రిటైర్డ్ సిఎస్ఐ పాస్టర్ రే, బొచ్చు ప్రకాశం మంద మహేష్, ఒంటేరు అమర్నాథ్, కుక్ మూడి రాజారాం చుక్క శాంతి కుమార్, దుప్పటి అన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

---

## ప్రథమ చికిత్సా కేంద్రంలో ఆకస్మిక తనిఖీ

- **పరిశీలించిన డీఎం అండ్ హెచ్ఓ**



**మహబూబాబాద్, జూలై 7(మనం ప్రతినిధి):** జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ రవి రాథోడ్ నేతృత్వంలో సోమవారం మరిపెడ బంగ్లా లోని రవి బాబు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శిం చారు. జిల్లా వైద్యాధికారి అక్కడ రోగులకు అందిస్తున్న చికిత్స విధానా న్ని పరిశీలించగా ఎలాంటి అర్హతలు లేకుండా రోగుల కు స్టెరాయిడ్ ఇంజక్షన్లు, ఆంటీ బయాటికులు, సెలైన్ బాటిల్స్ ఎక్కిస్తూ చికిత్స చేస్తుండగా జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి ఆగ్రహం వ్యక్తం చేస్తూ రవి బాబు నిర్వహిస్తున్న ప్రథమ చికిత్స కేంద్రాన్ని సీజ్ చేయడం జరిగింది. అంతే కాకుండా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రథమ చికిత్స కేంద్ర నిర్వాహకులు కేవలము ప్రథమ చికిత్స ను మాత్రమే చేయాలని, యాంటీ బయాటిక్ ఇంజెక్షన్లు, మాత్రలు ఇవ్వరాదని, ఐ వి ఫ్లూయిడ్స్ పెట్టరాదని, పేరు ముందు డాక్టర్ అని రాసుకో రాదని, అర్హత కి మించి వైద్యం చేయరాదని హెచ్చరికలు జారీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా డిప్యూటీ మాస్ మీడియా అధికారి కొప్పు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

---

## మృతుల బాధిత కుటుంబాలకు బీమా నగదు



**దుగ్గొండి, జూలై 7(మనం న్యూస్):** దుగ్గొండి మండలంలోని దేశాయిపల్లి గ్రామంలో గల శ్రీరాజ రాజేశ్వర పురుషుల పొదుపు సంఘంలో సభ్యులుగా ఉండి పలు కారణాలతో మరణించిన ఉత్తరేణి నరేష్, అంకేశ్వరపు చంద్రమౌళిల కుటుంబ సభ్యులకు సోమవారం సంఘ అధ్యక్షులు కండికొండ రవీందర్ అధ్యక్షతన సమితి అధ్యక్షులు మహమ్మద్ ఉస్మాన్ చేతుల మీదుగా సామూహిక,అభయనిధి పథకాల విపత్సాయము నగదును అందజేశారు. ఒక్కొక్క కుటుంబానికి రెండు పథకాలకు సంబంధించిన రూ.80 వేల చొప్పున మొత్తం రూ.ఒక లక్షా 60 వేల నగదును అదజేసినట్లు సమితి అధ్యక్షులు, సంఘం అధ్యక్షులు ఉస్మాన్, రవీందర్ తెలిపారు. కార్యక్రమంలో సంఘ ఉపాధ్యక్షులు తుత్తురు రవీందర్, పాలకవర్గ సభ్యులు బుట్టి రాజు, భూతం లింగమూర్తి, పిండి రఘు, లాసాని రాజు,సోలంకి శ్రీనివాస్, ఇమ్మడి పవన్ కళ్యాణ్, బూస రమేష్, కాటబత్తిని ప్రకాష్, తొగరు సాంబయ్య, సంఘ గనుకులు నల్లబెల్లి సుమన్ మృతుల కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

---

# ప్రజావాణి దరఖాస్తుకు స్పందించిన కలెక్టర్

- **అల్లిపురంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళు కేటాయింపు**



**ఖమ్మం, జూలై 7(మనం న్యూస్) :** ప్రజావాణిలో అందించిన దరఖాస్తుకు వెంటనే కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి స్పందించారు. సంబంధిత లబ్ధిదారునికి అల్లిపురంలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇంటిని కేటాయించి సమస్యను పరిష్కరించారు. ఖమ్మం మండలం ముస్తఫానగర్ కు చెందిన తుపాకుల శైలజకు 2022లో వైయస్సార్ కాలనీలో డబుల్ బెడ్ రూమ్ ఇల్లు మంజూరైంది. అప్పుడు అనారోగ్య కారణాల వల్ల ఇల్లు తీసుకోలేక పోయామని, తమకు న్యాయం చేయాలని కోరుతూ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో దరఖాస్తు చేసుకుంది. వెంటనే స్పందించిన కలెక్టర్ సంబంధిత ఖమ్మం అర్బన్ మండల తహాశీల్దార్‌కు ఆదేశాలు జారీ చేశారు. అల్లీపురంలో నిర్మించిన ఇందిరమ్మ ఇల్లు (డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల) నందు డి3 బ్లాక్ లో జి1 ఇంటిని తుపాకుల శైలజకు కేటాయించారు. ఇందిరమ్మ ఇంటి పట్టా ధృవపత్రంను తుపాకుల శైలజ దంపతులకు సోమవారం అందజేశారు. ప్రజావాణిలో దరఖాస్తు సమర్పించిన రోజే ఆ సమస్య పరిష్కారమై డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కేటాయించినందుకు లబ్ధిదారులు సంతోషాన్ని వ్యక్తం చేస్తూ కలెక్టర్, అధికారులకు కృతజ్ఞతలు తెలియజేశారు. ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో జిల్లా యంత్రాంగం కృషి చేస్తుందని, నిబంధనల మేరకు ఉన్న ప్రతి దరఖాస్తును పరిష్కరిస్తామని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# పండుగ వాతావరణంలో మనం ఆత్మీయ సమ్మేళనం




# జర్నలిస్టుల సంక్షేమానికి కార్యాచరణ షురూ

## సంక్షేమ నిధికి శ్రీకారం.. కార్యవర్గం ఎన్నిక

- తెలంగాణ రాష్ట్ర అధ్యక్షునిగా నామా పురుషోత్తం
- ఆంధ్రప్రదేశ్ అధ్యక్షునిగా చెంగల్ రాయులు(గాంధీ)
- మనం ఓ కుటుంబం: ఎడిటర్ రమేష్ కుమార్
- అనుభూతులు పంచుకుని.. 'మనం'తో అనుబంధాలను పెంచుకుని.. భవిష్యత్ 'దీక్ష' తీసుకున్న సిబ్బంది



హైదరాబాద్, మనం ప్రతినిధిః రెండు తెలుగు రాష్ట్రాలలో దిగ్విజయంగా నడుస్తోన్న 'మనం' దినపత్రిక నిర్వహించిన 'ఆత్మీయ సమ్మేళనం' ఆరంభం నుంచి ఓ వేడుకగా సాగింది. సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్, ఫౌండర్ ఎడిటర్ వుప్పరి రమేష్ కుమార్ నేతృత్వంలో జరిగిన ఈ సమావేశానికి వచ్చిన జర్నలిస్టులు, సిబ్బందిని పేరుపేరున ఆత్మీయంగా పలుకరించారు. వారి క్షేమ సమాచారాలు అడిగి తెలుసుకున్నారు. సంస్థలో పని చేసే ప్రతి ఒక్కరూ తమ కుటుంబ సభ్యులేనన్నారు. మీ సాధకబాధకాలు 'ఫేస్ టు ఫేస్' తెలుసుకునేందుకు ఈ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేసినట్టు ఆయన వెల్లడించారు.

### జర్నలిస్టుల సంక్షేమానికి కార్యాచరణ షురూ..

'మనం'లో పనిచేసే పాత్రికేయులు, సిబ్బంది సంక్షేమం కోసం ఒక నిధిని ఏర్పాటు చేస్తున్నట్టు ఈ సందర్భంగా రమేశ్ ప్రకటించారు. ఆపత్సమయాల్లో ఆదుకోవడంతో పాటు అనారోగ్యం బారిన పడ్డవారికి ఆర్థిక సహాయం చేయడం, సిబ్బంది పిల్లల విద్య, పెళ్లిళ్లు, సొంతింటి కల సాకారం.. వంటి వాటికి ఆర్థికంగా చేయూతనివ్వడం కోసం ఈ సంక్షేమ కార్యక్రమాన్ని మొదలుపెడుతున్నట్టు రమేశ్ కుమార్ వెల్లడించారు. తన 20 ఏండ్ల నాటి కల ఈ నాడు ఆచరణలో పెడుతున్నందుకు సంతోషం కలుగుతుందని చెప్పారు. ఈ నిర్ణయాన్ని 'మనం దినపత్రిక 'కుటుంబ సభ్యులు' కరతాళ ధ్వనులతో స్వాగతిస్తూ హర్షం వ్యకం చేశారు.

### తొలి కంట్రిబ్యూషన్ రూ. లక్ష..

తన వంతు 'తొలి' కంట్రిబ్యూషన్‌గా రెండు రాష్ట్రాలకు చెరో లక్ష రూపాయలను అందజేస్తున్నట్టు రమేశ్ కుమార్ ప్రకటించారు. ఇది వచ్చే ఏడాది నాటికి కోటి రూపాయల నిధిని సమకూర్చేలా ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు ఆయన చెప్పారు. దసరా పండుగ నుంచి ఇది పూర్తి స్థాయిలో తన పని చేస్తుందని తెలిపారు. తాను ఈ జర్నలిజం వృత్తిలో 25 ఏండ్లుగా ఉన్నానని, అర్ధరాత్రి ఎవరికి ఏ ఆపదొచ్చినా స్పందిస్తానని, సమస్యల పరిష్కారం కోసం అర్ధరాత్రి, అపరాత్రి అనుకోకుండా ముందుండి కృషి చేస్తున్నానని ఆయన చెప్పారు.

### సంక్షేమ నిధికి అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక..

ఈ ప్రకటిత సంక్షేమాన్ని ప్రతి ఒక్కరికీ అందేలా పర్యవేక్షించడానికి రెండు తెలుగు రాష్ట్రాలకు వేరువేరుగా కమిటీలను నియమించారు. తెలంగాణ కమిటీ తొలి అధ్యక్షుడుగా నామా పురుషోత్తం, కార్యదర్శులుగా శ్రీనివాస్, రవిందర్, కోశాధికారిగా హేమంత్ ఎన్నికయ్యారు. ఏపీ కమిటీకి అధ్యక్షుడుగా చెంగల్‌రాయుడు(గాంధీ), కార్యదర్శిగా రవి ఎన్నికయ్యారు. ఆంధ్రప్రదేశ్ సంక్షేమ నిధికి అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్నికైన చెంగల్ రాయుడు(గాంధీ),రవి చెరో రూ. 10,000 లు విరాళంగా ప్రకటించారు.

'మనం' అన్న పదం భావోద్వేగాలతో కూడిన ప్రేమానుబంధాలకు.. స్నేహపూర్వక సంబంధాలకు సంకేతంగా.. మనలో ఒక అనిర్వచనీయమైన అనుభూతిని కలిగిస్తుంది. అలాంటిది ఆ పేరుతో ఉన్న పత్రికలో పనిచేయడం అంటే జర్నలిస్టులకు విజ్ఞానం, ఉద్యోగ సంతృప్తితో పాటు నూరు శాతం ఆనందాన్ని, సంతోషాన్నిస్తది. అక్షరాలా ఇలాంటి అనుభూతినే ఇచ్చింది 'మనం' ఆత్మీయ సమ్మేళనం.. 2016లో ఆరంభమైన 'మనం' దినపత్రిక తన ప్రగతిశీల గమనంలో ఎనిమిది వసంతాలు పూర్తి చేసుకుని తొమ్మిదో వసంతంలోకి అడుగుపెట్టిన సందర్భంగా హైదరాబాద్‌లో 'ఆత్మీయ సమ్మేళనం' జరుపుకుంది. ఆనందోత్సాహాల మధ్యన ఘనంగా జరిగిన ఈ వేడుకలో జర్నలిస్టుల సంక్షేమానికి 'మనం' శ్రీకారం చుట్టి మరోసారి తన ప్రత్యేకతను చాటుకుంది. పాత్రికేయుల మేలు కోసం యాజమాన్యం వేసిన ఈ తొలి అడుగు పత్రికా రంగానికే ఆదర్శంగా నిలుస్తుంది.

### ఉత్తమ జర్నలిస్టులకు అవార్డులు..

మనం దిన పత్రికలో ఈ ఏడాది కాలంలో 'ది బెస్ట్' వార్తలు, కథనాలు రాసి అవార్డులకు ఎన్నికైన వారిని ఈ సమావేశంలో 'ఉత్తమ జర్నలిస్టు' అవార్డులతో సత్కరించారు.

తెలంగాణ రాష్ట్రంలో మొదటి ఉత్తమ జర్నలిస్టుగా నామా పురుషోత్తం, ద్వితీయ ఉత్తమ జర్నలిస్టుగా బుక్కా రాంబాబు, తృతీయ ఉత్తమ జర్నలిస్టులుగా ఎన్నికైన గోపాల్, సంజీవ రెడ్డి, యంగ్ అండ్ డైనమిక్ జర్నలిస్టుగా సుధీర్‌లకు అవార్డును అందజేసి శాలువాతో సత్కరించారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మొదటి ఉత్తమ జర్నలిస్టుగా రవి, ద్వితీయ ఉత్తమ జర్నలిస్టుగా చెంగల్ రాయులు(గాంధీ)లకు అవార్డులను పురస్కరించారు.

### తమ సారథిని ఘనంగా సత్కరించుకున్నమనం సిబ్బంది..

అనంతరం మనం దినపత్రికకు సేవలందిస్తున్న జర్నలిస్టులు, సిబ్బందిని కూడా సత్కరించారు. రెండు రాష్ట్రాల నుంచి కార్యక్రమానికి హాజరైన జర్నలిస్టులందరూ దినపత్రిక సారథి రమేశ్ కుమార్‌ను ఘనంగా సన్మానించారు.

2016 నుంచి ఆరంభమైన నాటి నుంచి నేడు జరిగిన ఈ కార్యక్రమం ఒక మధుర జ్ఞాపకం గా ఉంటుందని పలువురు జర్నలిస్టులు అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా పలువురు జర్నలిస్టులు మాట్లాడుతూ... ఈ అవార్డు, సత్కారం మాకు భాద్యతను పెంచిందన్నారు. సంక్షేమ నిధి ఏర్పాటుతో తమకు 'మనం' అనే ఆపద్బంధు ఉన్నారనే నమ్మకంతో.. యాజమాన్యమిచ్చిన భరోసాతో గుండెనిండా సంతోషంతో తిరిగి వెళుతున్నామని చెప్పారు.























పాశ మైలారంలో కెమికల్ కంపెనీ అగ్నిప్రమాద మృతులకు సంతాపం ప్రకటిస్తున్న సమావేశం

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam Publications Private Limited, Printed at Sree Seshasai Enterprises Plot No: 98/1, CIE Phase II, Gandhinagar, Quthabullapur Mandal, Medchal-Malkajgiri, Hyderabad-500037.Telangana state and Published From : Samrat Complex, Block A , Flat No : 8A, Saifabad, OPP : A G Office, Beside: Aranya Bhavan, Hyderabad, Pin : 500004, Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952.